ఘు గ్రంథాలు

# తెలుగు జానపద విజ్ఞానం

ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగు జానపద విజ్ఞానం

ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం

హైదరాబాద్

తెలుగు జానపద విజ్ఞానం

Telugu Janapad Vignanam

రచయిత : ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి

ISBN : 81-86073-377-0

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య: 518

వెల : రూ. 20/-

ప్రతుల సంఖ్య : 5000

ముద్రణ : డిసెంబరు, 2012

ప్రతులకు : సంచాలకులు
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్.

**యన్. కిరణ్ కుమార్ రెడ్డి**

**ముఖ్యమంత్రి**
**ఆంధ్రప్రదేశ్**

**హైదరాబాదు**



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్జ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR,** B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

**(వట్టి వసంతకుమార్)**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వ విద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 'తెలుగు జానపద విజ్ఞానం' అనే అంశం మీద చిరుపొత్తాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయ రిజిస్టర్ ఆచార్య కె.ఆశీర్వాదం గారికి, ఆచార్య సి.మృణాళినిగారికి మరియు ఆచార్య డి. మునిరత్నం నాయుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

Blank Page

# తెలుగు జానపద విజ్ఞానం

జానపద విజ్ఞానం ఒక సమూహానికి సంబంధించిన ఒక అమూల్య సంపద. ఒక తరం నుంచి మరో తరానికి, ఒక సమూహం నుంచి మరో సమూహానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అందుతున్న తరగని సంపద అది. అది ఆయా సమూహాలకి సంబంధించిన జీవన విధానాన్ని, వైవిధ్యాన్ని, ఆ విధానంలో ఏర్పర్చుకొన్న వ్యవస్థని, ఆ వ్యవస్థ మీద పొందుపర్చుకొన్న నమ్మకాన్ని, అనుభవ వైవిధ్యాన్ని చూపిస్తుంది. అది పునాది. వర్తమాన జీవన రీతుల్ని నిర్దేశిస్తుంది. భవిష్యత్తు జీవితానికి ఆధారభూతమవుతున్నది. అందులో సమూహం యొక్క మాట, చేష్ట, పాటవం, పరికరం, అవాసం, ఆలోచన, హృదయ స్పందన కనబడుతుంది. సమాజం లేదా సమూహం చలనశీలి కనుక ఆ స్వభావం జానపద విజ్ఞానంలో కూడా ఉంటుంది.

తెలుగునాట ప్రచారంలో ఉండిన, ఉన్న పాటలు, కథాగానాలు, పురాగాథలు, స్థలపురాణాలు, కులపురాణాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, కళారూపాలు, ఆచారాలు, అనుష్ఠానాలు, జాతర్లు, ఉత్సవాలు, పండుగలు, దేవతలు, ఆటపాటలు, ఆరోగ్య జాగ్రత్తలు, వంటలు వార్పులు, వృత్తులు - విజ్ఞానం, పరికరాలు పనిముట్లు, కొలమానాలు, చెట్లు చేమలు, ఊరు - ఇల్లు ఆవాసయోగ్యం చేసుకొన్న తీరు, అలంకరణలు ఆభరణాలు, నిల్వ చేసుకొనే పద్ధతులు లాంటి బహుముఖ రూపాలలో జానపద విజ్ఞానం కనబడుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, సమాచార సాంకేతిక పరిణామాలు తెలుగు వారి జీవన విధానంలో కూడా మార్పులు తెస్తున్నాయి. ఆనాటి పని - పాటలు మారినాయి. ఆహార రీతులు, ఆరోగ్య జాగ్రత్తలు, కాపురానికి కుదురయిన ఇల్లు, కుటుంబ వ్యవస్థలో మార్పులు స్పష్టంగా కనబడుతున్నాయి. 'హరిత విప్లవం' వ్యవసాయ జగత్తునే మార్చివేసింది. స్వావలంబన శక్తి సన్నగిల్లింది. తరతరాల అనుభవ దొంతరల పేటిక అయిన సంప్రదాయ విజ్ఞానానికి మెరుగులు దిద్దుకోవడం పక్కన పెట్టి అనుకరణల మీద మోజు పెరిగింది. 'ప్రపంచీకరణ' పరవళ్లు తొక్కుతుంది. ఆ ప్రవాహాన్ని తన జీవన గమనానికి అలంబనగా తెలుగు

సమాజం చేసుకొంటుందా లేక ఆ వెల్లువలో కొట్టుకపోతుందా అన్నది భవిష్యత్తు నిర్ణయించే విషయం.

తెలుగు జానపద విజ్ఞాన అధ్యయనం నూరేండ్ల చరిత్ర కల్గింది. సి.పి. బ్రౌను, జె.యె. బోయల్, నందిరాజు చలపతిరావు దగ్గరినుంచి నేటి దాకా జానపద విజ్ఞాన బహుముఖాంశాలకు సంబంధించిన సేకరణ, అధ్యయనం నిర్విరామంగా జరుగుతుంది. తెలుగు జానపద విజ్ఞానానికి సంబంధించినంత వరకు జే.ఏ. బోయల్ మొదటి క్షేత్ర పర్యాటకులు. పరిపాలనా పరమైన కార్యక్రమాల్లో భాగంగా ఒక బంగళాలో బస చేసినపుడు తన మనస్సుకి గిలిగింతలు పెట్టిన ఒక పాటను విని వాళ్ల దగ్గరికి వెల్లి ఆ పాట తాలూకు వివరాల్ని, అర్థాల్ని సేకరించినాడు. ఆయనే సర్వాయి పాపన్న కథని కూడా సేకరించినది. ఆరేడు వందల పుస్తకాలు అచ్చయినాయి. బిరుదురాజు రామరాజు గారితో ప్రారంభమయి మూడు వందలకు పైగా పి. హెచ్. డిలు, మరో మూడు వందలపైగా ఎం.ఫిల్ పట్టాలు ఈ రంగంలో వచ్చాయి. వృత్తిగాకపోయినా సొంత డబ్బు ఖర్చు పెట్టుకొని, పల్లెపల్లెలు, మారుమూల ప్రాంతాలు తిరిగి, ప్రజలతో కలగల్సిపోయి వాళ్ల మాటల్ని, పాటల్ని, ఆచారాల్ని, అలా ఎన్నో విషయాలని సేకరించి నేపథ్యవివరాలని, సందర్భ ప్రాధాన్యాన్ని వివరిస్తూ భావితరాల కోసం వేల వేల పేజీల సేకరణను ఇచ్చిపోయిన నేదునూరి గంగాధరం గారు వ్యక్తి కాదు ఒక సంస్థ. టేకుమళ్ల కామేశ్వరరావు, హరి ఆదిశేషువు, తూమాటి దొణప్ప, బిరుదురాజు రామరాజు లాంటి పండితుల అధ్యయనం జానపద సాహిత్యం శిష్టసాహిత్యానికి తీసిపోదు అనే విషయం చెప్పుతుంది. నాటి నుంచి నేటి దాకా అధ్యయనాలు కొత్త పుంతలు తొక్కుతూ, జానపద విజ్ఞాన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. తెలుగు జానపద విజ్ఞాన రూపురేఖల్ని ఒక దగ్గర చేర్చిన గ్రంథం ఆంధ్రుల జానపద విజ్ఞానం. కర్త ఆర్వీయస్ సుందరం.

ఈ నేపథ్యం ఈ రచనకు ప్రేరణ. గత అధ్యయనం చాలా వరకు ప్రక్రియాత్మకమయింది. అందులో కనబడే జీవనరీతులు ఏ సమూహానికి, లేక ఏ ప్రాంతానికి లేక ఏ కాలానికి సంబంధించినవో నిర్ధారించడం అంత సులభం కాదు.

అయినా వీటికతీతంగా తెలుగు సమూహం జీవన విధానం యొక్క ప్రతిబింబం ఈ సేకరణలలో ఎంత వరకు కనబడుతుంది అన్న విషయం ఆరా తీయడానికి చేసిన ప్రయత్నం ఇది. చాలా కొద్ది సంకలనాలు మాత్రమే ఇందుకు ఆకరాలు.

ఇల్లు కాపురానికి కుదురు అయితే ఆ ఇండ్లకి కుదురు ఊరు. కుటుంబానికి ఇల్లు సామాజిక, సాంస్కృతిక కవచం అయితే ఊరు ఆ కుటుంబ సమూహాలకి, సమాజాలకి, సాంస్కృతిక కవచం లాంటిది. ఇల్లు, ఊరు నిర్మాణంలో, జీవించడానికి తగ్గట్టుగా మలచుకోవడంలో, అందులోని వ్యక్తులు మసలు కోవడంలో అనూచానంగా ఒక పద్ధతిని పాటించారు. ఒక 'వ్యవస్థ'ని ఏర్పర్చుకొన్నారు. ఆ 'వ్యవస్థ' రూపురేఖల్ని తెలియజేస్తుంది జానపద విజ్ఞానం. వీటి వెనుక ఆయా సమూహాలకి సంబంధించిన ఒక నమ్మక వ్యవస్థ ప్రభావం ఉంటుంది.

## ఇల్లు కాపురానికి కుదురు

ఇండ్లు ఆయా కుటుంబాల స్తోమతని చూపిస్తాయి. దాన్ని పట్టి ఇంటి వైశాల్యం, గదుల సంఖ్య, పై కప్పు ఉంటుంది. కొంతమంది ఒకే గదినే వివిధ అవసరాల కోసం వినియోగించుకొంటుంటే, మరి కొంత మంది ఒక్కో అవసరానికి ఒక్కో గదిని లేదా స్థలాన్ని వాడుకొంటారు. అయితే ఇంటి వైశాల్యానికి అతీతంగా ఆ ఇంటిలోని ప్రకార్యాల(Functions)లోనే నమ్మక వ్యవస్థ ప్రభావం ఉంటుంది.

ఇంటికి 'ముగ్గు'పోసిన తర్వాత సుంకు మొగరానికి ప్రాధాన్యత ఉంది. గుంత తీసి నవధాన్యాల్ని పాలతో కల్పిపోసి కొంత బూడ్చి దానిమీద పాలకట్టె పెట్టి గుంతను మట్టితో బూడ్చుతారు. దీన్నే 'పాలమొగరం' అని దేవుని గుంజ అని, ఆనుగుంజ అని ఆయా ప్రాంతాల్లో వాడుకలో ఉంది. ఆనుగుంజ ఆడబిడ్డతో సమానం. పవిత్రంగా చూసుకొంటారు. మనిషికి వెన్నుపూస ఎలాగో ఇంటికి "ఎనుబద్ద" అలాంటిది.

తెలంగాణా ప్రాంతంలో ఇంటి ఆవరణలో వాకిలి దేవర, బాలమ్మ, ఉప్పలమ్మ లాంటి దేవతలుంటారు. వాకిలి దగ్గరనే ఉండి ఇంట్లో వారిని కాపాడే దేవత వాకిలి దేవర. రూపం లేదు. సంక్రాంతికి ముందు 'వాకిలి'ని పూజించి, యాటను కోసి, బలి చల్లడం ఉంది. ఎక్కువగా కురుమలు దీన్ని పాటిస్తారు. అవుసలివారు 'బాలమ్మ'ను

ఆవరణలోని వేపచెట్టు కింద పెట్టి శ్రావణ మాసంలో పూజిస్తున్నారు. ఇంట్లోనివారు చల్లగా ఉండాలని 'బాలమ్మ'ను వాకిలి దేవతగా వీళ్లు పూజిస్తున్నారు. అలాగే మాదిగవారు 'ఉప్పలమ్మ'ని వాకిలిదేవతగా పూజిస్తున్నారు. ఇంటి ఆవరణలోని ఒక చెట్టుకింద రాళ్లని చిన్నగూడుగా చేసుకొని దానిలో 'గురిగి' పెట్టి వీరు ఉప్పలమ్మను కొలుస్తున్నారు. 'వాకిలి'కి ఇంత ప్రాధాన్యత ఇవ్వడం వల్ల 'సింహద్వారాని'కి ఉపయోగించే కొయ్యమీద కూడా ఆ ప్రభావం ఉంది. కొన్ని ప్రాంతాల్లో 'వేప' దేవునితో సమానం కనుక వాడరాదని, మరికొన్ని ప్రాంతాల్లో వాడాలన్న నమ్మకం ఉంది. గడపను తొక్కరాదన్నది ఆంక్ష. కొన్ని ఇండ్లలో పెండ్లి గద్దె లేదా పెళ్లి అరుగు కూడా ఉంటుంది. ఇంట్లో శుభకార్యాలకు, దేవతా పూజలకు, వాడుకొనే స్థలాల్ని చాలా పవిత్రంగా చూసుకొంటూ ప్రతి శుక్రవారంగాని, లేదా పండుగ దినాలలోగాని అలికి ముగ్గులు పెట్టడం ఆనవాయితీ. మరికొన్ని ఇండ్లలో దేవతకు ప్రత్యేక గది లేకపోయినా, ప్రత్యేక స్థలం ఉంటుంది. అది ఇంటిలోపల కావచ్చు లేదా ఇంటి గోడలు కావచ్చు.

ఆ విధంగా ఇంటిలోని ప్రతి అంగుళానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ ఇంట్లోనివారు ఆ ఇంటిని ఎలా వాడుకొన్నారో లేదా వాడుకోవాలనుకొన్నారో సామెతల ద్వారా, పాటల ద్వారా, కథల ద్వారా, కథా గేయాల ద్వారా తెలియజేశారు. అలాగే ఆ ఇంటిలోని వ్యక్తులు, వారి మధ్య ఉండాల్సిన బంధాలు, సంబంధాలు, అనురాగాలు, ఆత్మీయతలు లాంటి ఎన్నో విషయాలు మనకు కనబడుతాయి. అమ్మనాన్న, తల్లి బిడ్డలు, అన్నదమ్ములు, సవతులు, బావామరదలు, వదిన మరదులు - అలా ఒక కుటుంబంలో నివసించే వ్యక్తుల బాధ్యతలు ఒక పక్క, ఆ నిర్వహణలో వారు ఎదుర్కొన్న సమస్యల నుంచి బయటపడడానికి వారి మనస్సు పోయినరీతి లాంటి ఎన్నో విషయాలు ఇవి తెలియజేస్తాయి.

ఇంటిని రోజువారీ, లేదా పండుగలు, ఉత్సవాలు, ఆచారాలని నిర్వహించుకొనే సమయంలో అలంకరించుకోవడం, ఆ అలంకరణలో సందర్భానికి తగ్గట్టు పొందుపర్చుకోవడంలో వైవిధ్యం, బంధువులు, పెద్దలు ఇంటికి వచ్చినపుడు వారిని

సత్కరించాల్సిన తీరు, ఇంటిలోని వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాలు, అనుబంధాలు ఒక్కరితో ఒకరు మెలగాల్సిన తీరు, అత్త – కోడలు, అత్తగారింట కోడలి అణకువ అత్తా కోడళ్ల మధ్య సయోధ్యలు, విరసాలు, అత్తపై అయిష్టత, పుట్టింటి మీద మమత, భార్యాభర్తలు, వారి మధ్య అనురాగాలు, పొరపొచ్చాలు, సంతానం మీద వారికున్న గురి, కుటుంబ వ్యక్తుల మనస్సులలో దోబూచులాడే కోరికలు ఇలా ఎన్నో విషయాలు జానపద సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ద్వారా వ్యక్తీకరించుకొన్న విధం కనబడుతుంది. జానపద సాహిత్యం యొక్క ప్రధాన ఆశయం ఇలాంటి వాటిని ప్రచారంలో ఉంచడం, భావి తరాలకు అందించడంగా అనిపిస్తుంది.

పిల్లలు లేని ఇల్లు పీరీలకొట్టం, బిడ్డలు లేని దాన్ని గొడ్డురాలు అంటారని బిడ్డలు గల తల్లికి కుటుంబంలో, సమాజంలో గౌరవం అని చాలా పాటలు తెలియజేస్తున్నాయి. కథ ఏదయినా, ఆయా సమాజాలలో బలంగా నాటుకొన్న కొన్ని నమ్మకాలు అందులో కనబడుతున్నాయి. [1]సంతులేనట్టివారు / సక్కదనమేమి, పిల్లలు లేనిల్లు / పీరీలకొట్టమ్ము, బాలలు లేనిల్లు / పాలించే గుళ్లు (పాల్వంచగుళ్లు), సిరిబాల లేనిల్లు / సీకటీకోనమ్ము అని పార్వతీదేవి తన మొగుణ్ణి తనకు సంతాన యోగ్యం కలిగించమంటుంది (పాట 128). కాంభోజ రాజు కథలో సంతులేకవారు / సాలా బాధపడి, పిల్లలు లేని విల్లు / పీరీలకొట్టమ్ము, సంతులేని విల్లు / సావటీ కొట్టమ్ము (పాట 130, 131, 132), [2]పుత్రులు లేని వారికి పుట్టగతి లేదు, మన రాజ్యసంపదకు తగసుతులు లేక / అడవిగాచిన వెన్నెలయ్యె మనకలిమి, పుత్రులులేని యీ తనువేల మనకు. ఈ కథాగేయాలన్నీ కూడా 'బయటికి వెళ్లితే ధనధాన్యాల్ని గురించి అడగరు, భోగభాగ్యాల్ని గురించి అడగరు పిల్లలెంతమంది అని అడుగుతారని, పిల్లలు లేనిల్లు పీరీలకొట్టం అని, బిడ్డలు లేని తల్లి గొడ్డురాలు – గొడ్రాలు' అన్న ఆలోచన చుట్టూ తిరుగుతున్నాయి.

మొగుడు ఉంటే ఇక అన్నీ ఉన్నట్టే. [3]వాన ఉంటే కరువు, పెనిమిటి ఉంటే

---

1) మన పల్లెటూళ్ల పాటలు – అమ్మాపురం

2) సంక్షిప్త రామాయణం – పు. 1) చూడు మిన్నేరు పు. 63-64

3) తెలుగు సామెతలు పు. 25

పేదరికం లేదు', 'ఇల్లు లేనమ్మ హీనం చూడు మొగుడు లేనమ్మ మానం చూడు' అన్న సామెతలు, [4]అందలమునబోయె ఆ నాదు మొగుడుంటె / అందలము లెక్కుదును. [4]"ముత్తైద కుంకుమ నొష్టికుంటెజాలు / చేతెడు గాజులు చేతులకుంటె జాలు / ముత్తైద మట్టెలు కాళ్లకుంటే జాలు / నాకు బెట్టిన పసుపు చెంపల కుంటె చాలు / నా యొక్క మంగళ సూత్రం గట్టి గుంటె జాలు / నా యొక్క నల్లపూసలు మెడనుంటె జాలు". [5]"కలిమి లేములు చాల కలికలిగుంటెనేమి / పెనిమిటి కలిగితే సుఖియించు" అన్న ఆలోచన పాటలు ద్వారా వ్యక్తీకరింపబడుతుంది. ఈ భావన వరలక్ష్మి వ్రతం, మంగళగౌరి వ్రతం లాంటి వ్రతాల్ని ఆచరించడంలోనూ కనబడుతుంది.

భార్యాభర్తలు జడపదార్థాలు కావు. కనుక ఎపుడూ ఒకే విధంగా ఉండడానికి వీలుండదు. అభిప్రాయ భేదాలుండవచ్చు. గిల్లికజ్జాలు ఉండవచ్చు. అవి పురాణ పురుషులకే తప్పలేదు. మనమెంత? అన్న భావన కలగడానికో లేక కల్పించడానికో అన్నట్టు కొన్ని పాటలు కనబడుతున్నాయి. స్పర్థ సాధారణమే అయినా అది విడిపోవడానికి కాదు. సామరస్యంతో సమస్యల నుంచి బయటపడాలి అన్న ఉద్బోధ ఈ పాటల్లో ఉన్నట్టు కనబడుతుంది.

అత్తమామల సేవచేసి, స్నానం చేసుకొని, తలదువ్వుకొని, సకలాభరణాలు ధరించి, భోజనం చేసి, అద్దంలో తన సింగారాన్ని చూసుకొని, నవ్వుకొని, రామచంద్రుడున్న శయ్యాగారానికి వెళుతుంది సీత. రామచంద్రుడేమో ఆమె కోసం చూసి చూసి కోపం వచ్చి గడియ వేసుకొంటాడు. అపుడు సీత బంగారు కలశంతో నీళ్లు, ఆకువక్కలు, మంచి అత్తరు, పునుగు, జవ్వాది చలువ పన్నీరు, గంధం, పండ్లు ఫలహారాలు పళ్లెరంలో పెట్టుకొని, మల్లెలు మొల్లలు విరజాజులు కొప్పున ముడుచుకొని, సంతోషంగా విభుని దగ్గరకు వచ్చి 'విరులనుదెస్తి నో వీరావతార / తలుపేయ కోపంబును తాళంగగలనా, నిలుచున్న పాదాలు చేతులును నొచ్చె / దంతపు తలుపులు తియ్యవోయి నాథా / వొంటొంటి చినుకుకె ఒక చెంగు తడిసె, పచ్చల బాలుడా తియ్యవోయి గడియ' అని ఎన్నో విధాల వేడుకొంటుంది. కాని

4. త్రివేణి పు. 100, 317, చూడు. అదే 175

5. మిన్నేరు పు. 238

నువ్వు కష్టపడితే నాకేమి అంటూ తలుపు తీయడు. సీత అత్తగారికి చెప్తుంది. కౌసల్య కొడుకుని దండిస్తుంది. శ్రీరాముడు గడియ తీస్తాడు. సీత ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ లోనికేగి తలుపు వేసుకొంటుంది. 'కేళీ విలాసముల క్రీడించెరాము' [1]అని పాట పూర్తవుతుంది. [2]శ్రీ వేంకటేశ్వరస్వామి - అలిమేలు మంగమ్మ, ఇంటి తలుపు తట్టి తలుపుతీయమని వేడుకొంటాడు. కృష్ణుడు ఒక భామ ఇంటికి పోయి తలుపు తీయమంటాడు. భామ 'కృష్ణుడవైతే రాత్రి వేళల వచ్చిన పనులేవోయీ" అని అడుగుతుంది. 'మత్స్యగంధిరో నీ పొందుకు నే గూడి వస్తితి' అని బాహాటంగా చెప్పినా ఆమె తలుపు తీయదు. 'చిటపట చినుకులు దుప్పటి తడిసెను రానివ్వగదే భామా' అని కృష్ణుడు వేడుకొంటూనే ఉంటాడు. మరో పాటలో శ్రీరాముడు 'రామామణి శ్రీరాముడనే నిట్టురమ్మని వాకిలిదీయవే' అని వేడుకొంటాడు. ఇలాంటి పాటలన్నింటిలో కూడా తలుపుతీయమని వేడుకోవడం చివరకు వారిరువురు శయ్యాభోగం పొందడం వర్ణించబడింది. అలాగే నువ్వు ఎవరితోనో గడిపి వచ్చినావు లేకపోతే ఈ చిన్నులకు కారణమేమిటి అని అడిగే పాటలు [3]ఉన్నాయి. ఇంకా [4]తడిక రాయబారాలు, చిలుక రాయబారాలు - భార్యాభర్తలు ఎదురెదురుగా ఉన్నా, తడిక, చిలుక వంకపెట్టి మాట్లాడుకొనే పద్ధతి కనబడుతుంది.

[5]నాకి వొౖరి బువ్వ వండరాద వోరి మొగుడా నువ్వు కొౖరి బువ్వ వండుకోరా వోరిమొగుడా' అనే గడుసరి భార్యలు కనబడతారు.

కుటుంబంలో 'అత్తాకోడళ్ల'ది ప్రత్యేక స్థానం. కుటుంబం బంగారుగా ఉండాలంటే ఆ అత్తాకోడళ్లు సవ్యంగా ఉండాలని, 'అత్త చేపట్టిన కోడలు ఔసలవాడు చేపట్టిన బంగారంలా మెరుగులు దిద్దుకొంటుందని, ఎరువు పెట్టిన పొలం ఏలుబడి అయిన

---

1) సంక్షిప్త రామాయణం, సీత గడియ, పు. 105-106
2) మిన్నేరు, తలుపు దగ్గరి పాట, పు. 121 - 128
3) మిన్నేరు, 124 - 128, త్రివేణి పు. 216, పేటశ్రీ పు. 108-109, 110 - 112.
4) మధుర కవితలు, పు. 123 - 124
5) త్రివేణి, పు. 232

కోడలు' ఇంటికి వస్తే తెస్తారని సామెతలు చెప్తున్నాయి. 'అత్త మెత్తన కత్తి మెత్తన ఉండవు', 'అత్త పెట్టే ఆరళ్లు కనబడుతవి కాని కోడలు చేసే కొంటె పనులు కనబడవు', 'కొఱ్ఱ గింజంత కోడలిని చూస్తే కొండంత జ్వరం వచ్చిందట' అన్న సామెతలు వారి మధ్య కొరవడుతున్న అన్యోన్యతని తెలియజేస్తున్నాయి. ఇలాంటి భావమే పాటలలో కూడా కనబడుతుంది. బిడ్డకు పెండ్లి చేసి అత్తగారింటికి పంపేటపుడు పాడే 'అప్పగింతలు పాట'లే గాకుండా ఇతరత్ర కూడా కోడలు అత్తగారింటిలో ఎలా మెలగాలనో బోధించడం కనబడుతుంది. ఈ విషయం మీద చాలా శ్రద్ధ తీసుకొన్నారన్న విషయం ఆ పాటలే చెప్తున్నాయి.

[1]అత్తమామల తోటి హర్షంబు గల్గి అణుకువతో సంచరించు మాయమ్మా
వదిన మరదళ్లలో ఓర్పు గలుగుతూ విమరిశతో తిరుగు వెలది మాయమ్మా
బావ మరదులతోటి భయభక్తిగలిగి బహు నెమ్మదిగ తిరుగు బాల మాతల్లీ
తోటి కోడళ్లతో కలతలాడకుమా కూరిమి కలిగుండు గుణముగల తల్లీ
ఇరుగు పొరుగుల వారి యిండ్లకును పోకు విమరిశ కలిగుండు వెలది మాయమ్మా

[2]తొమ్మిది నెలలు మోసి
నినుకంటి నోయమ్మా
పణ్ణెండు ఏళ్లు పెంచి
పతికి నిన్నప్పగించితిమి

ఈ 'అప్పగింతలు' పాటలలో కొత్తింటి కాపురంలో ఆ అమ్మాయి నడుచుకోవాల్సిన తీరుని గురించి చాలా విపులంగా వివరించినారు. కుటుంబ సభ్యులతో, ఇరుగు పొరుగులతో మెలగడం, మాట్లాడడంలో మనసు విప్పి చెప్పడంలో పాటించాల్సిన జాగ్రత్తలు, భర్త అడుగుజాడల్లో మసలుకోమని చెప్పడం, ఇంటి వాకిట కూర్చోవద్దని, తలకురులు ఆరబోసుకోవద్దని అతి సూక్ష్మ విషయాల మీద కూడా శ్రద్ధ చూపించి బుద్ధి చెప్పి పంపడం కనబడుతుంది. బహుశ పన్నెండేళ్లకే పెండ్లిచేసి అత్తగారింటికి

---

1. సంక్షిప్త రామాయణం, సీత అప్పగింతలు, పు. 84, అమ్మాపురం పాటలు, పా. 145
2. వింజమూరి అనసూయ, పు. 120

పంపడం వల్ల లోకజ్ఞానం తెలియడానికి అవకాశం తక్కువగా ఉన్నందువల్ల కావచ్చు ఇలాంటి 'అప్పగింతలు పాట'లు బహుళ ప్రచారం పొందినవి.

[1]చేట జొన్నలు పోసి నిద్రపోవడం, రోటికి కాలు తగలడం, రోకళ్లు దాటడం, వంతలోని నీళ్లన్నీ తోడడం, తోడు వేసిన పాలు తాగడం, వీధిలో కురులిడిసి కొప్పు వేయడం, నలుగురిలో పళ్లికిలించి నవ్వడం, పొరుగిళ్లకు పోవడం, జగడాలు చేయడం, సందెకాడ దీపం పెట్టేటపుడు చప్పుడు చేయడం, మాపుకాడ దీపం మలిపేటపుడు వెనుకకు మళ్లి చూడడం లాంటి పనులు చేస్తున్న కోడలిని అత్త వారిస్తుంది. 'పులిపాలపడ్డావె పుట్టిల్లు మరువు, నా పాలబడ్డావె నాయిల్లు నెరువు, అన్న అత్తల స్వభావం, 'పుట్టిన్నాటి నుండి పువ్వుల్లేసాకి, పున్నుడా నేనెట్లు పుట్టిల్లు మరతు, కన్ననాటి నుండి గారానసాకి కాముడా నేనెట్లు కన్నోరి మరతు'; ఏరు పారిన పోదు ఏటి మీదిసుక, తలుచుకున్నా పోదు తల్లిపై మరులు' అన్న కోడళ్ల పుట్టింటి మమకారం అత్తింట్లో స్పర్ధలు రావడానికి కారణంగా కొన్ని పాటలు చెప్తున్నాయి. అత్త చెప్పిన మాటలు కోడలు వినకపోతే నీ మొగునితో కూడి వేరు కాపురం పెట్టు అన్నంతగా ఆమె ఆజ్ఞ జారీ చేస్తుంది. వీటి మీద సమాజం యొక్క అభిప్రాయాల్ని ఈ పాటలు తెలియజేస్తున్నాయి. పెండ్లి కార్యక్రమాలు అయినాక అత్తగారింటికి పోయేటపుడు పాడే 'అప్పగింతలు' పాటల్లో కూడా ఇలాంటివే చేయవద్దని బుద్ధులు చెప్పడం కనబడుతుంది.

[2]"కోడలా కోడలా కొలికి ముత్యమ్మా
గంగ రేగుపండు బంగారు బొమ్మ
పచ్చి పాలమీద మీగడేదమ్మా
వేడి పాలమీద వెన్నలేవమ్మ" అని అనవసరంగా ఆరళ్లు పెట్టే అత్తలు, వారి పోరు భరించలేక

[1]సందమామ కన్నా సక్కాని మొగుడా

---

1. త్రివేణి, పు. 103 - 104, మిన్నేరు, 181-182, 196,
2. మిన్నేరు, పు. 180, త్రివేణి, పు. 114

వేరె పోదామా వేరే పోదామా

అత్త మామల పోరు నేను పడలేను

ఆడబిడ్డల పోరు నేను పడలేను

కొప్పుపై జాజులు వాడెరా మగడా అంటూ వేరుపడితే ఎంతో మేలని, ఆర్థికంగా బలపడవచ్చని మొగుణ్ణి భార్య వేరుకాపురం పెట్టడానికి ప్రేరేపించడం ఈ పాటల్లో కనబడుతుంది.

[2]అయితే భర్త తనని ఏలుకోకపోయినా అత్తగారిల్లు, బావ, తోడికోడళ్లు, అత్తమామలు, మరదలు, వదిన, ఏరాండ్ల పిల్లలూ ఉన్న అత్తగారిల్లే చాలు అన్న కోడళ్లు కూడా ఉన్నారని ఈ పాట చెప్తుంది.

పెండ్లిండ్లు చాలా చిన్న వయసులోనే చేయడం వల్ల కావచ్చు ఆడ పిల్లలు అత్తగారింటికి పోవడానికి సుముఖం చూపని సందర్భాలని పాటలు వ్యక్తీకరిస్తున్నాయి. [3]పెండ్లయి అత్తవారింటికి వెళ్లినా, పిల్లలతో కాపురం ఉన్నా పుట్టింటిపై మమకారం ఉంటుంది అన్న భావాన్ని చాలా పాటల్లో చూడగలం. చిన్న వయసులో చేసే పెండ్లిని పిల్లలందరూ భౌతిక జగత్తులో వ్యతిరేకించలేక పోయినా కనీసం బొమ్మ పెండ్లిండ్ల ఆటలలోనో, భార్యాభర్తల లేదా కుటుంబాల్ని అనుకరించే ఆటలలోనో తమ వ్యతిరేకతను చూపించేవారన్నదానికి ఉదాహరణగా కొన్ని పాటలు ఉన్నాయి.

[4]ఊచ కఱ్ఱో చేత - ఉగ్గమోచేత

ఊగుతూ వచ్చిన తాతెవ్వరమ్మా

మానికా నిండను మాడలేసుకొని

మనుమరాలా నిన్ను మనువడగవస్తి

వాడిన పూవుల్లు వాసనలు గలవా

---

1. మిన్నేరు, పు. 197
2. త్రివేణి, పు. 159
3. శర్మ, పాట. 176, మిన్నేరు, పు. 181, త్రివేణి, 106 - 107, 109
4. మిన్నేరు, పు. 176

ఓ తాత, ఈ మనువు ఒద్దయ్యా నాకు

సంసార సాగరంలో ఉన్న సమస్యల్ని ప్రత్యక్షంగా చూస్తూ, అనుభవిస్తూ, వాటి నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచించే పాటలు కూడా ఉన్నాయి.

[1]వెన్నడు గొట్టని నాయి మొగుడమ్మా నేనేమిసేద్దు

వేటి కఱ్ఱతోని గొట్టేనమ్మా నేనేమిసేద్దు అంటూ సాగే ఈ పాటలో 'కుంటకింది మిట్టపొలం, ఉత్తరాన తోటగెట్టు అందుకని వ్యవసాయం నిష్ఫలమయింది. అంతా అమ్మి అప్పులు కట్టినాడు. సక్కనైన సంసారం చెక్కముక్కలయిపోయింది. గుండె మీది కుంపట్లాగా పెద్ద బిడ్డ పెండ్లికెదిగింది. పిల్లగాడిని సూడబోతె, సుట్టుగుడిసె లేనివాడు కాని లక్ష కట్నం అడిగినాడు. ఇన్ని కష్టాల మధ్య నడిచే సంసారంలో మొగుడు తాగక ఏం చేస్తాడు? తాగి వచ్చినాక తన్నక ఏం చేస్తాడు? తాగకపోతే తన భర్త మంచివాడు' అన్న భావాన్ని ఈ పాట చూపిస్తుంది. కుటుంబంలో ఎన్ని ఆటుపోటులున్నా భార్యాభర్తల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆ సమన్వయమే కుటుంబాన్ని ఒక్కటిగా నిలుపుతుంది అన్న భావాన్ని ఇలాంటి పాటలు తెలియజేస్తున్నాయి.

మనసు ఎలా పరిభ్రమిస్తుందో, ప్రత్యేకించి [2]ఇతరుల పొందు కోసం, చెప్పే పాటలు కోకొల్లలు. కోడెకారు విసిరే కొంటె చూపులు, అమ్మాయిలు ఇచ్చే సంకేతాలు, పెండ్లయిన వారు ఇతరులకు ఇచ్చే సంకేతాలు ఈ పాటల్లో కనబడుతున్నాయి. సమాజం కట్టుబాట్లు, అదుపాజ్ఞలు, వ్యక్తుల్ని నిర్దేశిస్తుంటాయి. వయస్సులో ఉన్న వారి ఉద్రేకాలు తీరడానికి సమాజం అడ్డుగోడలు అడ్డు వస్తాయి. మనస్సు లోపొరలలో దోబూచులాడుతున్న ఆ ఊహలు మరో రూపంలో అయినా బయటికి రాక తప్పదంటారు సిగ్మండ్ ఫ్రాయిడ్. కొన్ని పాటలు వాస్తవం అన్న భ్రమని కల్పిస్తున్నా, అది కేవలం ఊహాజనితం అని పాటల నడక చెప్పుతుంది. [1]సమాజంలో,

---

1. మనపల్లెటూళ్ల పాటలు - అమ్మాపురం, పాట. 23.

2. త్రివేణి 23, పు. 181-184, 176-178, 186, 187, 195, 205, 202, 209 - 210, 192, 196-197, 213, 218, మధుర కవితలు, పు. 143, 308-309

కుటుంబంలో ఉన్న అడ్డంకులు ఎన్నాళ్లుంటాయో, ఎన్నాళ్లు కావిలుంటారో అన్న మనస్సు పోకడలు ఈ పాటల్లో ఉన్నాయి.

[2]"గాజులోరన్నయ్య' 'నీలవోరి గౌరమ్మ' అన్న ఆవృతంతో సాగే పాటని అధ్యయనం చేస్తే ఇది ఊహాజనితం అన్న విషయం స్పష్టమవుతుంది. ఆ ఇంటి కోడలు తాను చేయాల్సిన పనిని బావలు, మరుదులు, మామలు, భర్త చేసినట్టు, లేదా వారి చేత చేయించినట్టు ఉన్న పాటలు.

## అలంకరణ - దుస్తులు - ఆభరణాలు

శుభ్రంగా స్నానం చేయడం, బట్టలు ధరించడం, కురులు దువ్వుకోవడం, అందంగా అలంకరించు కోవడం మానవ నైజం. ఉత్సవాలు, పండుగలు, ఇంట్లో పెండ్లి లాంటి శుభకార్యాలు జరిగేటప్పుడు ఇంకొంచెం శ్రద్ధ వహిస్తారు. ఆయా సందర్భాలలో రకరకాల చీరలు, రవికల గురించి, ఆభరణాల వైవిధ్యం గురించి, అలంకరణ విశేషాల గురించి చాలా వివరంగా పాటలలో, కథా గేయాలలో వివరించబడి ఉంది. వాటికి విశేష ప్రాచుర్యం ఉంది. కాబట్టి ఈ వివరణ ఊహా కల్పితం అని కొట్టి పడెయ్యడానికి అవకాశం లేదు.

[3]రేపల్లెలోని దేవాంగనలు శ్రీహరిని చూతమని శృంగారించుకొని వచ్చినారట. 'పట్టంచల చీరె మెరిసేటి పంచవన్నెల రవికె, పుట్టుదొడిగిన చీర మేనుకు పొంకమయిన రవికె, కరకంచుల చీరె పట్టుకంకణాల రవికె, ఆవపూల చీర మెరిసేటి అద్దమ్ము రవికె, పొన్నపూల చీరె ఎర్రని పొగడపూల రవికె, మండి తెల్లని చీరా నిండా మొగ్గలు గల రవికె, తోపు చీరాగట్టి చక్కని తోపు రవికె దొడిగి, నెరి చిక్కులు దీసి కురులు కూడా దువ్వుకొని, జాజులు ముడుచుకొని కొప్పులు జారగ బెట్టుకొని, మట్టెలు పిల్లెళ్లు బొబ్బిలికాయలు, వీరమట్టెలు చిటికెన బొడ్డులును వేళ్లకు, చిత్రించినట్లు

1 వింజమూరి సీతాదేవి పు. 22-23,

2. మన పల్లెటూళ్ల పాటలు - పు. 28 - 32, పా. 105

3. మిన్నేరు, గోపికల చీరల పదం, పు. 306 - 307

హస్తకడియములు, గంటలు మొలనూళ్లా కనకపు వడ్డాణమ్ములును ముత్యాల రవికెలును, మదుపుల తీగెలు మెరయగనూ చంద్రిక బొగడులును చెలిమి తాయెత్తులు మెరయ, చిలుక తాళివేసి చక్కని కుతుకంటూ మెరయ, ఊరికి దూరంగా ఉన్న కొలనులో దిగి జలకాలాడినారట. గోపిక స్త్రీలు జలకాలాడుతున్నప్పుడు శ్రీకృష్ణుడు ఆ చీరల్ని దొంగిలించుకపోతాడు. ఆ సమయంలో ఆ స్త్రీలు తమ చీరల గురించి, వాటి ప్రత్యేకతల గురించి చెప్పుతూ [1]మాయమాయె చీరలు, ఇది నిజంబయితే పోయెనే మన సిగ్గులు అని వాపోతారు. 'దీపావళి రోజున రొక్కముపెట్టి తనపతి కొని తెచ్చిన తోపుచీర' అని ఒకరు, 'పెద్దదాన నయినప్పుడు కట్టించినా రాప్రొద్దు చీర', అని, 'బాల శోభనమునకు తెచ్చిన చీర చలువలేవే నేటికి, జలతారు చీరె చెంగు గరిమి నిలిపితే పిడికింట నున్నది' అని, 'ఈడు వచ్చిన తర్వాత వాడకే రమ్మని పిలచి చాటుగా తన పెనిమిటిచ్చిన కోటల బొమ్మంచు చీరె' అని, 'ఎరిగి యెరగనప్పుడు తొలి చూలు బిడ్డ కాన్పుతో నున్నప్పుడు, చాలగా వెలబెట్టి కట్నం మేనమామ కొడుకు దెచ్చిన చీనిపైఠాణియంచు చీర' అని 'రేపల్లె రంగధాముని పెళ్లినాడు సంగతిగ మాయన్న దెచ్చిన ములగవన్నె రంగుచీరె', అని, 'సుందరిది మా మంచి చీర చంద్ర పూవన్నంచు రవిక', 'పట్టిసపు వీరభద్రుని పెండ్లినాడు మా యత్త దెచ్చిన పచ్చపట్టు వన్నె చీరె', 'కళ్లేపల్లి నారన్న పెళ్లినాడు కొంగుమారెడు రంగు పట్టు చీనిపైఠాణంచు చీరె', 'అంతర్వేది నారసింహుని పెండ్లినాడు మా యక్క తెచ్చిన ఆవపూసన్నంచు చీరె' అని పరిపరివిధముల తమ చీరల ప్రత్యేకతల్ని ఆ అంగనలు వర్ణిస్తూ వాటిని ఎవరు తీసుకపోయారని వాపోతారు.

[2]'కోరకొప్పు' పెట్టి గోరింటపూలు గుచ్చి... అద్దాల రవిక మీద అద్దకాలకోక, పయ్యెట చెంగుమీద పావురాల నేత, కుచ్చీల కొంగు మీద గువ్వలు, లాంటి దుస్తుల ప్రస్తావన మరోపాటలోని విషయం. అలాగే [1]పెళ్లి చేసుకొంటే పెద్ద కాసులపేరు, చుక్కల రవిక, చెంగావి చీరె, నడుముకు మువ్వ వడ్డాణం' చేసి ఇస్తానంటాడు

1) మిన్నేరు, పు. 315 - 316

2) మిన్నేరు, పు. 334 - 335,

ప్రియుడు. [2]'సన్నజాజి చీరకట్టి పొన్నపూలు కొప్పునబెట్టి' చిన్నది కన్ను గీటిందని ఒకడు సంబరపడిపోతాడు. ఇక కొంటె కృష్ణుడి కొంటె పనులులో కూడా దుస్తులు, ఆభరణాల ప్రస్తావన ఉంది. [3]'అంగజుకేళికి పిల్చి ఉంగరాలు' ఇస్తానన్నాడట. 'వల్లభునిగా ఏలితే తెల్లచీరె' లిస్తామన్నాడట, పడక మందిరంలో తనని సందిటకు చేరిస్తే కాళ్లందెలిస్తానన్నాడట. 'వద్దజేరి ముద్దుబెడితే దుద్దులిస్తా'మన్నాడట.

అంగపట్టుచీర, పద్దాలపట్టుచీర, పట్టుధావళి, మాంధూళి పట్టుచీర లాంటివి పట్టు చీరలమీద మగువకు ఉన్న మక్కువను చూపిస్తాయి కొన్ని కథాగేయాలు. ఢిల్లీ కోకలు (బాలనాగమ్మ కథ), నాగపురి చీర (నాంచారి కథ), పోమల్లచీర (కుమార రామునికథ) లాంటి ఆయా ప్రాంతాల పేరుతో ఉన్న చీరలు, చెంగావి చీరెలు, తొగరు చీర, నల్లచీర, పచ్చవర్ణ చీర, పసుపు చీర, ముత్యవర్ణం చీర, ధగధగ మెరిసేటి దంతపు చీర, (కమ్మవారి పణతి పసల బాలరాజు కథ), బోడసరము చీర, మల్లెపూల చీర (ధర్మాంగద చరిత్ర - పాముపాట), సీమకండి కళ్లచీర (ఎరుకల నాంచారి కథ), యేదుము వరహాల చీర, (సన్యాసమ్మ కథ), కరకంచు చీర (కావమ్మ కథ), బొమ్మంచు చీర (ధర్మాంగద చరిత్ర, కావమ్మ కథ), బంగారు సరిగంచు పట్టుచీర (వీర రాజమ్మ కథ), ముంత సరిగె చీర (ధర్మాంగద చరిత్ర), ముత్యాల చీర (పసల బాలరాజు కథ), నార చీరలు (గంగా వివాహం), నారగంధ పాతచీర (బాల నాగమ్మ కథ), ఏలగ్రాపు చీర (సన్యాసమ్మ కథ), లాంటి చీరల ప్రస్తావన కథా గేయాల్లో ఉన్నట్టు [4]పరిశోధకులు గుర్తించారు. చీరలతో పాటు రవికెలలో కూడా వైవిధ్యం ఉంది. తెల్లాటి రవిక (సరోజమ్మ కథ, నిమ్మపండ్ల ఛాయ రవికె (కావమ్మ కథ), నీలాంబరము రవికె (గంగా వివాహం), పంచరంగుల రవికె (ఎరుకల నాంచారి కథ), మల్లెమొగ్గ రవిక, సెనగపువ్వు రవికె (ధర్మాంగద చరిత్ర), ఐదు వరహాల రవికె, పందుము వరహాల రవికె (సన్యాసమ్మ కథ), అద్దాల రవికె (కావమ్మ కథ), నువ్వుపూస రవికె, రత్నాల రవికె, బూటాల్ రవికె (ధర్మాంగద చరిత్ర) లాంటివి.

---

1. మిన్నేరు, పు. 439 - 440 2. మిన్నరు, పు. 441, 3. మిన్నేరు, పు. 313,
4. మూలె విజయలక్ష్మి, పు. 4-22.

చీరలు, రవికలే గాకుండా కుచ్చుపావడ, దావిణి, బాడీలు, లోబాడీలతో పాటు తెల్లపంచె, ఎర్రపంచి, గ్లాస్కోరు పంచి, మిల్లుపంచి, ఫుల్ చొక్కా, లుంగీ, సొక్కా, సొక్కాయ, డ్రాయరు, బనీను, రంగు బన్నీ, కాటంగి చొక్కాయ, గోసిపాత, కట్టుబన్ని (కట్ బన్నీ), కలరు సొక్కా, పాలిస్టర్ పంచె, టెరికాట్ను చొక్కా, బాడీ, చొక్కాయ్, పచ్చడాయిరు లాంటి వర్తమాన కాలంలో వినియోగంలో ఉన్న దుస్తుల ప్రస్తావన కూడా గేయాల్లో కనబడుతుంది.

ఆభరణాలపై మోజు కథాగేయాల్లోనూ ఉంది. [1]"శిరమందు శశిపువ్వు, చంద్రవంకయు, మంచి రత్నాలు చెక్కిన రాగిడి (ధర్మాంగద చరిత్ర), సూర్యపురములు, చంద్ర పురములు (సన్యాసమ్మ కథ), సూర్యవంకలు, చంద్రవంకలు (గాంధారికథ), పాపిట బంతీలు (ధర్మాంగద చరిత్ర), నొసలు పాపిటబొట్టు (శ్రీ బాలగౌరి వివాహము), కొప్పు నవిరి (కావమ్మ కథ), కొప్పు గొలుసులు (ధర్మాంగద చరిత్ర), నవరత్నమయమగు నత్తు ముక్కున పెట్టి, ముక్కుపుడకను యుంచి ముదిత నొకవంక (ధర్మాంగద చరిత్ర), వజ్రాలు గల వరముత్తియపు నత్తు (గంగా వివాహం), మూడు వరహాల ముత్యాలనత్తు (కావమ్మ కథ), ముక్కుకుండే ముక్కర (పసలబాలరాజు కథ), ముక్కున వున్న ముక్కుపోగు (చిన్నమ్మ కథ), రత్నాల బుడకలు (ధర్మాంగద చరిత్ర), కమ్మలు (ధర్మాంగద చరిత్ర, గంగా వివాహము), కుంటెన కుచ్చులు (గాంధారి కథ), కొస బాసిలీలు, పుటక బావిలి, మద్దికాయలు, బవిరి రేకలుతోపాటు చంద్రహారాలు నవరత్న హారాలు, ముత్యాల హారం, రత్నాల హారం, పూవుల హారం, కలపేరులు, గిలకసరి పేటలు, గిలకపేరులు, గుండ్లపేరులు, నల్లపూసల పేరులు, ముత్యాలపేరులు, మోహరి పేరు, వంకపేరులు, వరహాల పేరువు, సంకుపూసల పేరులు, చిలకల తాళీలు, పులిగోరు పతకం, జన్మసరము, బంగారు గోధుమ పూసలు, నల్లపూసలు, అర్తి పూసల దండ, నల్లపూసల దండ, నోముల దండ, అడ్డికలు, గుండ్ల పట్టెడ, తీగె, నాను, రుద్రాక్షతలు లాంటి కంఠాభరణాలు, నడుముకు ఒడ్డాణము, బంగారు వడ్డాణము, చిలుక యొడ్డాణము, గజ్జల వడ్డాణము, డాబు, బంగారు మొలత్రాడు, పద్మాలు దిద్దిన పట్టుతాబొందు, మొలపేరులు, ముంజేతికి చేమపూవుల

కడియము, పగడాల కడియాలు లాంటి వివిధ కడియాలు, కంకణాలు, గొలుసులు, మురుగులు, మురిడీలు, పోజీలు / పోచీలు, రకరకాల గాజులు, వేళ్లకు ధరించే ఉ ంగరాలు, బటువులు, ముద్దుటుంగరం, పాదాలకు కడియాలు, కమ్మగొలుసులు, గజ్జెలు, గజ్జెలందెలు, వెండి అందెలు, మువ్వలు, పాంజీలు, పాలడాల్ (పావడాల్), కాలివేళ్లకు ఉంగరాలు, కంచుమెట్టెలు, మెట్టెలు, వెండి మెట్టెలు, కనక పిల్లెండ్లు, చిటికెన బొద్దులు, చుట్లు లాంటి ఆభరణాల ప్రసక్తి ఉంది.

ఇలా దుస్తులు, ఆభరణాల ప్రస్తావనలే గాకుండా వాటిని ఎపుడు ఎక్కడ ఎవరు తయారు చేశారో, ధరించారో అన్న వివరాలు కూడా అక్కడక్కడ కనబడుతున్నాయి. 'నెరిచిక్కులు దీసి కురులు కూడా దువ్వుకొని, కొప్పులు జారవిడుచుకొని, జాజులు ముడుచుకొని' అలంకరించుకొన్న వనితలు కనబడతారు. [1]ఓ పక్కా పొగడరురాసి ఓ పక్క సూనో పూసి, పొగడరు నందు సూనో నందు సాదుసుక్కా నిలుపబ్బే" అనే వయ్యారి, [2]"కమ్మని కస్తూరి నొసట తిలకములేదిద్ది, హెచ్చయిన జాజి విరులు కొప్పున తురిమి' నలుగుకు వెళ్లే ముత్తయిదువులు కనబడతారు. రింగులు, సవరం, వాసనసవురు, వాసన సబ్బు, సుక్కబొట్టు, కీలుజడలు, సక్కంజడ (సక్కనిజడ), రిబ్బను, పక్కపాపిడి (పాపిట), సాదుసుక్క, కాటుక, తిలకం, గంధం, పొట్టి పసుపు (పొట్టి పసుపుతోను కన్నెలు వసంతమాడిరి), ముద్ద పసుపు (ముద్ద పసుపుతోను కన్నెలు మునిగి తానమాడె), పచ్చబొట్టు (కాళ్ళమీద కంచూపచ్చ వేళ్లమీద ఎండూపచ్చ), కనకాంబరాలు, మల్లెపూలు, సన్నజాజులు, పొగడపూలు, దవణం లాంటి అలంకరణ సామగ్రి వివరాలు కనబడుతున్నాయి. గాజులోరన్నయ్య మాలారం దింపి బంగారు గాజులు, బెంగుళూరు గాజులు, మలకపురి గాజులు, మాలపిల్ల గాజులు, ఆకు పసిండిగాజులు, గుంటూరు గాజులు ([1]నెల్లూరిలో సేకరించిన పాట), పట్నం గాజులు, మాలపిల్ల గాజులు, ఎర్రమల్లె గాజులు, సన్నపొద్దు గాజులు, చిన్ని కాపిలు గాజులు, బంతిపూల గాజులు ఉన్నాయంటే అత్త చూడకుండా అందమైన గాజులు, మామ

1. పేటశ్రీ, పు. 266

2. వింజమూరి అనసూయ, పు. 9-10

చూడకుండా మల్లెపూల గాజులు, బావ చూడకుండా బంతిపూవు కాపిలు, మరిది చూడకుండా మొగలిపువ్వు కాపిలు, [2](వరంగల్లులో సేకరించింది) పెట్టమంటుంది.

కాటమరాజు కథలలో సిద్ధిరాజు భార్య త్రిభువనదేవి పోలేరమ్మకు మొక్కులు చెల్లించి రావడానికి బయలుదేరేటపుడు ఆమె సౌందర్య వర్ణన నఖశిఖపర్యంతం ఉంది. సిద్ధిరాజు చూసిన సౌందర్యం ఇది.

[1]పద్మరేకులబోలు పసనించు కనులు
తుమ్మెద రెక్కల బోలు తూగిన కురులు
నెలవంక చంద్రునిబోలు నీటైన నుదురు
కుంకుమ ముత్యాలు పాపిడి బొట్టు
మిసిమిగా కన్నుల కాటుక తేరు
వచ్చిన వంగిన కామాక్షి బోలును
తిన్నని తిరుమణి తిలకంపు బొట్టు
కలికి ముక్కున ముంగర అమరుచునుండెను
పలువరస పెదములు పగడంపు తీగెలు
మృదువైన చెక్కిళ్లు ముత్యాల బావిరాలు
కమ్మలు చెవల, పువ్వులు కర్ణములు నిండును
రవికంఠముత్యాలు రత్నహారములు
మంగళసూత్రము రంగైన తీగ
ముంగల బరువున మోయగలేక
కుచముల నడుమను యేలాడు నవరత్న హారములు
కరములు మృదువైన కంకణములు మెరియ

అన్ని అవయవాలు పొందికతో ఉన్న ఆ త్రిభువనదేవి సౌందర్యాన్ని సిద్ధిరాజు చూశాడట.

---

1. త్రివేణి, పు. 176 - 178
2. మన పల్లెటూళ్ల పాటలు, పాట. 105.

# వంటలు - వార్పులు

మనిషి ఆరోగ్యంగా జీవించడానికి ఆహారం అవసరం. దాని గుణగణాలు తెల్సుకొని ఉండడం మరింత అవసరం. ఏయే ఆకుకూరలు, ఏయే కాయకూరలు, ఏయే పప్పు దినుసులు, ఏయే ధాన్యాలు తినవచ్చు, వాటితో ఎలాంటి వంటల్ని వండుకొన్నారు. ఆ వంటల్ని ఏయే వేళలో, సందర్భాలలో తినేవారు. వాటి వల్ల ప్రయోజనం, విందారగింపులు, భోజనం వడ్డింపులు, పండగలలో, జీవితచక్ర సంబరాలలో తప్పనిసరిగా చేయాల్సిన వంటలు, నైవేద్యం లాంటి పవిత్ర సమయంలో దేవుని కర్పించే వంటలు లాంటి వివరాలు పాటల్లోనూ, కథా గేయాల్లోనూ సందర్భోచితంగాను, ప్రత్యేకంగాను వివరించబడి ఉన్నాయి. అమ్మాయిలకు వీటి మీద పరిజ్ఞానం కల్గించడానికి అన్నట్టుగా ఈ పాటలు కనబడుతున్నాయి. గిన్నెల్ని ఏయే ఆకులతో తోమాలి, ఏయే కూరలు ఎలా ఉడకతాయి అన్న అంశాలు కూడా చోటు చేసుకొని ఉన్నాయి.

[1]సద్దిమూట, సంగటి, సంగటి ముద్ద, అమ్మిలి, అంబలి, గంజి, చిక్కని కలికూడు, చారు చేంగెడ్డ, పెరుగు పెండలం గడ్డ, చిక్కుడు కాయ, మునక్కాయ కూర, వంకాయ కూర, కందిపప్పు, చక్కని చారు, ములక్కాయ ఇగురు, ముడి బియ్యపు అన్నం, సన్నబియ్యపన్నం, కొర్రకూడు, వడలు, హోళీలు (పోళీలు), మండియలు, వేడి క్షీరాన్నముల్, పచ్చడి, ముక్క బియ్యపన్నం, ముద్దపప్పు, వంకాయ పులుసు, గంతులేసే గండు మీనలు, పండుగొప్పలు, రొయ్యలు, కట్ట చేపలు, మట్టగిడసలు, చుక్క పరిగెలు, కొర్రమీను, బొచ్చిపరిగె, చేదు పరిగి, వడ్లముక్కు, బిళ్లమోసు, మోసుపిల్ల, ఇసుకదొందు, బేడిసపిల్లలు, ఒంజి పిల్లలు, పులసలు లాంటి చేపలు, దుప్పేటలు, పంది కూర, పొట్టేలు మాంసం, కోడి మాంసం, కోడిచారు, ఎంద్రకాయచారు, యాటలు నేల తంగేడేళ్లు, కుందికూర, పండు గుమ్మడి పులుసు, వంకాయ తియ్యని, కమ్మగా వేయించిన కందిపప్పు కూర, చింతపండు పులుసు, చిత్రాన్నము, కమ్మని పెరుగు,

1. మిన్నేరు, త్రివేణి, సంక్షిప్త రామాయణం, అనసూయాదేవి, విజయలక్ష్మి, పేటశ్రీ మహాలక్ష్మి సంకలనాలు, రచనలలో మరిన్ని వివరాలు ఉన్నాయి.

నిమ్మ మజ్జిగ, పాయసము, పిండి వంటలు, అప్పడాలు, వడియాలు, ఉక్కెఱలు, దోసెలు, రాజనాలన్నము, పంచదారమణిగెలు, కుడుములు, బూరెలు, ఆవకాయ, దుప్పళం, అవిశాకు దొప్పలు, పంచదార పులుగులు, చేతి చలిమిడి, చేరెడు సకినాలు, అరిసెలు, గారెలు, పరమాన్నం, లడ్లు, నిప్పట్లు, మిఠాయి పొట్లాలు, బెల్లం ముద్దలు, శెనగలు లాంటి ఎన్నో పదార్థాల ప్రస్తావన ఉంది.

నైవేద్యం ఇవ్వడానికి తెలినులి వెచ్చనన్నము, తిమ్మనంబులు, పాయసంబులు, పలు తెఱంగుల పిండి వంటలు, బూరెలు, బొప్పట్లు, పోళీలు, లడ్లు, గారెలు, కజ్జములు, అతిరసాలు, చెరకు పానకంబులు, పానీయాలు, పాలు, పెరుగు, జున్ను, పంచదార మీగడలు, కడియములు, మిరెపచారు, కర్జకాయలు, బూరెలు, అరిసె అప్పములు, గారెలు, బొప్పట్లు, నెయ్యి, చారు, పప్పు, పచ్చడిలు, కూరలు, పులిహోర, దద్ధోజనం, పనస తొనలు, అరటి పండ్లు, ఖర్జూర పండ్లు, అనాస పండ్లు, మామిడి పండ్లు సమర్పించినట్లు ఉంది.

'చల్ల' - మజ్జిగ మహిమను గూర్చి 'సరిదేవి కథ'లో

"ముసిలోళ్లు త్రాగితే పగిసోళ్లు గావాల

పగిసోళ్లు త్రాగితే ముసిలోళ్లు గావాల

ముత్తేనికి చల్ల మూడు గురిగలమ్మ

వజ్రానికి చల్ల ఒక్క గురిగయమ్మ" [1]అని చెప్తారు. ఈ ద్వైదీభావం ఎందుకు వస్తుందో చూడాల్సి ఉంది. సీత సమర్తయినపుడు కొట్నాలు దంచడానికి పేరంట్రాండ్రు వచ్చి,

[1]కొబ్బరీ బెల్లమూ కోరిదంచిరీ ॥సువ్వి॥

నువ్వులా పప్పుదంచి మాటికీ పంచిబెట్టి

చిమ్మిలి పళ్లెరములోరీ సమ్మతముగా దోడ్కొని

ఇమ్ముగ నుండలు జేయుచు కొమ్మాలు తబుకులనింప్రీ" అని సమర్త అయినపుడు

---

(1) కడప జిల్లా జానపద గేయ గాథలు, పు. 190 (1) సంక్షిప్త రామాయణం, పు. 94 ,
(2) మిన్నేరు, పు. 173, (3) మిన్నేరు, పు. 334

కొబ్బరి, నువ్వులు, బెల్లంతో చిమ్మిలి దంచి ఇచ్చేవారన్న సంప్రదాయాన్ని ఈ పాట తెల్పుతుంది.

సొంపైన చిమ్మిలి నానశెనగలునూ
సభియలు పొంగడాల్ సుదతి కివ్వారె
పాయసాన్నము దోసె లతిరసంబులునూ
వడలు పులిహోరలన్ వనిత కివ్వారె (మిన్నేరు, 95-96)

చిమ్మిలితోపాటే ఇచ్చే మరికొన్ని పదార్థాల వివరాలు ఉన్నాయి.

[2]చేతి చలిమిడి ఎలా చేయాలో చెప్తుంది మరోపాట
కొయ్యన్న కొట్టుచేను దంచన్న పిండి
పొయ్యన్న నూనె వదిన వెయ్యన్న బెల్లం
చేట తడిగాకన్న చెయ్యంటకన్న
చేతి చలిమిడి చేసి నాకు బంపు వదిన

కొర్రపిండి, బెల్లం, నూనెతో చేట తడి కాకుండా చెయ్యంటకుండా చేతి చలిమిడి చెయ్యమని మరిది వదినని కోరతాడు.

[4]చోళ్లు నల్లన్న చోడిపిండి తెల్లన్న
కాగబోసి త్రాగితేను కడుపు చల్లన్న

అని అంబలి / గటక / జావ ఎలా చేయాలో చెప్తూ దాని ప్రయోజనాన్ని కూడా వివరిస్తుందీ పాట.

ఈ పాటలలో 'విందు భోజనాల' గురించి చాలా వివరంగా చెప్పబడి ఉంది. [1]'లక్ష్మణదేవర నవ్వు'లో శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు లంకలోని ముచ్చట్లు చెప్పుకొంటూ భోజనం చేస్తున్నారట. వారి భోజనంలో 'చిక్కుడు కాయ, చిరిపొట్లకాయ', కాకరకాయలతో కార వడియాలు, అరటికాయ మొదలైన అరువది కూరలు, పనస మొదలైన పాకంబు కూరలు, సిరసేవ పాయసము, చిప్ప పాయసాన్నము, సజ్జ పాయసాన్నము, రాజనపు అన్నం, శాకములు, సెనగపప్పు, వలువపప్పులతోటి వడ్డించారట. ఇంకా అప్పడములు, మంచి అతిరసములు,

పచ్చళ్లు, కీళ్లు కుడకల నేతూలతో ఆరగించారట. [1]కాటమరాజు బలిజలకు చేసిన విందులో 'దోరావుల పాయసము, దొప్పలతో నెయ్యి, తరిపియావుల పాయసం, జన్నావుల పెరుగు మీగడతో పిండి వంటలు, మినియపు కూరలు, అల్లంపు ఊరగాయలు అనియేక రుచులు, బెల్లపు చారు, పేరిన నెయ్యి, పక్వంగా వండిన పాల కడియాలు, పంచ పదార్థములతో పాకములు చేసి, ప్రాజమ్మాకు విస్తళ్లు, పంచ పళ్లాలు, నేరేడాకుల నైతేలు గూర్చి బంతుల మీద వేశారట. నైతేలు మీద జలకము చిలకరించి పాయసం వడ్డించారట. సకల పదార్థములు, షడ్రుచులతో, గంగి మైలావుల కమ్మని నెయ్యి వడ్డించగా వారు శివపూజ చేసి కందమూల ఫలాదులు, కాయకూరలు, పచ్చళ్లు, ఊరగాయ, పెరుగు, తొరపండ్లు ప్రసాదమారగించారట. హేమ చెంబులతోను యేన్నీళ్లు, యెండి చెంబులనీరు యెంగిలివార్చిరట. పట్టు జముకానము పర్చి వారిని కూర్చుండబెట్టి వారికి కుంకుమ, గోవ, జవ్వాజి, అగరు, శ్రీగంధము, అనువంద గూర్చి, కల్వాన చేసిన శ్రీగంధమలది, చైముట్టిగంధంబు నలది, పచ్చని బాకాలు (పోక?) పండు టాకులును గాలించిన సున్నం గంధ విడియములు, తాంబూలములు ఇచ్చి పట్టు తశిరీబులు కప్పిరట. మందవెల్లి పచ్చడాలు, దుప్పట్లు, శ్రీరామ మాడలు సమర్పించుకొన్నారట. మూడావుల గుడిచేటి ముచ్చకరి కోడెను, నాలుగావుల గుడిచేటి నల్లజార్ల కోడెను, ఏడావుల గుడిచేటి ఎర్రమట్టె కోడెను వారికి కానుకగా ఇచ్చారట. వేసిన విశేషణాలలో కొంత అతిశయోక్తి ఉన్నా విందు భోజనం ప్రారంభం నుంచి చివరి దాకా ఎలా వుంటుందో ఆ క్రమపద్ధతిని వివరించారు.

సందర్భానుగుణంగా వంటలలో వైవిధ్యం కనబడుతుంది. దైనందిన జీవితంలో కాయకూరలు, ఆకుకూరలు, దుంపకూరలు, పచ్చళ్లు, చారు, పులుసు, మాంసాహారం, చోడంబలి, గంటి అంబలి, సప్పిడి అంబలి, ఉలవపిండి అంబలి, జీలుగ అంబలి, మామిడి టెంక అంబిలి, చలిదన్నం, గంటి అన్నం, జొన్న అన్నం, కొర్రకూడు, సామకూడు లాంటి ఆహారంలో ఆంక్షలు లేకపోయినా, ఆయా కాలాలలో కొన్నిటికి

1. సంక్షిప్త రామాయణం, పు. 225 - 241
2. కాటమరాజు కథలు - రెండవ సంపుటం, పు. 20 - 21.

మాత్రమే ప్రచారం ఎక్కువగా ఉంటుంది.

తూర్పు గోదావరి జిల్లాలో 'తాటి' చెట్టుకి ఒక ప్రత్యేకత ఉంది. గ్రామదేవతగా పూజిస్తున్నారు. తాటి చెట్టు నుంచి వచ్చే ప్రతిదీ ఆహారంలో భాగమయింది. తాటిపళ్ల రసంతో తాటి చాప, తాటి ఇడ్లీ, తాటి గారెలు, తాటి రొట్టె, తాటి బూరెలు, తాటి పప్పులు, తాటి తాండ్ర, తాటి మంగలాలు, తాటి కుడుములు వండుకొంటున్నారు. తేగలు, తేగల్ని కాల్చుకొని లేదా ఉడికించుకొని తినడం, తేగలు కాల్చి తొక్క తీసి రోట్లో దంచి బెల్లం కల్పి ముద్దలుగా చేసుకొని తినే తేగుండలు, తేగల బుర్రలలోని బుర్రగుంజుతో బుర్ర గుంజుకూర, తాటి కల్లుతో తాటి బెల్లం, తాటి సారా తయారు చేసుకొంటున్నారు. తాటి చాప తింటే బలం వస్తుందని, మలబద్ధకం ఉండదని, ఎక్కువగా తింటే మాత్రం విరోచనాలవుతాయన్న నమ్మకం ఉంది. తాటి ఇడ్లీని ఆవిరికి ఉడికించినా వెంటనే తినరాదు, పొద్దున పెట్టితే సాయంత్రం, రాత్రి పెట్టితే పొద్దున తినాలన్న నియమం ఉంది. తాటి రొట్టెను వియ్యపురాలికి ఇచ్చే సంప్రదాయం ఉంది. తాటి పండ్లు తింటారు కాని ఎక్కువగా తింటే వాతం వస్తుంది అన్న స్పృహ ఉంది. బియ్యపు పిండి తాటి పండ్ల రసం కల్పి పిసికి పెనుము మీద కాల్చుకొనే తాటి పప్పలు బలమైన ఆహారంగా పరిగణిస్తారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు పెట్టరు. కాలు పట్టులు వస్తాయని భయం. పడకపోతే విరోచనాలవుతాయి. జబ్బులు ఉన్నవారు తినరు. తేగలు పక్వానికి రాని బుర్రలలో మరత కొక్కులలో, గుంజు ఎక్కువగాను, గట్టిగాను ఉంటుంది. తేగ ఊరిన బుర్రలలో నీళ్లగుంజు ఉంటుంది. దీన్ని తింటే నజ్జు చేస్తుందని వాడుకోరు. తాటి బెల్లం తినడం వల్ల నుసిపురుగులు రావన్న నమ్మకం, బాలింతలకు పెడతారు. తాటి బెల్లంతో కాచిన తాటిసారా తాగితే లేవనోడయినా లేచి కూచుంటాడన్న నమ్మకం ఉంది. మోకాళ్ల నెప్పులు తగ్గుతాయి. పదకొండో రోజు నుంచి మూడు మాసాల దాకా బాలింతరాళ్లకు మంచిదని తాగిస్తారు.

వరంగల్లు జిల్లాలో [1]తాటిచెట్టుకి ఆచారాలు, అనుష్ఠానాలు, వైద్యపరంగాను, అలంకార వస్తువులు తయారు చేయడంలోనూ, పర్యావరణ పరంగాను ప్రత్యేకతలున్నట్టు గుర్తిస్తున్నారు. కల్లు నింపిన ఘటం కుండకు తెలంగాణాలో

ప్రాముఖ్యం ఉంది. కులపురాణాలు చెప్పినాక లేదా చెప్పే సందర్భాలలో చేసే జాతరలు, పండుగలు, కొలుపులు లాంటి ఉత్సవాలలో ఘటంకుండ తప్పనిసరి. అలాగే బోనాలులో కూడా. చంటి పిల్లలకు 'తిమ్మి' వస్తే కల్లు తాగిస్తారు. పశువులకు వాతం వచ్చినపుడు చేదొండ ఆకు దంచి కల్లు కల్పి తినిపిస్తారట. 'అమ్మతల్లి' సోకిన వారికి 'కల్లు' తాగిస్తే చల్లదనం వల్ల తగ్గుతుందనీ, తేలు కుట్టిన వారికి తాగిస్తే ఉపశమనం కల్గిస్తుందని నమ్మకం ఉంది. చెవి పోటు వస్తే లేత తాటిమట్టను కాల్చి దాన్ని చెవిలో రెండు మూడు చుక్కలు పిండితే చెవిపోటు తగ్గుతుందట. బలహీనంగా ఉన్నవాళ్లు ఒక నెల రోజులు 'పోద్దాడు' (పోతు తాడు, గొలలు మాత్రమే ఉంటాయి నుంజలు ఉండవు) కల్లు తాగితే బలిష్ఠంగా తయారవుతారట. 'పరుపుతాడు' (దీనిని ఆడచెట్టుగా భావిస్తారు. గొలలు ఎక్కువ, కల్లు బాగా ఉంటుంది) కల్లు తాగితే ఒళ్లు కొంచెం నొప్పులుగా ఉండడం, పుల్లటి కల్లు అయితే ఎక్కువ సార్లు దొడ్డికి పోవడం ఉంటుందట. 'పందుతాడు' (పరుపుతాడుకు రెండు మూలలు విడిచిపెడతారు. రోహిణి, మృగశిర కార్తెలలో వాటికి కల్లు గీస్తారు) కల్లు చల్లదనం కల్గిస్తుందని నమ్మకం. మలబద్ధకం ఉన్నవారు సాయంత్రం తీసిన కల్లుని పొద్దున్నే పరగడుపున తాగితే మలబద్ధకం పోతుంది. ఎండలో పనిచేసి సెగ తగిలితే వారికి కల్లు చల్లదనాన్ని ఇస్తుందట.

[2]పచ్చ కామెర్లు ఉన్నవారు మజ్జిగన్నం ఎక్కువగా తినాలి. రెండు నెలల తర్వాత తోటకూర, బీరకాయ, కేరట్, పొట్లకాయ లాంటి వాటితో కారం తక్కువగా వేసుకొని వేంపుడులు పెడతారట. వారు గుమ్మడికాయ కూర, గోంగూర, బెల్లం, కొబ్బరికాయతో చేసినవి తినరాదట.

ఎండాకాలంలో కొత్తగా పెట్టిన ఆవకాయ తింటే వేడి చేస్తుంది. ఒక సంవత్సరం పాటు నిల్వ ఉంటుంది కనుక చాలా జాగ్రత్తలు పాటిస్తారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో పచ్చళ్లు ముట్టరు. శుక్రవారం, మంగళవారం ఇతరులకు పెట్టరు. ఇంటికి దూరమయిన వారు, మైల ఉన్నవారు ముట్టుకోరు. కొత్త చింతకాయ పచ్చడి

1. జానపద కిరణం 2. జానపద విజ్ఞాన దర్శిని సంపుటాలు

బాలెంతరాలుకి వాతం చేస్తుందని పెట్టరు. ఉసిరికాయ పచ్చడి పైత్యాన్ని తగ్గించి జీర్ణశక్తిని పెంచుతుందని నమ్మకం. కార్తీక మాసంలో ఈ పచ్చడి తింటే ఉసిరి చెట్టు కింద భోజనం చేసినంత ఫలం అని నమ్మకం. ఆదివారం ఉసిరికాయ పేరు తలపరాదు, తినరాదు అన్న ఆంక్ష ఉంది. ఆయుష్షు తగ్గుతుందట.

రేగిపండ్ల గుజ్జు, మినపప్పు, అల్లం, పచ్చిమిర్చి, జిలకరలతో పెట్టిన రేగుపండ్ల వడియాలు మధుమేహాన్ని, పైత్యాన్ని, దురదలని తగ్గిస్తాయట. సగ్గు బియ్యం వడియాలను వైశ్యులు పెండ్లి విడిది కార్యక్రమంలో జరిగే 'పానకాల కావడి'లో తీసుకెళ్తారట.

పండగలంటేనే వంటల కోసం మనస్సు ఉరకలేస్తుంది. అరిసెలు, ఆవడలు, ఉండ్రాళ్లు, కొబ్బరి బూరెలు (పూర్ణం), కుడుములు, మినపప్పు, గారెలు, పెసరగారెలు, చిల్లులు లేకుండా ముద్దలుగా వేసే పునుకులు, గోధుమ ప్రసాదం, గోరు మిఠాయిలు చలిమిడి, చిమిలి, చల్లగుత్తు (గులాబి పూలు), జంతికలు, జిల్లేడు కాయలు, జిలేబి, తీపి గారెలు, అట్లు, అట్లతద్ది అట్లు, చలిమిడిని ముద్దలుగా చేసి నూనెలో వేయించే పోకుండలు, మినపప్పుపిండి వరినూక 1 : 2 పాళ్లలో కల్పి పనస ఆకులతో కుట్టిన బుట్టలలో పెట్టి ఆవిరిలో ఉడికించే పొట్టెక్క బుట్టలు, పొంగు బూరెలు, పొడి కుడుములు, పొంగడాలు, పాలకాయలు, సోడి, అట్టు, సోడి కుడుములు, సగ్గు బియ్యం పాయసం, సేమియా పాయసం, పరమాన్నం, జావ, పులిహోర, వడపప్పు, పచ్చి చలిమిడి, కొబ్బరచ్చులు, సున్నుండలు, ఉగాది పచ్చడి, పులగం, పాల ఆరిది, నీళ్ల ఆరిది, నువ్వుబూరెలు, తోప, చక్కెర పొంగలి, దద్దోజనం, మామిడి టెంకల పిండి అంబలి లాంటి పిండి వంటలు, పాయసాలు, మిఠాయిలు, అటుకులు మరెన్నో గుర్తుకు వస్తాయి. అయితే వచ్చే పండగని బట్టి పండగలు వచ్చే కాలాన్ని బట్టి ఈ వంటల్ని తయారు చేసుకొంటున్నారు. అంటే చేసుకోవడంలోనేకాదు వాటిని వినియోగించుకోవడంలోనూ వైవిధ్యం ఉంది అన్న విషయం తెలుస్తుంది.

చంటి పిల్లలకు, సమర్త ఆడినపుడు, పెండ్లి విషయంలో, గర్భవతికి, పురిటాలికి పెట్టే ఆహారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు కనబడుతుంది. ఏయే ఆహారం

పెట్టాలి. ఎపుడెపుడు పెట్టాలి. ఎంతెంత పెట్టాలి, ఏయే ఆహారం పెట్టకూడదు, ఏయే వస్తువులు తినకూడదు అన్న విజ్ఞానం మన సమాజంలో పుష్కలంగా ఉంది.

అయితే పాటలు, కథాగేయాలు లాంటి వాటిలో వాటి వివరాలు ఉన్నా ప్రస్తావన రూపంలో ఉన్నవే ఎక్కువగా కనబడుతున్నాయి. ఇంకా కొంత మంది పెద్దల మనస్సులలో, జ్ఞాపకాలలో దోబూచులాడుతున్న ఆ విజ్ఞానాన్ని సేకరించాల్సి ఉంది. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం, ఏ కాలానికి ఆ కాలం యొక్క నేపథ్యం, వంటలు - వార్పుల్ని శాసిస్తుంది అన్నది వాస్తవం.

## వృత్తి విజ్ఞానం

తెలుగు సమాజం భిన్న సమూహాల కూటమి. ప్రతి సమూహానికి ఒక వృత్తి జీవనాధారం. ఈ సమూహాలు ఒకదాని మీద ఒకటి ఆధారపడుతూ, పరస్పరం సహకరించుకొంటూ, పరిపోషించుకొంటూ జీవనం కొనసాగిస్తాయి. ఆ సమూహాలు వారి వారి వృత్తిని కొనసాగించడంలో అనూచానంగా, పారంపర్యంగా అందిన అనుభవపూర్వక నైపుణ్యాలు, అనుసరణులు, ప్రారంభం నుంచి పూర్తి అయ్యేదాకా పాటించే క్రమ పద్ధతి, ఉపయోగించుకొన్న పరికరాలు, పనిముట్లు అన్నీ ప్రధాన పాత్ర పోషిస్తాయి. వృత్తి ఏదయినా పని ప్రారంభించేటపుడు దేవుని మీద భారం వేయడం పూజించడం సహజంగా కనిపిస్తుంది. వృత్తి విజ్ఞానాన్ని సేకరించడం నేడు కష్టంతో కూడుకొన్న పని. దానికి ప్రధాన కారణం ఈనాడు అనుసరిస్తున్న వృత్తుల్లో చాలా భాగం సంప్రదాయ ముద్ర నుంచి దూరంగా జరిగినవే. అయినా ఇంకా కొద్దిమంది పెద్దవాళ్ల మనస్సులలో వారి చిన్ననాటి అనుభవాలు సజీవంగా ఉన్నందువల్ల, వాటిని సేకరిస్తే గతించిపోయిన ఆ సంప్రదాయ నైపుణ్యం, సంప్రదాయ విజ్ఞానం యొక్క రూపురేఖల్ని కొంతవరకయినా గుర్తించడానికి అవకాశం ఉంటుంది. తెలుగులో సేకరించి ప్రచురించిన పాటలు, కథాగేయాల సంకలనంలో ఈ వృత్తులకు సంబంధించిన కొంత విజ్ఞానం ప్రచారంలో ఉంది.

వృత్తుల మధ్య ఉన్న సంబంధాల్ని తెలియజేసేపాటలు దాదాపు అన్ని

ప్రాంతాలలోనూ ప్రచారంలో ఉన్నాయి. "పిల్లవాడు ఎందుకేడుస్తున్నాడు" పాటలో చివరకు "నా బంగారు పుట్టలో వేలుపెడితే కుట్టనా" అన్న పాట అందరికీ పరిచయమయిందే. బిరుదురాజు రామరాజు గారు 1952లో సేకరించిన పాట తెలంగాణా ప్రాంతంలోది.

[1]దున్నపోద్దున్నప్పో ద్దుక్కిలెందుకు బన్నవ్
పసులోడు గాయంది నన్నేమంటవ్
ఏమిర పసులోడ ఎందుగ్గాయవ్
జీతమియ్యంది నన్నేమంటవ్
పటేల పటేల జీతమెందుకియ్యవ్
సోల దొరుకంది నన్నేమంటవ్
ఏమే సోల ఎందుకు దొరుకవ్
వడ్లోడు చెక్కంది నన్నేమంటవ్
ఏమిర వడ్లోడ ఎందుకు చెక్కవ్
బాడిశె తెగంది నన్నేమంటవ్
ఏమే బాడిశ ఎందుకు తెగవ్
కమ్మరోడు చరువంది నన్నేమంటవ్
ఏమిర కమ్మరోడ ఎందుకు చరువవ్
తిత్తూదంది నన్నేమంటవ్
ఏమే తిత్తి ఎందుకు ఊదవ్
బక్కది చావంది నన్నేమంటవ్
ఏమే బక్కదాన ఎందుకు చావవ్
ఆయుసు మూడంది నన్నేమంటవ్

ప్రతి వృత్తికి ఒక క్రమ పద్ధతి ఉంటుంది. దాన్ని ప్రారంభించడానికి సంవత్సరంలో ఒక రోజు ఉంటుంది. ముందుండి చేయడానికి ఒక వ్యక్తి ఉంటాడు. పూజించడానికి ఒక దేవుడుంటాడు.

[1]చాకలివారు సంక్రాంతి ముందునుంచి నెలరోజులపాటు బట్టలుతకడం

(1) త్రివేణి, పు. 62

మానేస్తారు. సంక్రాంతి తర్వాత గురువారం గాని ఆదివారం గాని 'బల్లపూజ' చేస్తారు. 'బల్లపూజ'కు నాలుగు రోజులు ముందు 'వినాయకుని సవారి' ఊరేగింపు జరుపుతారు. పొలం నుంచి మట్టి తెచ్చి వినాయకుని చేసి పల్లకిలో పెట్టి ఊరంతా ఊరేగించి గంగ దగ్గరకు తెస్తారు. ముగ్గురు ముత్తయిదువులు గంగలోని మట్టిని మూడుసార్లు తీసి గద్దె వేసి దాని మీద వినాయకుని పెడతారు. అరటిపండ్లు, ఆకు పోకలు, అటుకులు లాంటి ఫలహారాల్ని పెట్టి వినాయకుని పూజిస్తారు. పదకొండు మంది ముత్తయిదువులు (ముగ్గురు పిల్లల్ని కన్న తల్లులు) లేదా కొత్తగా పెళ్లయినవారు (పిల్లలు లేనివారు వినాయకుని ఎత్తుకొంటే పిల్లలు కలుగుతారని నమ్మకం) వినాయకుని జల్దిలో కల్పుతారు. తర్వాత 'బల్లపూజ' ఉంటుంది. బట్టలుతికే బండ దగ్గరికి, ఎవరి బల్ల దగ్గరికి వారు పోయి బల్లను కడిగి పసుపు, కుంకుమ, గంధం బొట్లు పెట్టి కోడిని కోస్తారు. ఆ రక్తాన్ని ఒక పళ్లెంలో భద్రపర్చి, కోడి కూరను వండి, చలివిడి, వడపప్పుతో నైవేద్యం పెడతారు. అపుడు కోడి రక్తాన్ని బల్ల లేదా బండకు పూస్తారు. దుర్గాదేవిని తలచుకొని ఏ కష్టాలు రాకుండా కాపాడమని ప్రార్థించుకొంటారు. ఆదివారం పండగ చేస్తే మంగళవారం చాకిరేవు లేదా చాకిరి ప్రారంభిస్తారు. బల్లమీద ఎవ్వరినీ కూర్చోనీయరు. కాలుతో తన్నరాదు. బల్లపై అమ్మాయి కూర్చుంటే 'పెద్దమనిషి' కాదని సీతమ్మవారి శాపమట. పెళ్లికాని అబ్బాయి కూర్చొంటే పెళ్లికాదన్న భయం ఉంది. బల్లరాయిని పొద్దున్న చూస్తే మంచిదన్న నమ్మకం ఉంది. మాసిన బట్టలు కన్నతల్లితో సమానమని వారి నమ్మకం. తమకు జీవనోపాధి కల్గిస్తున్న పనిని పవిత్రంగా చూసుకోవడం ఇక్కడ కనబడుతుంది. 'బల్ల పండుగ'కు కులం బిడ్డలు వస్తారు. వీరిని 'కారు బేకలు' అంటారు. 'కారు బేకలు' వారు పటం విప్పి కథ చెప్పేముందు 'పంది'ని బలి ఇస్తారు. గంజికూటివారు కూడా ప్రతి రెండు సంవత్సరాలకొకసారి వచ్చి శావళి వివరిస్తారు.

వడ్రంగి, కమ్మరపని చేసేవారు సంక్రాంతి మరునాడు వచ్చే ముక్కనుమ రోజున 'సామాను పండగ' చేసుకొంటారు. వీరి కులదైవం కామాక్షమ్మ కనుక ఆ పండగని

---

(1) జానపద విజ్ఞాన దర్శిని సంపుటాలు

'కామాక్షమ్మ పండగ' అని కూడా అంటారు. ఆరోజు వారు ఉపయోగించుకొనే పరికరాల్ని, పనిముట్లన్నింటిని కడిగి శుభ్రం చేసి ఈశాన్యమూలలో కామాక్షమ్మ దేవత ముందుపెట్టి వాటికి విబూధి, జాజు పసుపు, కుంకుమ, గంధంతో బొట్లుపెట్టి అలంకరిస్తారు. నైవేద్యం పెడతారు. తలకూర వండుతారు. కోడి బలి ఉంటుంది. మంచిరోజుని చూసుకొని మూడు లేదా అయిదో రోజున సామాను తీసుకొంటారు.

తెలుగునాట ప్రధాన వృత్తి వ్యవసాయం. వ్యవసాయ సంవత్సరం ఏరువాకతో ప్రారంభమవుతుంది. కొత్తనాగలి, కొత్త తాళ్లు, కొత్త ముల్లు కర్ర అలా వ్యవసాయ పనిముట్లను చేర్చుకొని, కడిగి అలంకరించి వినాయకుని పూజించి పనులు ప్రారంభిస్తారు. పొలం పనులలో ఈశాన్య మూలకు ప్రాధాన్యత ఉంది. అక్కణ్ణించే పనులు ప్రారంభిస్తారు. ఉగాది నాడు 'దొంగేరు' – ఎవరికీ తెలియకుండా దున్నడం నిర్వహిస్తారు. ఇంట్లోనివారు శుచి శుభ్రతతో, దొంగేరు పోసేవారు కంకణం కట్టుకొని, దొంగేరు నిర్వహిస్తారు.

రోహిణి, మృగశిర కార్తెల్లో విత్తనాల పండగ జరుపుకొంటారు. విత్తనం కోసం గత సంవత్సరం బాగా పండిన వడ్లని బాగా ఆరబెట్టి గోనె సంచుల్లో నిల్వచేసుకొనేవారు. గోనె సంచుల్లో నింపడం వల్ల గాలి, వెలుతురు సోకుతుంది. విత్తనం కోసం భద్రపర్చుకొన్న వడ్లని ఒక రాత్రి, పగలు నానబెట్టతారు. కింద గడ్డి పర్చి దాని మీద వడ్లు నింపిన గోనె సంచుల్ని మండి కట్టుతారు. కొన్ని ప్రాంతాల్లో అండాయిలలో వడ్లుపోసి నానబెట్టి గంపల్లో పోసి మండి కట్టేవారు. దాని మీద వావిలి ఆకు, గడ్డి మెత్తుగా వేసి గంటకొకసారి నీళ్లు తడుపుతూ ఉండేవారు. మూడో రోజు మొలక వస్తుంది. దీన్ని 'వజ్రం' అంటారు. మండికట్టిన విత్తనాన్ని పొలానికి తీసుకు వెళ్లేటపుడు పేరంటాండ్రు ముగ్గురు కాళ్లకి పసుపు రాసుకొని, బొట్టు పెట్టుకొని, నీళ్లు పట్టుకొని ఎదురొస్తారు. విత్తనంతో పాటు ఈనెల బుట్టలో రెండు తవ్వల విత్తనం, మూడు చింతపండు ఉండలు, నాలుగు ఎండిన పసుపు కొమ్ములు వేసి ఉట్టిమీద పెట్టుకొని పొలానికి తీసుకువెళతారు. దిష్టి తగలకుండా అలా చేస్తారట. నారు మడిలో ఈశాన్యమూల చింతపండు ఉండలు, పసుపుకొమ్ములు భూమిలో

పాతి వినాయకుని బొమ్మను చేసి పూజించి విత్తనం చల్లుతారు.

చేనుకి ప్రధాన ఎరువు పేడ. పేడతోపాటు పశువుల కొట్టంలోని పశువులు తినగా మిగిలిన గడ్డి, తొక్కిన గడ్డి ఊడ్చి గొయ్యి తవ్వి అందులో పోసేవారు. ఇల్లు వాకిలి ఊడ్చిన చెత్త, ఇంటి పొయ్యిలోని బూడిద అందులోనే వేసేవారు. అలాగే ఇంటి జలజారు – స్నానానికి, కుండలు కడుగుకోవడానికి ఉపయోగించే – నీళ్లు కూడా దిబ్బలోకి పోయేటట్లు చేసుకొనేవారు. ఆముదపు పిండి, వేపపిండి, వేరుశెనగపిండి, ఆకు వేసి తొక్కేవారు. ఆముదపు పిండి రైతు మిత్రులయిన 'సాలెపురుగు', 'ఎర్రనల్లి', అచ్చంతల పురుగు' లాంటి క్రిముల్ని పెంచుతాయని నమ్మకం. వేపపిండి 'ముచ్చ తొలుచు పురుగు'ని బాగా నివారిస్తుందని నారు నాటిన నెల తర్వాత వేప పిండిని వేస్తారు. వరికుదుళ్లు బాగా పెరగడానికి, బలంగా ఉండడానికి వేరుశెనగ పిండి చల్లేవారు.

పైరు ఊడ్పులకు లేదా నాటడానికి ముందు 'మూన ముహూర్తం లేదా మొన ముహూర్తం' జరిపిస్తారు. పొలంలోని ఈశాన్య మూలలో మట్టిని తీసి వినాయకుని చేసి పసుపు, కుంకుమ చల్లి పూలతో అలంకరించి ధాన్యం, సోడిపిండి, పత్రులు, నల్లేరు, బలుసుకాయలు వేసి కొబ్బరికాయ కొట్టి మూడేసి నారు మొనల్ని వినాయకుని ముందు పెట్టి పూజిస్తారు. తర్వాత వారి వారి మునం ప్రారంభిస్తారు.

ఊడ్పుల చివరి రోజున మొనమీద బిడ్డల తల్లి చేత చనుబాలు పిండించి చల్లిస్తారు. కొన్ని ఊర్లలో ముగ్గురు లేదా అయిదుగురు బిడ్డ తల్లులు ఆ పని చేస్తారు. వారు చనుబాలు పిండడానికి ముందు సూర్యుడికి దండం పెట్టుకొని మూడు నాలుగు చుక్కలు పిండి చల్లుతారు. అందుకు ప్రతిఫలంగా రైతు వారికి డబ్బుతోపాటు కుడుములు, బెల్లం, బియ్యపు పిండితో చేసిన తీపి పదార్థాలు ఇస్తారు.

కోతలకు ముందు పొలం చుట్టూ తిరిగి ఈశాన్య భాగంలో రెండు పిడికిళ్ల పనకోసి మోపుకట్టి దానిమీద కోడిని కోసి చేను మీద విసురుతారు. ఈ కార్యక్రమాన్ని "పొలి అంటడం" అంటారు. దీని తర్వాత కోతలు ఎప్పుడైనా ప్రారంభించవచ్చు. మరికొన్ని ప్రాంతాల్లో పైరు పొట్టమీద ఉన్నప్పుడు పొలి తిరుగుతారు.

కోత కోసేటపుడు పొలి చల్లడం కొన్ని ప్రాంతాల్లో వాడుక. కోతకు వచ్చిన పంట పొలంలో ఈశాన్యమూల వినాయక బొమ్మని మట్టితో చేసి అన్నం, పసుపు, సున్నం కల్పిన 'పొలి అన్నం' లేదా కోడిని కోసి ఆ రక్తం కల్పిన 'పొలి అన్నం' చేను మీద 'పొలో పొలి' అంటూ చల్లేవారు. దీనివల్ల పంట పొలాన్ని ఏవయినా శక్తులు ఆవహించి ఉంటే పోతాయని నమ్మకం. పొలి చల్లినాక ఈశాన్యమూల నుంచి నాలుగు అయిదు పిడికిళ్ళ పనని ఇంటి యజమాని కోసుకొని ఇంటికి తెస్తాడు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో ఇంటి చూరుకి వేలాడతీసేవారు పిచ్చుకల కోసం. తర్వాత ఎపుడయినా కోత ప్రారంభించొచ్చు.

కోత కోసిన పనమోపుల్ని ఒకచోట చేర్చి పనగొట్టేవారు. ఆ వడ్లని రాశిగా పోయడానికి ముందు చేటతో వడ్లు ముంచుకొని గ్రామ దేవతకు గాని లేదా వారికి ఇష్టమున్న గుడికిగాని సమర్పించుకొంటారు. కొన్ని ప్రాంతాల్లో దేవుని కోసం పనమోపునే అర్పించుకోవడం ఉంది.

వడ్లరాశి మీద మధ్యలో చేటబెట్టి అందులో వినాయకుని బొమ్మ పెడతారు. రాశిని కొలిచేటపుడు వినాయకుని చేట ముందు ఉన్న వడ్లను విడిచిపెట్టి మిగతా రాశిని కొలుస్తారు. ఆ చేట కింద ఉండే వడ్లు ఆడబడుచుకు ఇస్తారు. వరంగల్లు ప్రాంతంలో రాశి పోసిన తర్వాత ముల్లు కర్రతో కింద భాగంలో ఒక గీత గీస్తారు. తరువాత దిష్టి తగలకుండా గడ్డితో నక్కను చేసి దాన్ని ఒక పక్కగా 'గొరిమిడి ముల్లు' కూడా పెడతారు. రాశికి కోడిని కోసి ఆ రక్తాన్ని రాశిమీద చల్లి, కోడి తలని రాశిలో గుచ్చిన తర్వాత కొలవడం ప్రారంభించేవారు. మొదట కొలిచే కుంచాన్ని బరుకతు లేదా లాభం అని మొదలుపెట్టి కొలుస్తారు. ఏడుకు బదులు 'ఆరున్నొకటి'. వడ్లకళ్లం ప్రారంభం నుంచి ఇంటికి తోలుకొని పోయే వరకు కళ్లం పక్కనే పిడకలు, తూర్పారపట్టిన తారుని ధూళి, దెయ్యం రాశిని ఆవహించకుండా ఉండేందుకు పెట్టుకొనేవారు. రాశిపోసిన తర్వాత రాత్రి కళ్లంలోనే ఉండాల్సి వస్తే 'ముదర్లు' వేసేవారు.

ఈ వివరణ చూస్తున్నప్పుడు వ్యవసాయం దైవాధీనం అన్నట్టుగా కనబడుతుంది.

కాని సూక్ష్మంగా, లోతుగా అధ్యయనం చేస్తే అందులో ఎన్నో మౌలిక అంశాలు, ఆయా వృత్తులకు సంబంధించిన విజ్ఞాన సంపద కనబడుతుంది. ఆ వృత్తి చేయడానికి లేదా ప్రారంభించడానికి ఒక సమయం ఉంది. ఒక క్రమ పద్ధతి ఉంది. చేసే వ్యక్తి ఉన్నాడు. ఉపయోగించే పనిముట్లు ఉన్నాయి. వీటి మీద అనుభవ పూర్వకంగా సంపాదించుకొన్న విజ్ఞాన సంపద ఉంది. ఏది చేయాలో ఏది చేయరాదో, ఎపుడు చేయాలో ఎపుడు చేయరాదో, ఎలా చేయాలో ఎలా చేయరాదో, ఎవరు చేయాలో, ఎవరు చేయరాదో, ఏ పనిముట్టు, లేదా పరికరం ఎపుడు ఉపయోగిస్తారు అన్న విషయాల మీద ఖచ్చితమైన తెలివిడి ఉంది. వృత్తులేమయినా ఆయా ప్రాంతాలలోని భూమి, నీరు, వాతావరణాన్ని అనుసరించే ఉంటాయన్నది నిజం. అందుకని అదే వృత్తి ఒక ప్రాంతంలో ఉన్నట్టే మరో ప్రాంతంలో ఉండవచ్చు. ఉండకపోవచ్చు. కాని ప్రధానమయిన క్రమపద్ధతి మాత్రం ఉంటుంది.

మనిషి మనుగడకి ప్రధానమైనవి గాలి, నీరు, ఆహారం. అవి కల్మషం లేకుండా అందినపుడు మానవ జీవనం ఒడిదుడుకులు లేకుండా, ఆరోగ్యంగా సాగుతుంది. అవి గతి తప్పినపుడు వాటి ప్రభావం మనిషి మీద పడుతుంది. అవి గతి తప్పకుండా ఉండడానికి ఆయా కాలాల్లో, ఆయా ప్రాంతాల్లో ఏమేమి చేయాలో వాటి సమాహారమే ఈ విజ్ఞాన సంపద.

గాలికి, చెట్లకి ఉన్న అనుబంధం, నీటి కోసం, వాన కోసం, నీటి నిల్వ కోసం, నీటి వినియోగం కోసం, అలాగే కాలానికి తగ్గట్టుగా ఆయా ప్రాంత వాతావరణానికి తగ్గట్టుగా సిద్ధపర్చుకొన్న ఆహారం మీద అనుభవ పూర్వకమయిన విజ్ఞాన సంపద ఇంకా కొంత మంది జ్ఞాపకాలలో భద్రంగా ఉంది. అది ఒక తరం నుంచి మరో తరానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అందిన సంపద. ఆ సంపదని అధ్యయనం చేస్తున్నప్పుడు తాము చేసే పనిని ఎంత ఇష్టంగా చేస్తున్నారో తెలుస్తుంది. ఇష్టంగా చేసే పనిలో తృప్తి ఉంటుంది. ఆ పనికి పవిత్రత ఆపాదించి చేస్తున్నపుడు దానిమీద ఆ తరం ఎంత నమ్మకాన్ని ప్రోది చేసుకొందో తెలుస్తుంది. ఆయా నమ్మకాలు వారు చేసే ప్రతి పనిలో ఎలా రూపందాల్చుకొన్నాయో తెలుస్తుంది. వర్తమానకాలం ఈ సంపదని పక్కకు పెట్టింది. అనుకరణకి, అరకొర జ్ఞానానికి పెద్దపీట వేయడం

వల్ల మనిషి మనుగడ చతికిలపడుతున్న వైనం కనబడుతుంది.

వృత్తి విజ్ఞానానికి సంబంధించిన సంపద పాటల రూపంలో, కథల రూపంలో, కళారూప ప్రదర్శనలలో, ఆచారాలు, అనుష్ఠానాలు నిర్వహించే క్రమంలో, పండుగలు, ఉత్సవాలు జరుపుకొనే నెపంతో ప్రచారంలోనే ఉన్నట్టు గుర్తించడానికి అవకాశం ఉంది. ఈ సంపద విరాట్ స్వరూపాన్ని, స్వభావాన్ని మనం ఇంకా పూర్తిగా సేకరించుకోలేదు. చాలా చాలా కారణాల వల్ల ఈ సంపద అవసరం నేడు తగ్గిపోతుంది. అవసరం తగ్గిపోయినపుడు అది కనుమరుగవడం ఖాయం.

తొలకరిలో వరసాలు కావాలి
ఎకరానికి గరిసె పండాలి
నీరుపెట్టి దుక్కి దున్నాలి
దుక్కి దున్ని మొక్క నాటాలి
పల్లెలు బాగుండాలి
పట్నాలు బాగుండాలి (నేదునూరి, 360)

ఇదీ రైతుమది. పని చేయకుండా ఫలితం కావాలనడం లేదు. తను బతకాలి తనతో అందరునూ పశుపక్ష్యాదులతోపాటు బతకాలి అన్నది రైతు మనస్సు. 'పేరు కంకుల మీద పిట్టలు వాలాయి కొట్టకుండ, తిట్టకుండా, అదలకించి బెదిరిస్త అవతలకు పోవురా' (పైదే) అన్నది రైతు జీవితం. నేదునూరి గంగాధరం గారు వ్యవసాయ వాఙ్మయం పేరుతో వ్యవసాయంలో చేసే ప్రతి పనిలో పాడే పాటల్ని సేకరించి ఒక దగ్గర చేర్చినారు. ఆయా పాటల్లో దున్నకం దగ్గరి నుంచి రాశిని ఇంటికి చేర్చేదాక ఉన్న విజ్ఞానం అంతా కనబడుతుంది. వ్యవసాయంలో, విత్తనం, దున్నకం, నీళ్లు ఎవరెవరు ఏమేమి చేస్తారు. ఎవరెవరికి ఎంతెంత, ఎవరెవరు ఏయే వడ్లు బియ్యం తింటారు లాంటి విషయాలు ఆ పాటల్లో చాలా చక్కగా ఉంది. (చూడు : నేదునూరి 406 - 412).

పెద్దవరి ధాన్యాలు కాపోళ్లు తిన్నా
వెలమలూ తిన్నవీ వెల్లరకణాలు

తెలగాలు తిన్నవీ తెల్లబాలోరీ
మాలోళ్లు తిన్నవీ గవిరి వజ్జాణాలూ
మురికి వజ్జాణోలు మాదిగోళ్లుతిన్నా
సెగిడోళ్లు తిన్నవిరా శామంచనాలూ
వాయిలపాటి సన్నాలు చాకళ్లుతిన్నా
మంగళ్లు తిన్నవిరా మల్లిసన్నాలు
దూదిభోగములండీ దూదేకులోడీవి
కాకిమూతి సన్నాలు కమసాల్లు తిన్నా
యఱ్ఱబాలూ ధాన్యం యాతోళ్లు తిన్నా
కాయిరి ధాన్యాలు కాజోల్లు తిన్నా
బలరామ భోగాలు బ్రాహ్మర్లు తిన్నా

అంటూ సాగే ఈ పాటలో (నేదునూరి, పైదే) ఇంకా రక్తసరి ధాన్యాలు, సన్నసూద్రులు, బంగారు తీగెలు, బొద్దవా ధాన్యాలు, దాళవా ధాన్యాలు, సత్తికపు ధాన్యాలు, గుత్తుబాసికాలు, బుడమధాన్యాలు, మడిలో పండిన మండిరాసికాలు, చెరువులో పండిన చేమంచనాలు, గుంటలో పండిన గుత్తుబాసికాలు, అచ్చికలు, బుచ్చికలు, యెల్లంకణాలు, చేని కాటికలు, మల్లిసన్నాలు, అమ్మవారు తినే అమృతపాణీలు అంటూ ధాన్యాల పేర్లని, వాటిని ఏయే కులాలవారు తింటారో వివరిస్తుంది. నిజంగా ఆయా కులాలవారు అదే బియ్యం తిన్నారా లేక ప్రాసకోసం వాడుకొన్నారా అన్నది ప్రస్తుతానికి ప్రధానం కాదు. కాని వడ్ల రకాల్లో వైవిధ్యం ఉండింది అని మనం గుర్తించడానికి ఇది పనికి వస్తుంది.

కాటమరాజు గోగణం పాకనాటిలోని వరిపొలాల్ని నాశనం చేసే సందర్భంలో వడ్ల జాతులలోని వైవిధ్యాన్ని వివరిస్తారు. కస్తూరి నిగనాలు, గాజుగౌరి, రాజనాలు, రవిగుత్తులు అంటూ నూటికి పైగా ఉన్న రకాల్ని వివరిస్తారు. (తంగిరాల 112 - 114). హంసవింశతి (ఆ 5, 128) లో 24 పాదాలు కల్గిన సీసమాలికలో వడ్ల రకాలు చాలా విస్తారంగా వివరించబడి ఉన్నాయి. - 'గడ్డి జాతుల్ని ఎంచినా వడ్ల

జాతుల నెంచలేము' అన్నది సామెత.

'దొంగేరు'తో ప్రారంభమయిన దున్నకం ఆయా పైర్లకు, పొలానికి అనుగుణంగా సాగుతుంది. [1]"పల్లం దున్నినవాడు పల్లకీ యెక్కినవానితో సమానం", 'అరక అరిగితే గరిసె విరుగు', 'ఇసుకనేల దున్ని బాగుపడదు, బంకనేల దున్ని చెడదు', 'ఊట నేల దుక్కికి వస్తుందా', 'ఎరువు బెట్టిదున్నాలి', 'ఏగిలి దున్నితె మాలకైనా పండుతుంది', 'కళ్ళు అరిగిన గాదెలు నిండును', 'కోటి విద్యలు కొంగ్ర లోపలనే', 'కోటి విద్యలు కొంగ్రకు తీసికట్టే', 'గొఱ్ఱెమంద కట్టడం కంటె లోతుగా దున్నడమే మేలు', 'చెరువు కింద దున్ని చెడినవాడు లేడు', 'జానెడు దుక్కి మూరెడు ఎరువుకి సమానం', 'జొన్నకు ఏడుమార్లు గుంటుక తోలాలి', 'దుక్కి వుంటే దిక్కు ఉంది', 'దుక్కి కొద్దీ పంట బుద్ధి కొద్దీ సుఖం', 'దుక్కి చలవే చలవ తల్లి పాలే పాలు', 'దుక్కి లేని చేను తాళింపు లేని కూర', 'దుక్కి లేని చేనుకి ఎరువెంత పెట్టినా దండుగే', 'దున్నకుండా చల్లితే కొయ్యకుండా పండుతాయి', 'నాగలి ఉన్న ఊర ఆకలి చేరదు', 'నువ్వులకు ఏడు దుక్కులు, ఉలవకు ఒక దుక్కి', 'పందుం తిన్నవాడే పది దుక్కులు దున్నగలడు', 'ప్రత్తికి పదిచాళ్లూ ఆముదాలకి ఆరుచాళ్లూ', 'ప్రత్తికి పదిచాళ్లూ జొన్నకు ఏడు చాళ్లూ', 'బావి క్రింద దున్ని బ్రతికినవాడు చేని క్రింద దున్ని చెడినవాడు లేడు', 'మడిదున్ని మహారాజైనవాడు చేనుదున్ని చెడినవాడు లేడు', 'మన్ను నమ్మి దున్నినవాడే మన్నీడు', 'మన్ను మిన్ను మెత్తబడితేనే మనుష్యులకి బ్రతుకు', 'మాగిలి దున్నితే మాలనికైనా పండును', 'మాగిలి దున్నితే మరింత పంట', 'మెట్ట దున్నిన వాడు లొట్టి త్రాగినవాడు ఒకటి', 'విత్తు కంటే క్షేత్రం మెరుగు', 'సాగుబడి చేస్తేనే సంసారి, దున్నితేనే రైతు', అని దున్నకం ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని సమయ సందర్భాల్ని పరిచయం చేస్తూ ప్రచారం చేయడమే ఈ సామెతల ప్రయోజనమని అర్థం అవుతుంది.

ఏరువాక వ్యవసాయంలో ఒక ముఖ్య సంఘటన. సంవత్సరంలో వ్యవసాయ ప్రారంభానికి అది సూచిక. ప్రారంభం కనుక దాన్ని పవిత్రంగా భావించుకొని పూజాది కార్యక్రమాలతో ప్రారంభిస్తారు. ఈ పాటల్లో వ్యవసాయంలోని సూక్ష్మ

---

1. వ్యవసాయ సామెతలు - (సంకలనం), నేదునూరి గంగాధరరావు

విషయాలకి సంబంధించిన అనుభవ పూర్వకమైన సలహాలని ప్రచారం చేయడమే గాకుండా పవిత్రంగా భావించుకొన్న సన్నివేశాలని, సంఘటనల్ని, భావనల్ని ఎలా ఆచరించాలో, ఆచారాలు, అనుష్ఠానాలు నిర్వహించాలో, వాటి మీద వ్యక్తుల ఆశలు, ఆకాంక్షలు లాంటి ఎన్నో విషయాలని కూడా పాటలు ప్రచారం చేస్తున్నాయి. (చూ॥ వ్యవసాయ వాఙ్మయం, నేదునూరి గంగాధరం), ఏరువాక తర్వాత దున్నకం, ఎరువు, విత్తనం, నారు, నాటు, కలుపు తీయడం, పొట్టకు వచ్చిన తర్వాత, కోతలపుడు చేసే కార్యక్రమాలకి సంబంధించిన విజ్ఞాన సంపద మనకు ఈ పాటల్లో కనబడుతుంది. 'పశువులూ పడుచులూ ఉంటేనే వ్యవసాయం', పశువుల ఎరువు పంటకు బాట, 'పశువులు బట్టే పెంట, పెంటను బట్టే పంట', 'పెంట మీద పంట మంట మీద వంట', పెంటకుప్ప పెరిగితే పేదరైతు పెద్దవుతాడు', 'మడికి మంద చేనుకి ఎరువు' 'పుట్టమన్ను వేస్తే పుడమి ఫలిస్తుంది' అని పంటకు ఎరువు అవసరాన్ని, పశువుల పేడ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేస్తున్నాయి ఈ సామెతలు. అందుకనే పాడి పంటలు అన్నారు. 'పైరు మారిస్తేనే పంట పెంపు', 'మన్ను చూసి వ్యవసాయం మిన్నుచూసి విత్తనం' 'క్షామాన జొన్న వర్షాన వడ్లు' అంటూ వ్యవసాయంలోని మెలకువల్ని జోడిస్తున్నాయి సామెతలు. 'మంగళవారం మండె వేయరాదు', 'బుధవారం పుట్టిన, దున్నభూమిని దున్నినా పొంగి పొంగి పండుతుంది' అని ఏయేవారాల్లో ఏయే పనులు చేస్తే బాగుంటుందో అన్న నమ్మకానికి సంబంధించిన చిట్కాలు ఇందులో వున్నాయి. అలాగే వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన వైవిధ్యాన్ని, వైభవాన్ని సామెతలు తెలియజేస్తున్నాయి.

వ్యవసాయానికి మరో ప్రధాన వనరు నీరు. నీరు కావాలంటే వర్షం కావాలి. వర్షం కావాలంటే, వాతావరణం చల్లబడాలి. వర్షం వచ్చి నీరు చేరితే నిల్వ చేసుకోవాలి. భద్రపర్చుకోవాలి. నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి. వీటికి సంబంధించిన విజ్ఞానం ఆటల ద్వారా, ఆచారాల ద్వారా, పండగల ద్వారా, అనుష్ఠానాల ద్వారా ప్రచారంలో ఉంది. ఏయే సమయంలో లేదా కార్తెల్లో వాన వస్తే వ్యవసాయ పనులకు కలిగే లాభనష్టాల మూల్యాంకన పాటలు సామెతల ద్వారా ప్రచారం చేస్తున్నట్టు కనబడుతుంది.

వర్షసూచన కనిపెట్టడానికి నాయకపోడు గిరిజనులు 'సూలాల పండగ' నిర్వహిస్తారు. వాన రావడానికి జరిపే ఆచారాలలో వరంగల్లు ప్రాంతంలో 'పెద్దమ్మ పండుగ', 'పాండవులకు పెట్టుకోవడం', నాయక పోడుల 'సాల్‌దేవర పండుగ', 'పోచమ్మ పండుగ', 'దేవతలకి అభిషేకం', 'కప్పతల్లి ఆట', 'పాశం నాకించడం', ఆవుని సజీవంగా పాతిపెట్టడం ప్రధానంగా కనబడుతున్నాయి. నిండు చెరువుని కాపాడుకోవడానికి 'కార్తీకదీపం', 'గంగ తెప్ప' వదలడం, నీటిని మొదటిసారి వినియోగించుకొంటున్నప్పుడు 'కట్టమైసమ్మ'కు పెట్టుకోవడం ఉంది.

వర్షం కోసం దేవతా విగ్రహాలకి అభిషేకం చేయడానికి కొన్ని ప్రాంతాల్లో కన్నెపిల్లలు నీళ్లు తెస్తే మరికొన్ని ప్రాంతాల్లో కులపెద్ద భార్య తేవడం ఆనవాయితీ. ఆడవారికి ప్రాధాన్యత ఉంది. శాస్త్రీయంగా చూసినపుడు వాతావరణం చల్లబడితే వర్షం పడవచ్చు అన్న నమ్మకం ఈ అభిషేకానికి ప్రోద్బలంగా కనబడుతుంది. అలాంటిదే కప్పతల్లి ఆట కూడా. కప్ప అరిస్తే వాన పడుతుంది అన్నది ఒక నమ్మకం. కప్ప అరవాలంటే అది నీళ్లలో తడిసి ఉండాలి. ఈ నమ్మకం మీద ఆధారపడిందే కప్పతల్లి ఆట. కప్పని పట్టుకొని రోకలికి లేదా కొయ్యకు వేలాడదీసి ఇంటింటికి తిప్పి, పేడనీళ్ళు, పసుపు నీళ్లు, మంచి నీళ్లు పోయించి, చివర చెరువులో వదలిపెట్టతారు.

బోనంలో పాలు, బెల్లం, బియ్యంలో ఎక్కువ నీళ్లు కల్పి పాశం (పాయసం) వండి, ఆ పాశాన్ని గుట్టమీదనో బండమీదనో లేక ఆకు దొప్పలలోనయినా పోసి నాకిస్తారు. బెల్లం పానకం, పాశం ఎండా కాలంలో వచ్చే పండగలు, అనుష్ఠానాల్లో ఎక్కువగా వాడుతున్నట్టు గుర్తించగలం. బెల్లం తింటే కాకి గద్దలు లేస్తాయని తిననీయరు. బెల్లం నీటిలో కల్పి పానకం చేస్తారు. ఆ పానకం చలువ చేస్తుందన్నది వాస్తవం. నీళ్లు, బెల్లం కల్పడం వల్ల చల్లదనం కలుగుతుందన్న నమ్మకంతోనే ఎండాకాలంలో పాశానికి, పానకానికి ప్రాధాన్యత ఇచ్చారా అనిపిస్తుంది.

అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులని గుర్తించడానికి కౌరవులు చేసిన ప్రయత్నాలలో వారికి వచ్చిన సలహా 'ఎక్కడ ప్రజలు సుభిక్షంగా ఉంటారో అక్కడ పాండవులు ఉంటారు' అని. సుభిక్షంగా ఉండాలంటే పంటలు పండాలి. పంటలకు

నీరు ఆధారం. అందుకని పాండవుల కథని వింటే వర్షం పడుతుంది అన్నది ఒక నమ్మకం. కాకిపడిగెలవారిని పిలిపించుకొని పాండవులకథని చెప్పించుకొంటారు. తోలు బొమ్మలాటల ద్వారా విరాటపర్వం కథని ప్రదర్శిస్తారు. పురాణ కాలక్షేపాలు ఉంటాయి. చిత్తూరు జిల్లాలో గంగమ్మ జాతరలు ఊరూరా జరపడం ఆనవాయితీ.

ఉరకలు వేసే నీటి అలల్ని నిలకట్టి చెరువు కట్ట గండి పడకుండా, తెగిపోకుండా ఉండడానికి 'గంగతెప్ప'ని వదులుతారు. ఇది నమ్మకమే గాకుండా ప్రజల అనుభవం కూడా.

ప్రజల మనస్సులో దోబూచులాడుతున్న ఒక నమ్మకం ఏయే మాధ్యమాలలో, ఏయే ప్రక్రియల్లో ఏయే రూపం పొందుతుందో ఈ విషయాలు తెలియజేస్తున్నాయి.

చెరువు నిండిన తర్వాత కూడా వచ్చే నీళ్లు కల్జు లేదా మత్తడి ద్వారా బయటకు పోతాయి. ఈ నీళ్లు ఎత్తయిన లేదా మెట్టభూముల గుండా పారి మరో చెరువుకి వనరుగా మారతాయి. అలా ఆయా ప్రాంతాలలోని చెరువులు ఒకదానితో ఒకటి అనుసంధానింపబడి ఉంటాయి. పొలాల ఎత్తుపల్లాల్ని బట్టి, వాటి పారకాన్ని బట్టి చెరువుకి వేరు వేరు తూములుంటాయి. పై నీళ్లు ఉపయోగించుకోవడానికి వీలుగా మిట్టతూముని తెర్చి మిట్టభూముల్లో సాగుచేసేవారు. నీరు తగ్గేదాన్నిబట్టి మరో తూము తెరుస్తారు. నీళ్లు ఆ స్థాయికి దిగినాక 'పల్లాపుతూము' తెరుస్తారు. చెరువు నీటి పారకం, చెరువు ముందరి పొలాలకి చివరి నీటిబొట్టు దాకా ఉంటుంది. ఈ పొలాలకు ఆ ఊరి 'పాలకవర్గ, కుటుంబాలకి, సంబంధం ఉన్నట్టు గుర్తించడానికి వీలవుతుంది. శ్రీకృష్ణదేవరాయలు తవ్వించిన 'రాయల చెరువు'కు ఏడు తూములుండేవని జనశ్రుతి. అయితే ప్రస్తుతానికి మూడు తూములు మాత్రమే ఉన్నాయట. మిగతావి బూడుపొయ్యి ఉండాలి. అందుకే రాయలచెరువు నిండితే పద్నాలుగు ఊర్లు, ఎండితే పద్నాలుగు ఊర్లు సుభిక్షంగా ఉంటాయన్నది ఆ ప్రాంత నానుడి.

ఏయే కార్తెల్లో వర్షం వస్తుంది, ఏయే కార్తెల్లో వర్షం వస్తే వ్యవసాయానికి మంచిదో సామెతలు చెప్తున్నాయి. 'అశ్వని కురిస్తే' అంతా నష్టమే. 'భరణి కురిస్తే ధరణి పండును', 'కత్తెరలో వాన కనకం పంట', 'మృగశిరకు ముంగిళ్లు చల్లబడతాయి',

'మృగశిర కురిస్తే ముసలెద్దు రంకె వేస్తుంది', 'మృగశిర చిందిస్తే మిగిలిన కార్తెలు కురుస్తాయి', 'మృగశిర వర్షిస్తే మఖ గర్జిస్తుంది'; మృగశిర కురిస్తే ముంగారి పండుతుంది', 'ఆరుద్ర కురిస్తే దరిద్రము పోవు', 'ఆరుద్ర వాన అదను వాన', 'ఆరుద్ర కనికరిస్తే ఆ రుద్రునికైనా రైతు జడవడు', అని మృగశిర, ఆరుద్ర కార్తెలకు ఉన్న ప్రాముఖ్యాన్ని సామెతలు ప్రచారం చేస్తున్నాయి. 'తూనీగలాడితే తూమెడు వర్షం', 'పడమట కొఱ్ఱు వేస్తే పాడి ఆవు రంకె వేస్తుంది', 'పడమర మెరిసిన పది గడియలకు వాన', 'పడమట కొఱ్ఱు పడితే పందిళ్లమీద రాజనాలు' అన్నవి అనుభవంతో కూడుకొన్న నమ్మకాలు. (చూ. వ్యవసాయ సామెతలు)

నీటిని తూములు తెర్చి పంట కాలువల ద్వారా పొలాలకు పారిస్తారు. దీని వెనుక ఒక వ్యవస్థ ఉంటుంది. పంట కాలువల నీరు పారకపోతే గతంలో 'గూడ' 'ఏతాం', గుంటలు, బావుల నుంచి గిలకల ఏతాం, మోట కొట్టుతూ నీళ్లు పారించుకొనేవారు. మెట్ట పైర్లకు చిన్న చిన్న పెడలు, పాదులు వేసి పారిస్తారు.

పొలాన్ని గుర్తించడానికి పేర్లు ఉంటాయి. ఆ పేర్లు పొలం పండే పైరుని బట్టి, మట్టి రుచిని బట్టి, రంగుని బట్టి, యజమానిని బట్టి ఏదో ఒక చారిత్రక స్పర్శని బట్టి అలాంటి విభిన్న పేరులతో పొలం భూముల్ని గుర్తిస్తున్నారు. కొన్ని భూములు కళాకారులకు, కొంత మంది వ్యక్తులకు ఇచ్చిన ఇనాం భూములు. మరికొన్ని గుళ్లకి, వృత్తులు చేసేవారికి ఇచ్చిన మాన్యాలు.

కాటమరాజు గోగణాలు పాకనాటిలోని వరిచేలలోపడి మేస్తున్నప్పుడు 'ఎండితూము', 'పైడితూము', 'రాగితూము', 'కంచుతూము'ల పారకంతో పండిస్తున్న వివిధ పంటల్ని నాశనం చేసినట్టు ఉంది. 'చేటంత మొయిలుట్టి చెఱువులే నిండాయి', 'రాగి తూముల నీట రాజనాలు పండె', 'కంచు తూముల నీట కార్తికలు పండె', 'వెండి తూముల నీట వెఱడాలు పండె'నట (మిన్నేరు, పు. 403 - 404). 'పాకాల చెరువుకూ ఎన్నియో రేవులూ', 'ఉప్పుప్పు రేవొకటి ఊటను రేవోటి', 'మాయన్న తాగేటి మంచినీటి రేవు', 'బసవన్న తాగేటి పాలరేవోటీ', (త్రివేణి, పు. 360 - 361) అని చెరువులకు సంబంధించిన రేవుల ప్రస్తావన ఉంది.

వ్యవసాయంతో సంబంధం ఉన్న చాలా విషయాల్ని పాటలు ప్రస్తావిస్తున్నాయి. పనిముట్లు, పరికరాలు, వ్యక్తులు, వారికి ఆయా సందర్భాలలో ఉన్న ప్రత్యేక బాధ్యతలు, పొలం పనులు అవి చేసే విధానం, అందులో పాటించే క్రమపద్ధతి, చేసేవారి మనస్సులలో మెదిలే ఊహలు లాంటి ఎన్నో అంశాల్ని అక్కడ చూడవచ్చు.

ఏటికేతం బట్టి ఎయిపుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరుగరన్నా! నేను
గంజిలో మెతుకెరుగరన్నా (మిన్నేరు, పు. 458; త్రివేణి పు. 162)

సేద్యగాళ్ల అసంతృప్తి అది. 'ఎన్నాళ్లు పాటుపడ్డ ఈ గునపమే మిగులు, ఈ రెక్కలే మిగులు, గంజిముంత వంచి చూడ గంజి చుక్కకే కరువు' (మధుర కవితలు, పు. 154 - 155) అన్న నిరాశా నిస్పృహలు కనబడతాయి.

మోట తోలడానికి మంచి ఎడ్లజోడు, ఎద్దుల మెడ మీద మదిర కాడి, బద్దె పలుపులు, వలపటి దాపటి ఎద్దులు, వలపటి దారి పిల్లబాట, దాపటి బాట దండుబాట, మోకు, ఆకుతీగలు, దండెడ తాడు, తొండపుతాడు, బిళ్ల, కదురు, బొక్కెన కావాలని, వాటి ప్రయోజనాన్ని విడమర్చి చెప్పే పాటలు ఉన్నాయి. (త్రివేణి, పు. 163 - 164).

వ్యవసాయ విజ్ఞానాన్ని ప్రచారం చేయడం, పాటలు, కథాగేయాల మరో బాధ్యతగా తెలుస్తుంది.

వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమకు కూడా పెద్దపీట వేశారు. అతిథుల మర్యాదలో పాలు, పెరుగు, మీగడ, జున్ను, వెన్న, నేయి ఉపయోగించిన పిండి వంటలకు, భోజనానికి ప్రత్యేకత ఉంది. పశువులు వ్యవసాయంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గొర్రెలు, మేకలు కూడా పాడి సంపదలో భాగమయ్యాయి. మేకల పుత్తూరు లాంటి ఊర్లపేర్లు స్థిరపడ్డాయి.

# జీవితచక్ర సంబరాలు

మానవ జీవితచక్రంలో పుట్టుక, బారసాల, సమర్త, పెండ్లి, చావులాంటి సందర్భాలలో ఆచారాల తంతు ఎక్కువ. ఆచారాలలో వంటలకి, వస్తు సంస్కృతికి, వ్యక్తులకి, స్థలానికి ప్రత్యేక పాత్ర ఉన్నట్టు కనబడుతుంది. పెండ్లి ఆచారాలని గురించి పాటలు, కథా గేయాల్లో చాలా వివరంగా ప్రస్తావించబడి ఉంది.

పెండ్లి ఆచారాలలో సంబంధ బాంధవ్యాలకి, పెళ్లి చూపులు, లగ్న నిర్ణయం పెండ్లి, పెండ్లి తరువాత అన్న అంశాలు ప్రధానంగా కనబడుతాయి. ఎవరితో ఎవరికి పెండ్లి జరిపించాలి అన్న విషయంలో మేనమామ, మేనత్త కొడుకుని లేదా కూతుర్ని చేసుకోవడానికి పెద్దపీట వేసినట్టు తెలుస్తుంది. అన్నతోనే వియ్యమందాలి అన్న పట్టుదల బలంగా ఉంది. అవసరమయితే వదినతో జగడం ఆడి అయినాసరే అన్న కూతుర్ని తెచ్చుకోవాలి అన్నది నాటి మాట. మేనరికం సంబంధాలు ఎక్కువగా ఉండేవి. మేన కోడలిని పెండ్లి చేసుకోవడం కొన్ని ప్రాంతాల్లో, కొన్ని కులాల్లో నిషిద్ధం. అక్క బిడ్డల్ని దేవతలుగా భావిస్తారు. ఇతరత్ర చేసుకోవాల్సి వస్తే కులం, గోత్రం పట్టింపులు ఉండేవి. ఏడు జతల చెప్పులు అరగాలి అని నానుడి.

[1]ఆరె వాళ్లలో అమ్మాయి సంబంధం నచ్చితే చేయి కడుగుకొంటారు. పప్పన్నం లేదా తీపి ముట్టుకొని తమ అబ్బాయిని చూడడానికి ఆహ్వానిస్తారు. అబ్బాయి నచ్చినట్లయితే వచ్చినవాళ్లు నీళ్లు తాగి మాట్లాడుకోవడానికి రోజును నిర్ణయించుకొంటారు. గౌడవారు అమ్మాయి నచ్చితే మెతుకులు ముట్టుకొంటారు. చాకలివారు అమ్మాయి నచ్చితే బొట్టు పెట్టుకొని భోజనాలు చేసి అబ్బాయిని చూడడానికి ఆహ్వానిస్తారు. పెళ్లిచూపుల్లో ఆడబిడ్డకు ప్రాధాన్యత ఉంది. పద్మశాలీలలో అమ్మాయి నచ్చితే కల్లు పుచ్చుకొని అబ్బాయిని చూడడానికి ఆహ్వానిస్తారట. సంబంధం నచ్చితే తింటారు. మాదిగ వారిలో అబ్బాయి నచ్చితే కండువా కప్పుతారు. కులపెద్ద కండువా దులిపి ఎడమ భుజంపై వేసుకొంటూ లేస్తే అబ్బాయి నచ్చలేదని, కుడి భుజంపై వేసుకొంటే సంబంధం ఖాయం చేసినట్టు లెక్క.

---

1. జానపద విజ్ఞాన దర్శిని - చౌళ్లపల్లి

సంబంధం స్థిరపర్చుకొన్నాక అమ్మాయిని మాది అనిపించుకోవడానికి పూలు, పండ్లు, చీర, రవికలు పెడతారు. పప్పన్నం ముఖ్యం. ఈ ఆచారాన్ని విడెము లేదా పూలు పండ్లు అంటారు. ఖర్జూరం పండ్లు ప్రత్యేకం. ఇది అయినాక అబ్బాయికి బొట్టు పెట్టడం లేదా 'వరపూజ' నిర్వహిస్తారు. పెండ్లికి లగ్న నిర్ణయం లేదా లగ్నకోటు నిర్ణయిస్తారు. బంధువులకి తెలియజేయడం, పెండ్లి పనులు, ఇంటి పనులు ఉంటాయి. ఆరెవారు ముందు ఆడబిడ్డకు తెలియజేస్తారు. చాకలి వారు శుభలేఖల్ని పంచడం ఆనవాయితీగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇంటిని అలంకరించుకొనేటపుడు గౌడవారు తంగేడు పూలతోపాటు ఎర్రమన్ను మట్టి తెస్తారు.

పెండ్లికి ముందు అబ్బాయి ఇంట్లో తోరణాలు కట్టడం, పెండ్లి గద్దె వేయడం, కూరాడు కుండలు తేవడం, గాడిపొయ్యిలు తవ్వడం, తలంబ్రాలు కలపడం, సేవ తీయడం, పదిహేను అయిరేణులు, ఒక గరిగెబుడ్డి తేవడం, ఒడిబాలు బియ్యం కలపడం, పెండ్లి కొడుకుని చేయడం లాంటి కార్యక్రమాల్ని ఆరెవారి కుటుంబంలో చూడవచ్చు. పెండ్లి ముందు రోజు ముత్తయిదువులు ఊరేగింపుతో పుట్టవద్దకు వెళ్లి అయిదు పారల మట్టిని తెచ్చి పెండ్లి గద్దె వేస్తారు. ఆడబిడ్డ ముత్తయిదువులు కల్పి కుమ్మరి వారింటికిపోయి కొత్త కుండల్ని – కూరాడు కుండలుగా తెస్తారు. గాడి పొయ్యి తవ్వుతారు. ఆడబిడ్డ అలికి ముగ్గు వేస్తుంది. కూరాడు కుండలులో నీళ్ళు పోసి పొయ్యిమీద పెడతారు. ఈ కూరాడు కుండలు పదహారవ పండగ వరకు ఉండాలి. పెండ్లి కొడుకుని చేసే కార్యక్రమంలో ఆడబిడ్డ అయిరేణి ముందు పెండ్లి కొడుకుకి బాసింగం కడుతుంది.

తెలంగాణా ప్రాంతంలో పుట్టమన్నుతో పెండ్లి గద్దె వేయడం, కూరాడు కుండలు, అయిరేణులు తేవడం, మైలపోలు తీయడం, తలంబ్రాల బియ్యం చేసుకోవడం లాంటివి ఉన్నాయి. అమ్మాయి ఇంట్లో పెండ్లి సమయంలో మూడుకాళ్ల పీట ఒకటి, నాలుగు కాళ్ల పీట ఒకటి మోదుగ కర్రతో వడ్రంగి వారు చేసి ఇస్తారు. వీటికి పసుపురాసి, బొట్టుపెట్టి, కంకణం కట్టి గద్దెపైన మూడు కాళ్లపీట తూర్పున, నాలుగు కాళ్ల పీట పడమరన పెడతారు.

అమ్మాయి ఇంటి ముందుకి అబ్బాయి రాగానే బావమరిది కాళ్లు కడిగి, తుడిచి బావ చెవిని పట్టుకొంటాడు. బావ బావమరిదికి కట్నం ఇస్తాడు. బావమరిది బావను ఎత్తుకొని లగ్నం గద్దె మీదికి తీసుకవస్తాడు.

పెండ్లి పీటల మీదికి ముందు అబ్బాయి వచ్చి పడమర ముఖంగా తూర్పున కూర్చొంటాడు. మేనమామలు అమ్మాయిని ఎత్తుకొని లగ్నం పైకి తీసుకవస్తారు. ఇద్దరి మధ్య తెర, జిలకర బెల్లం పెట్టిన తర్వాత తీసేస్తారు. రెండు కొత్త వెదురు గంపల్ని తెచ్చి పెండ్లి పందిరిలో ఎదురెదురుగా పెడతారు. అందులో వ్యవసాయ పనిముట్లు పెట్టి ఒక గంపలో అబ్బాయిని మరో గంపలో అమ్మాయిని నిల్చోబెడతారు. ఈ గంపలలో వీరు తెరపచ్చరం తీసి ఒకరి ముఖం ఒకరు చూసుకోగానే పెండ్లి పీటల మీద కూర్చోబెడతారు. పెండ్లి కూతురు తల్లి నీళ్లు పోస్తుంటే తండ్రి వరుని కాళ్లు, అమ్మాయి కాళ్ళు కూడా కడుగుతాడు. అబ్బాయివారు తెచ్చిన జిలకర బెల్లం అమ్మాయి మీద, అమ్మాయి వారు తెచ్చిన జిలకర బెల్లం అబ్బాయి మీద పెట్టిస్తారు. జిలకర బెల్లం ఎవరు ముందుగా పెడితే వారిదే సంసారంలో పైచేయిగా భావిస్తారు. పెండ్లి గద్దెమీద పెండ్లి కొడుకు పెండ్లి కూతురు ఒకరి కుడికాలును మరొకరి కుడికాలుతో తొక్కిస్తారు. తల్లి గారింటి అత్తగారింటి రెండు మంగళ సూత్రాలు పసుపుదారానికి కట్టి కుడుకలో పెట్టి ఉంచుతారు. పురోహితుడు మంత్రాలు వల్లిస్తుండగా అబ్బాయి అమ్మాయి మెడలో మంగళసూత్రం మూడు ముళ్లు వేసి దానిపై పసుపు కుంకుమ చల్లుతాడు. అబ్బాయి అమ్మాయి కాలికి మట్టెలు పెడతారు. ముందు అమ్మాయి అబ్బాయి మీద తలంబ్రాలు పోస్తుంది. తర్వాత ఒకరి మీద ఒకరు పోసుకుంటారు. పెండ్లి గద్దెముందు కూర్చోబెట్టి ఒక కుడుకలో పాలు, పెరుగు, నెయ్యి, తేనె, శర్కర కల్పి పంచామృతాన్ని ఒకరి కొకరు అందించుకొంటూ తాగుతారు. దీన్నే 'ఎంగిలి కలపడం' అంటారు.

పెండ్లి అయినాక నాగపెళ్లి లేదా నాగవల్లి. డేగాట, నాగలికానెపై పెండ్లి కొడుకుని కూర్చోబెట్టి బొట్టు పెట్టి నూనె అంటుతారు. కొత్త బట్టలు కట్టుకొంటాడు. సాయంత్రం పెండ్లి కొడుకు పెండ్లి కూతురు ఎదురెదురుగా కూర్చొని చెక్క బొమ్మతో ఆడుకొంటారు.

స్త్రీలు ఆరె భాషలో పాటలు పాడుతుంటారు. పల్లకీలో ఊరేగింపు.

అత్తమామలు పెండ్లి కూతుర్ని చేసే సమయంలో ఆకుపచ్చ చీర తెస్తారు. పెండ్లి పీటల మీద పసుపు చీర, నాగవల్లిలో రంగు ఏదయినా విలువయిన చీర అయివుండాలి. అత్త కోడలుకు పెట్టే ఈ మూడు చీరల్ని ప్రదానం, లగ్నం, నాగవెల్లి చీరలంటారు. తర్వాత సారె పంపడం. అమ్మాయి ఇంట్లో పదహారవ పండగ చేస్తారు. ముత్తయిదువులు నల్లపూసల్ని అమ్మాయి పుస్తెకు కట్టతారు. ఆడబిడ్డ అయిరేణిలను కదిలిస్తుంది. వాటిలో బియ్యం వడ్లు పోసి సంవత్సరం పాటు అట్టి పెడతారు. గాడి పొయ్యిల్ని ఆడబిడ్డలు, అల్లుళ్లు పూడ్చుతారు. గాడి పొయ్యిలమీద ఉన్న కూరాడుకుండల్ని తీసి అందులోని నీళ్లు పారబోసి బోర్లా పెడతారు. గాడి పొయ్యిలలో పెరుగన్నం వేసి పూడ్చేస్తారు. ఒడిబియ్యంతో బోనం వండి పోచమ్మ దేవతకు పెట్టుకొంటారు. సర్వలో ఒడి బియ్యం పసుపు వేసి బోనం వండుతారు. ఆ బోనాన్ని కొత్తకోడలు పోచమ్మ గుడి వద్దకు తీసుకపోతుంది. బోనంలోని కొంత అన్నాన్ని మోదుగ ఆకులలో ప్రసాదంగా పోచమ్మ ముందు పెట్టి నైవేద్యం ఇస్తారు. మిగిలిన బోనాన్ని ఇంటిల్లపాదీ ప్రసాదంగా తింటారు. పెండ్లిలో ఆడబిడ్డకు ప్రత్యేకమైన పాత్ర ఉంది కనుక ఆడబిడ్డ కట్నానికి కూడా ప్రాధాన్యత ఉంది.

[1]ఆరెవారికిలాగే ప్రతి కులంలోనూ పెండ్లి తంతులో వైవిధ్యం కనబడుతుంది.

పాటలు, కథాగేయాల్లో 'పెండ్లి పాటలు'కి ఒక ప్రత్యేక స్థానం ఉంది. వియ్యము (అన్నతో వియ్యమందాలి. కంటే కొడుకుని కనాలి, ఆడితే వదినతో జగడమాడాలి, కలిగినవారు పేదవారు వియ్యమందితే అరచేతి బెల్లము చిరుచేదులాయె - మిన్నేరు, పు. 98), పెండ్లి చూపులు, నలుగుపాట, తలంటు పాటలు, తిలకము తీర్చడం, తలంబ్రాల బియ్యం దంచే పాటలు (పైదే, పు. 101), పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను అలంకరించడం, మంగళసూత్రం (పు. 104 - 105), గంధం పూయడం, పెండ్లి కుమారుని పొగడడం, విందులు, తాంబూలం పాటలు, సొగటాలుపాట, పన్నీరు, పూలచెండ్లు పాటలు, నాగవల్లి, పెండ్లి కొడుకు హాస్యం

---

మరిన్ని వివరాలకు జానపద విజ్ఞాన దర్శిని సంపుటాలు చూడండి.

(పిల్లి కళ్ల పెండ్లి కొడుకు, తిమురు పట్టిన పెండ్లి కొడుకు) గోటు పెండ్లి కొడుకు, బావగారి పరిహాసము, మరది హేళన, వదినెపాటలు, పెళ్లికూతురి చిన్నెలు, తలుపు దగ్గరిపాట, అన్నాచెల్లెలు సంవాదం, మరదలు వదిన సరసం (పు. 130 - 135), వియ్యాలవారు, వియ్యపురాలు, బావల హాస్యం, పాన్పు, పవ్వళింపు, శోభనం లాంటి సందర్భాలలో పాడే పాటలుగా నేదునూరి గంగాధరం గారు గుర్తించినారు. వీటిలో చాలా వాటికి అవి ఏ రాగంలో, ఏ తాళంలో పాడాలో కూడా ఉంది. పారిజాతముల పాన్పు (మిన్నేరు, 139) పాటలో సరిగమల ఆరోహణ అవరోహణ కేదారగౌళ రాగం, ఆది తాళానికి ఎలా ఉండాలో కూడా వివరించబడి వుంది. అలాగే పవ్వళింపు (మిన్నేరు, 139 - 140) కూడా. శోభనం తర్వాత వసంతం, కంత (పెండ్లయిన అయిదవనాడు పెండ్లికుమారుని వైపు వారికి తలంటడం కోసం సామగ్రి తెచ్చేటపుడు వచ్చే తగవులకి సంబంధించిన పాట) శ్రీరాగం, ఆదితాళంలో పాడాలన్న నిర్దేశం ఉంది (మిన్నేరు, 144 - 145). అప్పగింతలు (మిన్నేరు, 145), మంగళారతులు (శహన రాగం, మిశ్రతాళం, మిన్నేరు, 150), మంగళంలో పాడే పాటలన్నీ కూడా శహన రాగం - మిశ్రతాళం, మోహనరాగం - మిశ్రతాళం, ఆరభి - ఆదితాళం, శంకరాభరణం - మిశ్రతాళం, ఆనందభైరవి - మిశ్రతాళం, రీతిగౌళ - మిశ్రతాళం, జింగ్లా - ఆదితాళం అని వాటి రాగాలూ, తాళాలూ నిర్దేశించబడి ఉన్నాయి. ఈ పాటల్ని సంగీత పరిజ్ఞానమున్నవారు రాసి జన బాహుళ్యంలోకి వదిలిన పాటలుగానే గుర్తించాల్సి ఉంది. సంగీత పరిజ్ఞానమున్న [1]గాయకులు కొందరు జానపద పాటల్లో రాగాలూ, రాగచ్ఛాయలు ఉన్నాయని నిర్ధారించారు. కొన్ని పాటలకు రాగ నిర్దేశం చేసినారు. ముందు తరం వారు సేకరించిన పాటల్లో కూడా రాగ - తాళ నిర్దేశం ఉంది. ఇలాంటి పాటలు ప్రత్యేకంగా రాసి ప్రచారంలోకి తెచ్చినారు అన్న విషయం, ఆయా పాటలు రాసినవారి పేర్లు ఆ పాటల్లో ఉండడం వల్ల తెలుస్తుంది. ఇలాంటి పాటలకి రాగ - తాళ నిర్దేశం ఉన్నట్టు సంకలనాలలో ఉంది. అయితే ఈ బాణీల్ని రచయితలే నిర్దేశించారా లేక గాయకులు ఏర్పర్చుకొన్నారా అన్న విషయం తెలియడం లేదు.

1) వింజమూరి అనసూయ, వింజమూరి సీతాదేవి

ప్రతి పాట వెనుక ఒక సందర్భం ఉంటుంది. ఆ సందర్భంలో చేసే పనికి పాడే పాట గుక్కకు సంబంధం ఉంటుంది. అంటే ఒకే పాట వివిధ సందర్భాలలో చేసే పనిని బట్టి తన బాణీని మార్చుకొంటుంది. అపుడు ఇలాంటి రాగ – తాళ నిర్దేశం ఎంత వరకు వీలవుతుందో చూడాల్సి ఉంది. లాలి పాటలకు రాగనిర్దేశం ఉన్నట్టు చెప్తున్నా నిజంగా ఏడుస్తున్న బిడ్డను లాలించేటపుడు మాత్రం అది వీలవుతుందని చెప్పలేము. ఏడ్చే బిడ్డని తల్లి మండీకాలు వేసుకొని ఒడిలో పెట్టుకొని, మండీకాలు ఆడిస్తూ పాట పాడుతూ జోకొట్టుతుంది. మధ్యమధ్యలో బిడ్డ గుక్కపట్టి ఏడుస్తున్నప్పుడు పాట ఆపి ఓ... లాలి అంటూ ఓదార్చుతుంది. పాటలో తల్లి తన పుట్టింటిని గురించి, బిడ్డ మేనమామల్ని గురించి, వారి వైభవాన్ని గురించి, సౌభాగ్యాన్ని గురించి వివరిస్తుంది. ఇలాంటి సందర్భాలలో పాటలకు 'నిర్దిష్ట బాణీ' వీలవుతుందా అన్నది చూడాలి.

## ఆటలు

[1]పిల్లల వయస్సుకు తగ్గ వ్యాయామాన్ని ఇచ్చే ఆటలు పుష్కలంగా ఉన్నాయి. ఆడ, మగ కల్సి ఆడే ఆటలు, విడివిడిగా ఆడే ఆటలు ఉన్నాయి. శారీరక వ్యాయామంతోపాటు మానసిక ఎదుగుదలకు ప్రోద్బలం ఇచ్చే ఆటలు ఉన్నాయి. పెద్దవాళ్లు ఇంట్లో చేస్తున్న పెండ్లిండ్లు, పండగలు లాంటి వాటిని అనుకరించి ఆడే ఆటలు ఉన్నాయి. ఆటలు పాటలు కలగల్సిపోయిన ఆటలు ఉన్నాయి. ప్రత్యేక పదాల్ని లేదా శబ్దాల్ని తమ సొంతం చేసుకొన్న ఆటలు ఉన్నాయి. అందుకే ఆటపాటలన్నారు. ఎదుటి వ్యక్తి కన్నా తానే బలవంతుడని నిరూపించుకొనే మగ పిల్లల ఆటలున్నాయి. ఇద్దరం బతకాలి కాకపోతే నాకు కొంచెం ఎక్కువ అన్న ధ్యేయంతో ఉన్న ఆడపిల్లల ఆటలున్నాయి. ప్రకృతి గత చెట్లు చేమల్ని, పచ్చిక బయళ్లని, రాయిరప్పల్ని, పుల్ల పుడకల్ని, పండ్లు కాయల్ని, ఆకు అలుముల్ని, ఎండ వానల్ని, గుంట మిట్టల్ని ఆధారంగా చేసుకొని ఆడే ఆటలు ఉన్నాయి. రాజు రాణి, అమ్మానాన్న, తల్లీ పిల్లలు, పులి మేకల్ని అనుకరించే ఆటలు ఉన్నాయి. వరంగల్లు,

1. వివరాలకు చూడుము తూర్పుగోదావరి జిల్లా ఆటలు, జానపద విజ్ఞాన దర్శిని సంపుటాలు.

తూర్పు గోదావరి జిల్లాల్లో రెండేసి వందలకు పైగా ఆటల్ని సేకరించగలిగినాం. మిగతా జిల్లాల్లో కూడా సేకరిస్తే ఈ సంఖ్య అపరిమితంగా పెరగవచ్చు.

వరంగల్లు జిల్లా అటవీ ప్రాంతంలో గుట్టలు ఎక్కి పుల్లల్ని ఏరుక రావడం, ఫలసాయాన్ని తెచ్చుకోవడం పరిపాటి. గుట్టలు ఎక్కడానికి పిక్కబలం ఉండాలి. పిక్కబలాన్ని పెంచే పూంబుస్ ఆటని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బొమ్మల పెండ్లిండ్లు సాక్షాత్తు పెళ్లిని అనుకరించేవే. పిల్లని చూడడానికి పోవడం, పిల్లకు ఏమిస్తారని అడగడం, పెండ్లి తంతు, విందు జరిపించడం లాంటి సన్నివేశాలతో ఉన్న ఈ ఆటలు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉండేవి. సాహిత్యంలో కూడా వీటి ప్రస్తావన ఉంది. ఈ ఆట వెన్నెలలో ఆడుకొనేవారు.

చిట్టీ మీరేమిటి వారే చిట్టీక్కామీరేమటివారే
పూర్ణీ మీరేమటివారే తామరమొగ్గల్లా

* * * * *

గుజగుజ రేకుల పిల్లుందా గుజ్జారేకుల పిల్లుందా
స్వామి దండల పిల్లుందా సహరాజులు మెచ్చే పిల్లుందా
గుజగుజరేకుల పిల్లుందీ గుజ్జారేకుల పిల్లుందీ
స్వామి దండల పిల్లుంది సహరాజులు మెచ్చే పిల్లుంది

చిన్న పిల్లలు రెండు జట్లుగా చేరి పిల్ల ఉందా అని ఆరా తీయడం, ఉందీ అంటే ఏం సొమ్ములు పెడతారనడం, వారు పెట్టే సొమ్ములు చాలవనడం, చీనాంబరాలు, జలతారు రవికలు, పసుపు, పండ్లు తెచ్చినాం, పెండ్లికి వచ్చినాం అలా సాగిపోయే ఆట అచ్చం సమాజానికి ప్రతిబింబమే. ఇలాంటి పాటలు చాలా కనబడుతున్నాయి.

[1]సిరిసిరి బంతీ, సిలాయిబంతీ, లక్కాబంతీ, లాలిబంతీ
పువ్వు మీరేమిట్లో, జాజీ మీరేమిట్లో జావా రేకులేమిట్లో తామర సిరిమొగ్గా
సిరిసిరి బంతీ, సిలాయిబంతీ, లక్కాబంతీ, లాలిబంతీ
పువ్వేమి రాజులం, జావారేకుల రాజులం తామర సిరి మొగ్గా
[2]పిల్లాకు ఏం సొమ్మో డీలమ్మ డీలీ

1. ఉపాధ్యాయుల సుబ్రమణ్యేశ్వర శర్మ, పా. 94 2. మన పల్లెటూళ్లపాటలు – అమ్మాపురం, పా. 25

పిల్లాకు మట్టాలో డీలమ్మడీలీ

మెచ్చం మెచ్చామో డీలమ్మడీలీ

మెచ్చకుంటే నీ మనుసో డీలమ్మ డీలీ

మాయాంక గిరి ధంసనగిరి మాయాకమైమైలో బాబూ మాయాక మైమైలోబాబు

మాయాకగీరి ధంసన గిరి మాయాక మైమైలో బాబూ మాయకమైమైలో

అన్న పాటల్లో 'గుక్కపట్టి పాడడం' ఉంది. పాదం మొత్తం ఒకే గుక్కతో పాడడం ధ్వనుల ఉచ్చారణ మీద పట్టు కలిగించడానికేనేమో అని అన్పిస్తుంది.

చిన్ని చిన్ని పిల్లుంది, సింగల్ గౌరీ పిల్లుంది

తాడి మేడి పిల్లుంది, తమరాగిరి మొగ్గలు

చిన్ని చిన్ని పిల్లోడున్నాడు, సింగల్ గౌరి పిల్లోడున్నాడు

తాడిమేడి పిల్లోడున్నాడు, తమరాగిరి మొగ్గలు

ఇంకా ఈ ఆటల్లో పెండ్లయిన తర్వాత సారె పెట్టి అత్తగారింటికి పంపడం లాంటి ఎన్నో కార్యక్రమాల అనుకరణ చూడగలం.

## దేవతలు - పండుగలు - ఉత్సవాలు

పండగలంటేనే ఇంట్లో సందడి. కొత్త బట్టలు, కొంగొత్త రుచుల వంటకాలు, దేవతల ఆవాహనలు, నైవేద్యాలు ఒక పక్క ఇంటి అలంకరణ మరోపక్క కన్నుల పండువగా ఉంటుంది.

పండుగలు వచ్చే కాలాన్ని బట్టి వంటలలో, వైవిధ్యం ఉంటుంది. కొన్ని వంటలు ఆయా పండగలకి ప్రత్యేకం. కొన్ని పత్రులు తప్పనిసరి. పంటకు సంబంధించి, వృత్తులకు జీవితచక్రసంబరాలకు, ఇంటికి సంబంధించి, ఇలవేల్పులకు సంబంధించి, కులదేవతలకు, గ్రామదేవతలకు సంబంధించి పండుగలు, ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. ఆయా సందర్భాలలో ప్రత్యేకంగా కొలుచుకొనే దేవతలు ఉన్నారు.

ఈ పండగలలో ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించే అంశాల్ని దృష్టిలో పెట్టుకొంటే అవి సమాజం ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవలసిన ముందు జాగ్రత్తల్ని చూపించే కార్యక్రమాలుగా అర్థం చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

# ఇల్లు జానపద విజ్ఞానానికి కాణాచి

ఇల్లు జానపద విజ్ఞానానికి కాణాచి. ఇల్లు పరిశుభ్రంగా ఉంటే అందులో నివసించే వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటారు. అలంకరణ ఒక కళ. ఒక అవసరం. ఒక నిషిద్ధం. చిత్ర కళా నైపుణ్యాన్ని పుణికి పుచ్చుకొన్నట్టుగా రంగవల్లుల హొయలు. ప్రతి ముగ్గు వెనుక ఒక నేపథ్యం ఉంది. సందర్భం ఉంది. వ్యక్తులున్నారు. చుక్కల ముగ్గు సాంస్కృతిక వారసత్వాన్ని మోసుకొస్తుంది. వంట ఇల్లు, పడమటి ఇల్లు, తూర్పు ఇల్లు ఆచారాలకి దేనికదే ప్రత్యేకత కల్గి ఉన్నాయి. పడమటి ఇంట్లోని అనుష్ఠానాలకి, ఆచారాలకి, తూర్పు ఇంటిలో జరిగే ఉత్సవ వేడుకలకి తేడా ఉంటుంది. పేరంటాలుకి పడమట ఇల్లు. బిడ్డల తల్లికి తూర్పు ఇల్లు, ఆషాడ శుద్ధ ఏకాదశి పెద్దేకాశి అని, తొలి ఏకాదశి అని అంటారు. ఆ రోజు అన్ని పండగలలో లాగానే ఇంటిని అలంకరించుకొని, ఇంటిల్లిపాది తలంటుస్నానాలు చేసి ఉపవాసం ఉంటారు. పిండి వంటలు, సర్వ పిండి, గారెలు, ఉప్పిండి ఉంటాయి. కాని ప్రత్యేకంగా బియ్యం పిండితో ఉప్పు లేకుండా చప్పిడి వంట చేసి నైవేద్యం పెట్టడం పరిపాటి. తమిళనాడులో కూడా ఆడిమాసానికి ప్రత్యేకత ఉంది. ఆ మాసంలో చేసే 'అవ్వైయారునోంబు'లో కూడా ఉప్పు లేకుండా కుడుములు చేసి ముత్తయిదువులకు పంచి పెడతారు. రెండు ప్రాంతాలలోనూ కోడలు 'అత్త మొగం చూడరాదన్న' ఆంక్ష ఉంది. కేరళలో కూడా 'కర్కాటకమాసం'ని రామాయణ మాసంగా గుర్తించి శుచి శుభ్రత పాటిస్తారు. ధనుర్మాసం – మార్గళిమాసం మూడు రాష్ట్రాలలోనూ పవిత్ర మాసమే. ధనుర్మాసం చివరి రోజున పెద్దలకు పెట్టుకొంటారు.

ఆషాఢమాసం, ధనుర్మాసాలు రెండూ దంపతులు కలవడానికి పనికి వచ్చే మాసాలు కావని నమ్మకం. అందుకే ఈ నెలల్లో తిండి, అలంకరణ, నైవేద్యం, సామెతలు, పాటలు ఏవి చూసినా ఆ నమ్మకాన్ని ప్రచారం చేస్తున్నట్టుగానే కనబడుతున్నాయి.

ఇల్లు వైవిధ్య భరితం. ఒకసారి ఉత్సవాలతో, పండుగ పబ్బాలతో వేడుకలు నింపుకొని కళకళలాడుతూ 'సంబరాల పుట్టిల్లు'గా దర్శనమిస్తుంది. మరోసారి

చిన్నారులకు జోలపాడుతూ, లాలి పాడుతూ, అమ్మమ్మల నాన్నమ్మల కథలతో, పెండ్లి పేరంటాలలో ముత్తయిదువుల కమ్మని గాన మాధుర్యం వీనులవిందు చేస్తూ 'సంగీతపుటిల్లు'గా రూపాంతరం చెందుతుంది. పిల్లల కేరింతలతో, ఆటలతోపాటు చిన్నాపెద్దా తీరిక వేళల్లో, తీరిక కల్పించుకొన్న వేళల్లో శారీరక శ్రమని మానసిక గ్లానిని పోగొట్టే 'సేదతీర్పు ఇల్లు'గా మారుతుంది. చిన్నాపెద్దలకి, భవిష్యత్తులో రాబోయే రాగలిగే ఎన్నో రోగాల చికిత్స ఇంటిలోనే ప్రారంభమవుతుంది. బిడ్డలకు 'వస' పోసిన నాటి నుంచి పెరిగి పెద్దయ్యే దాకా ఏదో విధంగా వైద్య చిట్కాలు అనుభవంలోకి వస్తూనే ఉంటాయి. వంటిల్లే ఒక ఔషధాలయం. ఆచారాలు, అనుష్ఠానాల నెపంతో ఆయా కాలాలకనుగుణంగా ఆహారాన్ని వండి అందించే 'ఆరోగ్యపుటిల్లు' పాత్ర పోషిస్తుంది.

## జానపద కళారూపాలు

జానపద విజ్ఞానంలోని మిగతా ప్రక్రియలలాగే జానపద కళారూపాల్ని కూడా నిర్దిష్టంగా వర్గీకరించడానికి వీలుపడదు. మారుతున్న సమాజ నేపథ్యం వాటికి ప్రాతిపదిక కనుక అవి కూడా మారే స్వభావం కల్గి ఉంటాయి. మారే స్వభావం ఉన్నవాటిని శాస్త్రీయ వర్గీకరణ - Categorisation - పేరుతో ఒకే వర్గం కింద వర్గీకరించడానికి వీలులేదు. అలాగే భిన్న అంశాల సమాహారమే కళారూపం కనుక అందులోని ఏదో ఒక అంశం కింద వాటిని వర్గీకరించడం వల్ల దాని 'సంపూర్ణత'ని అది చూపించలేదు. అందుకనే జానపద కళారూపాల వర్గీకరణ 'గ్రంథాలయసూచి' (Labelisation) మాత్రమే. అది జరిగే అధ్యయన వైవిధ్యాన్ని బట్టి మారుతుంది.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలుగునాట ప్రచారంలో ఉన్న జానపద కళారూపాల్ని స్థూలంగా కథాగాన సంప్రదాయం, భజన సంప్రదాయం, వాద్య సంప్రదాయం, నాటక సంప్రదాయం, నృత్య సంప్రదాయం, ఇంద్రజాల సంప్రదాయం, సామువిద్య సంప్రదాయం, అనుకరణ సంప్రదాయం, పశుపక్షి ప్రమేయ సంప్రదాయం, అనుష్ఠాన నేపథ్య సంప్రదాయం అని ప్రస్తుతానికి వర్గీకరించుకోవచ్చు.

ప్రతి జానపద కళారూపానికి నిర్దిష్టమయిన బాణీ, 'కథ', వాద్యం, కళాకారుడు, ప్రేక్షకుడుతోపాటు నేపథ్యం, ప్రమేయం, వనరులు ఉంటాయి. వీటి సమైక్య సమగ్ర రూపమే కళారూపం అవుతుంది.

**కథాగాన సంప్రదాయం :** కథల్ని చెప్పడమే ప్రధానంగా ఉన్న కళారూపాలు ఇవి. ఈ కళారూపాలు కొన్ని అవి చెప్పే కళాకారుల కులం, ప్రధానంగా వాడే వాద్యం పేరు మీద, వారు ఉపయోగించుకొనే పటం, ప్రదర్శన ఆధారంగా ప్రచారంలో ఉన్నాయి.

గొల్లవారి మందలు హెచ్చు అవ్వాలని కొలుపులు, గావు, బలి నిర్వహిస్తూ కథలు చెప్తూ ఉన్న 'మందెచ్చు' వారి కథలు 'లేదా' 'మందెచ్చుల కథలు', కంసుని కథ ద్వారా తమ కులపురాణాన్ని వినిపిస్తున్న "బైకాని కథలు", ఆది శక్తికి కొలుపులు నిర్వహిస్తూ బైండ్లవారు చెప్పే "బైండ్ల కథలు", మందగొల్లలు కనకడప్పు, జగ్గు వాద్యాల సహకారంతో చెప్పే "గొల్ల కథలు", ఒకనాటి శైవమత ప్రచారం కోసం వెలసి, నేడు తంబుర మీటుతూ జంగంవారు చెప్పే "జంగం కథలు", బీరప్పలవారు చెప్పే 'బీరప్ప కథలు', పొడలు కల్గిన పోతుని దేవుని కర్పించి, డోలు, నపేరా సహాయంతో పొడపోతులవారు చెప్పే 'పొడపోత్రపు కథలు', రెడ్లపురాణాన్ని ప్రధానంగా చెప్పే పిచ్చుకగుంట్ల వారి "పిచ్చుగుంట్ల కథలు", చామల్లాలి డోలు విన్యాసాలతో, రాజేశుని తలమీద పెట్టుకొని యాచన చేసే రాజన్నలవారి "రాజన్నల కథలు", ఆసాదులవారు జమిటిక వాయిస్తూ చెప్పే "ఆసాదుల కథలు", నులక చందయ్యల పురాణ పఠనాలు, రబాబ్ వాయిస్తూ లంబాడీల వంశ చరిత్రలని లవుడియా తెగకి చెందిన భట్టులు చెప్పే 'భట్టు కథలు', అలాగే "దాడి కథలు", పర్ధాన్‌లు చెప్పే 'గోండు పురాణం' లాంటి కథలు అవి చెప్పే కులాల పేరు మీదనే చలామణిలో ఉన్నాయి.

నాలుగు, నాలుగున్నర అడుగుల రుంజవాద్యాన్ని వాయిస్తూ, విశ్వ బ్రాహ్మణుల గోత్రాన్ని, వంశనామావళిని పొగడి, కులపురాణాన్ని చెప్పే "రుంజ కథలు", జముకు / జమిటిక వాయిస్తూ శ్రీకాకుళం ప్రాంతంలో బోనేలపాటలుగా ప్రచారంలో ఉన్న

"జముకుల కథలు" ఒగ్గు లేదా జగ్గు వాయిస్తూ ఒగ్గువాళ్లు చెప్పే "ఒగ్గు కథలు", పంబజోడు వాయిస్తూ పంబాలవారు చెప్పే "పంబాల కథలు", దుబ్బు వాద్యాన్ని వాయిస్తూ 'కనకదుర్గమ్మ' కథలు చెప్పే "దుబ్బుల కథలు", బుర్ర, గుమ్మెట్లు వాయిస్తూ చెప్పే "బుర్రకథలు", ఇంకా కంజీర కథలు, కనకదప్పు పాటలు లాంటివి చర్మవాద్యాన్ని ఆసరాగా చేసుకొని ఆపేరుతో చలామణిలో ఉన్న "కథాగాన సంప్రదాయం" కోవలోనివి. 'శారద' మీటుతూ 'శారద కథల్ని', తంబూర మీటుతూ "తంబూర కథల్ని" ఒకనాడు పన్నెండు మెట్ల కిన్నెర, ఏడుమెట్ల కిన్నెరలు వాయిస్తూ చెప్పిన "కిన్నెర కథల్ని" కొమ్ము ఊదుతూ "కొమ్ము‌వాళ్లు" చెప్పే "కొమ్ము కథల్ని" ఇక్కడ ప్రస్తావించుకోవాలి. ఇవి అక్కడవాడే ప్రధాన వాద్యం పేరుతో చలామణిలోఉన్నాయి.

'పటం'లోని బొమ్మల్ని చూపిస్తూ కథ చెప్పే సంప్రదాయం తెలంగాణాలో ఉంది. వీరందరు కూడా తమకు ఆశ్రయం కల్పిస్తున్న వారి 'కులపురాణాల్ని' చెప్తారు. ఇవి అన్నీ కూడా ఆయా కులాల పేరుతో చలామణిలో ఉన్నాయి. మాదిగల ఆశ్రితకులం దక్కలి వారు చెప్పే "దక్కలిపటం కథలు", శివకంఠమాలల ఆశ్రితులు గుర్రపు వాళ్ళు చెప్పే పటం కథలు, రజకపురాణం చెప్పే "మాసయ్యల పటం కథలు", నాయీ బ్రాహ్మణుల వారి దగ్గర 'త్యాగం' తీసుకొంటూ, చెప్పే "అద్దపు సింగుల పటం కథలు", పద్మశాలీల ఆశ్రితకులం కూనపులి వారి పటం కథలు, గౌడుల ఆశ్రితకులం గౌడజెట్టీల పటం కథలు, గౌడులకే ఆశ్రితులయిన మరో కులం 'ఏనోట్టి' వారి పటం కథలు, ముదిరాజ్ / ముత్రాసి వారి ఆశ్రితకులం కాకిపడిగెలవారు చెప్పే పటం కథలు, నాయకపోడు ఆశ్రితకులం కొర్రాజులవారు చెప్పే "పటం కథలు" నాయకపోడు గిరిజనుల మరో ఆశ్రిత కులం పూజరివారు చెప్పే పటం కథలు ఇక్కడ ప్రధానంగా తీసుకోవాలి.

ఈ కుల పురాణాలలో దక్కలివారు మాదిగకుల ఆవిర్భావం, ఇతర కులాల ఆవిర్భావం గురించి అయిదు పురాణాల్ని చెప్తారు. అవి ఆది పురాణం లేదా శక్తి పురాణం, జాంబ పురాణం, కామధేను పురాణం, అరుంధతీ కళ్యాణం, బలభద్ర విజయం. గుర్రపువాళ్లు 'బసవ పురాణం, శక్తిపురాణం, భేతాళుని కథ, కరమాల

రాజు' కథలు చెప్తారు. మాసయ్యలు శక్తిపురాణం లేదా మూలస్తంభపురాణం లేదా ఆదిపురాణాలుగా మొదటి రోజు కథని చెప్తారు. తర్వాత రెండు రోజులు పార్వతీ కళ్యాణం, వీరభద్ర విజయం లేదా దక్షయజ్ఞం కథలు చెప్పి చివరగా 'మదేలయ్య కథ' లేదా 'రజక పురాణం' చెప్తారు. అద్దపు సింగులు 'శక్తి పురాణం' / మూలస్తంభ కథ, నాభికాపురాణం, దక్షయజ్ఞం కథలు చెప్పి చివరి రోజు 'ఆది శక్తి'కి పండగ చేస్తారు. కూనపులి వారు పటం సహాయంతో 'మార్కండేయ పురాణం' చెప్తారు. గౌడజెట్టీలు, ఏనోట్టివారు పటం సహాయంతో 'గౌడ పురాణం' చెప్తారు. చివరి అంకంలోని 'సురమాంబ' కళ్యాణాన్ని మాత్రం వేషాలు వేసుకొని నాటక ఫక్కీలో ప్రదర్శిస్తారు. వీరు కులపురాణం తర్వాత సత్యహరిశ్చంద్ర, లవకుశ, గయోపాఖ్యానం, భక్తప్రహ్లాద, భద్రసేన, శశిరేఖా పరిణయం, చంద్రహాస, చంద్రకళ, కాంతామతి, సతీసావిత్రి, భక్తపుండరీక, ధర్మాంగద చరిత్ర, మార్కండేయ చరిత్ర లాంటి నాటకాల్ని కూడా ప్రదర్శిస్తున్నారు. 'దుగ్గన్నబోయడు' పెందోటవనానికి కావలి ఉన్నప్పుడు అవుసలి బ్రహ్మ సృష్టించిన కాకి ఆ వనాన్ని పాడుచేస్తుంది. దాన్ని చంపి తన చేతిలో పట్టుకొని ఇంటికి వస్తాడు. దాన్ని చూసిన అతని తల్లి సూర్యమాదేవి "యదువంశమందున పుట్టి కంసాలివానితో కయ్యంబులాడి కాకిని చంపుట పాడిగాదు. కావున కాకిని చంపినందున నీవు కాకిపడిగెలవానిపై కలియుగమందున ముదిరాజ్ వాళ్లకు అడ్డివానివై జీవించు "అని శాపమిస్తుంది. "మనకు పాండవులంటే ఇష్టంకదా! వాళ్లకు సంబంధించిన వృత్తాంతం చెప్తూ" త్యాగం తీసుకొని బ్రతకమంటుంది. ఆ విధంగా కాకిపడిగెల కులోత్పత్తి కథను చెప్పి, మహాభారత కథల్ని చెప్తారు కాకిపడిగెలవారు. వీరి మహాభారత కథలలో శిష్టభారతానికి సమాంతరంగా ఉన్న కథలు రంభరంపాల, లక్కాగృహం, గారముళ్లకోట, నవలోకపెళ్లి, కర్ముని పెళ్లి, భీముని విషపన్నం కథలు.

కొ(రాజులు పద్మనాయక వృత్తాంతాన్ని చెప్తారు. పద్మ నాయకుల 'లక్ష్మీదేవర' – లక్ష్మీదేవతకు సంబంధించిన కథ కర్ణుని పెళ్లిలో వస్తుంది. పద్మనాయక వృత్తాంతంలో పద్మనాయకుల, కొ(రాజుల కులోత్పత్తిని గురించి వివరంగా చెప్తారు.

పద్మనాయకులని ఆశ్రయించిన మరో కులం పూజరి. మాతంగ మునీశ్వరుడు పద్మగంధి దంపతులకు పుట్టిన అయిదుగురిలో భీముడు ఒకడు. ఒకరోజు వారు కోలాటం ఆడుతుండగా అమ్మ పిలుస్తుంది. భీముడు తప్ప మిగతావారు వెళ్తారు. అమ్మ కోపించి పిల్చినా రాకుండా కోలాటం ఆడుతున్నావు కాబట్టి 'కోలగాని'వై పొమ్ము అని శపిస్తుంది. బతుకు తెరువు కోసం భారత కథలు చెప్తూ బతకమంటుంది. ఆ కోలగాని వారినే 'పూజరి' అని కూడా వరంగల్లు ప్రాంతంలో అంటారు. కొర్రాజులు, కాకిపడిగెలు, పూజరి – ముగ్గురు కూడా ప్రధానంగా పాండవుల కథల్నే చెప్తున్నారు.

తమకు కట్టడి లేదా హక్కు ఉన్న గ్రామాలకు నిర్దిష్ట సమయంలో వెళ్లి ఆయా కులాలవారికి 'కులపురాణాల్ని' చెప్పడం, ఆశ్రయం ఇచ్చిన కులాలు సుఖసంతోషాలతో, సంపద ఐశ్వర్యాలతో తులతూగాలని కోరుకుంటూ కొలుపులు చేయడం, గావుపట్టడం, బలి తిరగడం చేస్తారు. ఈ సందర్భాలలో డక్కలివారు 'భేతాళునిపూజ; గుర్రపువాళు అద్దపుసింగులు 'ఆది శక్తిపూజ', కూనపులివారు 'మార్కండేయ పూజ', గౌడ జెట్టీలు 'ఎల్లమ్మ పండగ', ఏనోట్టివారు 'కాటమయ్య పండగ', మాసయ్యలు 'ఈదమ్మపండగ', కాకిపడిగెలవారు 'పెద్దమ్మ పండగ', కొర్రాజులు, పూజరి వాళ్లు 'లక్ష్మీదేవర' పండగ చేస్తారు. డక్కలివారు కథలు చెప్పడానికి ముందు భేతాళ పూజ చేసి బలి తిరుగుతారు. మిగతా వారందరూ కథల చివరి రోజున పండగ చేసి బలి తిరుగుతారు. బలి తిరగడంతో కథలు చెప్పడం పూర్తవుతుంది.

ఏ దేవుని మీద అయితే పండగ జరుగుతుందో ఆ దేవుడు లేదా దేవత కనబడేటట్టు పటాన్ని పెడతారు. ప్రతి ఒక్కరు కూడా గౌడ కులపెద్ద ఇంటి నుంచి ఘటం కుండ – కల్లుకుండని మేళతాళాలతో తీసుకువస్తారు. కులపెద్దకి ప్రాధాన్యత ఉంటుంది. కులపెద్ద భార్య ప్రధాన బోనంని నియమ నిష్ఠలతో వండుకొని ముందు నడుస్తుండగా ఆయా కులాలకు సంబంధించిన ఇండ్ల నుంచి ఆ ఇంటిపెద్ద భార్య బోనంతో అనుసరిస్తారు. ఆ బోనాల్ని పటంలోని దేవత ముందు పెట్టి కొంత తీసి పదులుగా ఆరపోస్తారు. మాసయ్యలు మడేలయ్య పటం ముందు పోలుగీసి దానిమీద అడ్డంగా కర్ర పరిచి మడేలయ్య సీతలదేవి / సీత్లాభవాని పెండ్లి ఘట్టాన్ని జరిపిస్తారు.

తర్వాత ఈదమ్మ బొమ్మ ఉండేటట్టు పటాన్ని జరిపి బలి కార్యక్రమం నిర్వహిస్తారు. అద్దపువాళ్లు ఆదిశక్తి బొమ్మ కనబడేటట్టు పటం జరుపుతారు. తాత మనుమరాలు వరస ఉన్న వారిని, ఆదిశక్తి ముందు లగ్నపోలు పోసి దానిమీద కూర్చోపెడతారు. మంగలివారి ఇంటి నుంచి ఆడవారు బోనాలు, మగవారు కలప లేదా అడపం తెచ్చి రెండు వరుసలుగా ఆదిశక్తి ముందు పెడతారు. లగ్నపోలు మధ్యలో ఉన్న కాడికి కంకణాలు కడతారు. బోనాలనుంచి కొంత తీసి పడులు ఆరపోస్తారు. గౌడజెట్టీలు జరిపించే ఎల్లమ్మ పండగనాడు పెద్ద గౌడు తన ఇంటి నుంచి ఘటం కుండను ఎల్లమ్మ గుడి దగ్గరకు తెస్తాడు. పెద్దగౌడు భార్య పరమాన్నం బోనం, మిగతావారు బోనం వండి ఎల్లమ్మ గుడి దగ్గరకు తెచ్చి ఘటం కుండని ఎల్లమ్మ విగ్రహం ముందు, పరమాన్నం బోనాన్ని కంఠమహేశ్వరుని ముందు, ఇతరుల బోనాల్ని, ఎల్లమ్మ గుడిలో పెడతారు. పండగరోజు కంఠ మహేశ్వరుడు చలమాంబ కథని చెప్తారు. ఆ సమయంలో పెళ్లి తంతు ప్రత్యక్షంగా జరిపిస్తారు. తాటిచెట్టు నుంచి ఒకరికొకరు అందించుకొంటూ తెచ్చిన కల్లు, సాక, గౌడులు ఉపయోగించే మోకు, ముస్తాదులకు చేసే 'మోకులమ్మ' పూజ ప్రధానంగా ఉంటుంది. ఇంటి దగ్గరనుంచి తెచ్చిన బోనాలులో కొంత తీసి పడులు ఆరబోసినాక బలిచల్లడం ఉంటుంది. ఆయా కళాకారులు నిర్వహించే పండగలలో ఇదే చివరి ఘట్టం. బలికూడు వండి, బలికూడు ఉన్న చేటలో యాట రక్తాన్ని పట్టి, కల్పి ఆ బలికూడుని తమకు ఆశ్రయం ఇస్తున్న కులాల వారి ఇండ్లమీద, దొడ్లమీద, వ్యవసాయ భూముల మీద బలిచల్లుతారు. బలి చల్లడం వల్ల తాము చల్లగా ఉంటామన్న నమ్మకం ఆశ్రయం ఇచ్చే వారికి ఆశ్రయం పొందే వారికి ఉన్నందువల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ పండగ వారిరువురిని, వారిరువురి మధ్య ఉన్న అన్యోన్య సంబంధాన్ని పెంపొందిస్తుంది. తర్వాత తమకు మిరాశి హక్కుగా 'త్యాగం' కింద రావలసిన ధన, ధాన్యాల్ని, ఇతర వస్తువుల్ని స్వీకరించి వెళ్లడం ఈ కళాకారుల సంప్రదాయం. అలాగే కులం పేరుతో చలామణిలో ఉన్నా కూడా ఆయా గ్రామాలకి వెళ్లి కులపట్టింపులు లేకుండా అందరికీ ఆయా దేవతల పేరుమీద కొలుపులు చేయడం, గావుపట్టడం,

బలి తిరగడం కొంతమంది చేస్తే మరికొంతమంది వారికి ఆశ్రయం ఇచ్చిన కులాల వారికే చేస్తారు.

కథాగాన సంప్రదాయాలలో ఇంకా కింగిరి వాద్యం మీటుతూ చెప్పే తోటివారి 'బుర్రకథ', ఆసాదులు చెప్పే కావమ్మకథ, దశావతారం కథల్ని, పందిరిలో పాడడంవల్ల ఆ పేరుతోనే ప్రచారంలో ఉన్న 'పందిరిపాట', గంగమ్మ కథలు, కాటమరాజు కథలు చెప్పే ఉత్తరాంధ్రలో ప్రచారంలో ఉన్న 'ఓపాట' లేదా 'గొల్లసదువు'ల్ని, ముచ్చటించుకోవాలి.

**భజన సంప్రదాయం :** కులాలకు, ప్రాంతాలకతీతంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ప్రచారంలో ఉన్న పాండురంగనిని భజించే పండరిభజన, శ్రీకృష్ణుని భజించే బృందావన భజన లేదా కులుకు భజన, శ్రీరాముని స్తుతించే రాంభజన లేదా తాళభజన, చెక్క భజన, చిరుతల భజనలు, అలాగే ఉత్తరాంధ్రకు చెందిన బైటోభజన, కోనసీమ చెట్టు భజన, ఇంకా దాటు భజన లాంటివి భజన సంప్రదాయంలో ప్రధానమయిన కళారూపాలు. వీటన్నింటిలో కూడా దేవతలకి సంబంధించిన విశేషాల్ని కీర్తిస్తూ పాటలు పాడడం సాధారణంగా ఉంటుంది.

అలా గాకుండా రామాయణ కథని, ఆయా పాత్రలు వేషాలతో భజన సంప్రదాయ బాణీలో ప్రదర్శించడం "చిరుతల రామాయణం" ప్రత్యేకత. ఇందులో కథాగానంలో లాగా కథ ఉంటుంది. నాటకాలలో లాగా వేషధారణ ఉంటుంది. భజనల బాణీ ఉంటుంది.

ఈ సంప్రదాయంలో సుబ్రహ్మణ్యస్వామిని భజిస్తూ కావడిచిందు లేదా కావడిపాటలు చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధం.

కోలలు లేదా పుల్లల్ని వాద్యాలుగా చేసుకొని పాట, పాటకు తగ్గ కోపుల్ని వివిధ భంగిమల్లో ప్రదర్శించే 'కోలాట' భజన సంప్రదాయంలో మరో కళారూపం. మువ్వలు కట్టిన మూరడేసి కర్రలు వాద్యాలు. యాభైకి పైగా కోపుల విన్యాసం. పాటలలోని ఇతి వృత్తానికి అవధులు లేవు. స్త్రీలు మాత్రమే వేసే కోలాటాలని 'స్త్రీల కోలాటం'గా పరిశోధకులు వర్గీకరిస్తున్నారు. పైన కొయ్యకు తగిలించిన జడబిళ్లలోని దారాల్ని

ఒక్కొక్కరు ఒక్కొక్క దారాన్ని పట్టుకొని వివిధ కోపులతో అడుగులు, పాట, కోలాటం వేస్తూ వివిధ రకాలుగా జడ, పట్టెడ అల్లుతూ విప్పుతూ వేసే 'జడ కోలాటం' చాలా ప్రాచుర్యం పొందిన కళారూపం. స్త్రీలు తప్పట్లు కొడుతూ, కోపులు లేకుండా ఇటు అటు వంగుతూ, వాలుతూ ఆడే జక్కికి లేదా తిరగడజక్కి లేదా జట్టిజాము కూడా నేడు కొన్ని ప్రాంతాల్లో ప్రచారంలో ఉంది.

కోలాటం చాలా ప్రాచీనమయిన కళారూపం. దేవాలయ ప్రాంగణంలోని రాతిగోడలమీద కోలాటం చిత్రించబడి ఉంది. అలాగే పాల్కురికి సోమన కాలం నుంచి ఉన్న సాహిత్య కృతులలో కోలాటం పరామర్శ ఉంది.

## నాటక సంప్రదాయం :

యక్షగానం, భాగవతం, భోగాతం, భాగోతం, ఆట, బయలాట, బయల్నాటకం, భాగవతమేళ, వీధి నాటకం, వీధి భోగాతం పేర్లతో జానపదులలో ప్రచారం పొందిన నాటక సంప్రదాయం మరో ముఖ్యమయిన విభాగం. పాత్రలు, పాత్రలకు తగ్గ వేషం, పాట, పద్యం, వచనంతో కూడిన దరువులు, ద్విపదలు, కందార్థాలు, మాట, సంధి వచనం అలాగే దేవుళ్లని వేడుకొనే 'తేవారం', 'కొచ్చిగం' సంప్రదాయాలు ఈ నాటకాలలో ప్రధానంగా ఉండే విషయాలు. ఈ నాటకాలని ప్రదర్శించడం కొన్ని కులాలు తమ కుల జీవనోపాధిగా చేసుకొంటే మరి కొంత మంది ఔత్సాహికులుగా నేర్చుకొని, ప్రదర్శనలో పాల్గొనడం తమ వృత్తిగా చేసుకొన్న కళాకారులు వర్తమాన కాలంలో ఉన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఏదో ఒక పేరుతో అందరికీ అందుబాటులో ఉన్న సంప్రదాయం నాటక సంప్రదాయం.

కులవృత్తి కళాకారులు చిన్నప్పటి నుంచే పెద్దవారు ఇచ్చే ప్రదర్శనల్ని చూస్తూ, పాల్గొంటూ, అభ్యసిస్తూ, అనుభవం గడిస్తూ శిక్షణ పొందుతారు. వీరికి నాటకాలు వేయడం పారంపర్యంగా వస్తున్న ఒక సంప్రదాయం. ఇలాంటి కళాకారులకి 'త్యాగం' అన్న ఆర్థిక భరోసా ఉంది. కులవృత్తి కళాకారులు ప్రదర్శించే కళారూపాల్లో 'చిందు యక్షగానం', 'దాసరి భాగోతం' 'నేతగాని భాగోతం', 'యానాది భాగవతం', చెంచు భాగవతం, 'గోంధలే వీధి భాగవతం', 'గోండీ భాగవతం', 'మిత్తిలి అయ్యవార్ల

నాటకాలు' కనబడుతున్నాయి. దాసరులలోని ఒక తెగవారు గంటెలో నూనెపోసి ఒత్తులు వెలిగించి ఆ వెలుగులో ప్రదర్శన ఇచ్చే "గంటె భాగవతులు", వేషాలతో ఊరూర తిరుగుతూ, కొన్ని సమయాల్లో ఇల్లిల్లు తిరుగుతూ ప్రదర్శనలిస్తున్న 'బహురూపులు', 'పగటి వేషాలు', ఉత్తరాంధ్రలో కూచిపూడి భాగవతులకి సమాంతరంగా వెలిగిన 'తూర్పుభాగవతం', దేశం విడిచి తమిళనాడులో స్థిరపడ్డా తమ కళారూపాన్ని ఇంకా కాపాడుకొంటున్న 'మేలట్టూరు భాగవతమేళ', చిత్తూరు జిల్లాలో బహుళ వ్యాప్తిలో ఉన్న 'వీధి భోగాతం' లేదా 'ఆట', కర్ణాటక సమీప ప్రాంతాలలో ఉన్న 'బయలాట' కళారూపాల్ని, ఆ మూసలో వచ్చిన క్రైస్తవ నాటకాల్ని ఇక్కడ ముచ్చటించుకోవాలి.

నాటక సంప్రదాయంలోని ప్రతి కళారూపం ప్రచారంలో ఉన్న నాటక ప్రతుల్ని ఆధారంగా చేసుకొని ప్రదర్శింపబడుతుంది. అయితే సందర్భం వేరు. కులవృత్తి కళాకారులు తమకు 'కట్టడి' లేదా హక్కు కల్గిన ఊర్లకు వెళ్ళి, తమకు ఆశ్రయం ఇచ్చే కులం వారందర్నీ ఒకచోట చేర్చి తాము అడ్డివాళ్లమని, ఇన్నేండ్ల తర్వాత వచ్చామని తమకు ఇంత డబ్బు, ఇంత ధాన్యం (దీన్ని గురిజ దర్శనం, గవ్వ దర్శనం అని కూడా అంటారు) ఇవ్వమని అడుగుతారు. అలా 'త్యాగం' నిర్ణయం జరిగినాక నాటకాలు ప్రదర్శిస్తారు. రెండు మూడు రోజులయినాక ఆయా కులాల పుట్టుకకి సంబంధించిన ప్రధాన వేషాన్ని వేసుకొని (గోసంగి వేషాన్ని చిందువాళ్లు) కులపురాణాన్ని వివరిస్తారు. నాటకాలు అయిపోయినాక తమకు ఆశ్రయం ఇచ్చిన కులాలు సుఖ సంతోషాలతో, సంపదైశ్వర్యాలతో తులతూగాలని కొలుపులు, గావు పట్టడం, బలి చల్లడం చేస్తారు. ఈ కార్యక్రమం కళాకారుల్ని, వారిని పోషిస్తున్న సమూహాన్ని ఒక్కటిగా కట్టిపడవేసే సూత్రం.

చిత్తూరు జిల్లాలోని 'ద్రౌపది ఉత్సవాలు' లేదా 'ధర్మరాజు తిరణాల'లో ప్రదర్శించే వీధి నాటకాలకి ఒక ప్రత్యేకత ఉంది. పైవారి లాగా కులపట్టింపులు లేకుండా ఎవరయినా గురుముఖతః అభ్యసించి ఈ నాటకాన్ని ప్రదర్శించవచ్చు. ఈ కళాకారులు రాత్రిపూట జరిగే నాటకాలలో పాల్గొనడమే గాకుండా, మహాభారతంలోని ప్రధాన

సన్నివేశాల ఆధారంగా పగటిపూట జరిగే అనుష్ఠానాల్లో కూడా పాలుపంచుకొంటారు. బకాసురుని చంపడానికి బండెడు కూడుతో బయలుదేరుతున్న 'బండి కుంభాలు', బకాసురవధ, ద్రౌపది కళ్యాణం, పాశుపతాస్త్రం కోసం 'అర్జున తపస్సు', 'ఉత్తర గోగ్రహణం, భారత యుద్ధానికి ముందు రణభూమికి బలి ఇచ్చే 'ఇలావంతుని వధ', ఉలూచి పుత్రవియోగం, దుర్యోధన వధ కార్యక్రమాల్లో అటు ప్రజల, ఇటు కళాకారుల భాగస్వామ్యం ఉంటుంది. ఈ కార్యక్రమాల్లో ప్రజల నమ్మకవ్యవస్థ, మహాభారత కథ మీద, అందులోని పాత్రలమీద తమకున్న గౌరవం తెలుస్తుంది. ద్రౌపది కళ్యాణం పల్లెటూళ్లలో సంప్రదాయ సిద్ధంగా జరిగే కళ్యాణం లాగే ఉంటుంది. బండికూడు కార్యక్రమాల్లో మొక్కుబళ్లలో భాగంగా ప్రతి ఇంటి నుంచి అన్నం అర్పించడం కనబడుతుంది. 'అర్జున తపస్సు'లో పిల్లలు లేనివారు. కుటుంబ సమస్యలు ఉన్నవారు, రోగాలతో సతమతమయ్యేవారు అందరూ నిష్ఠతో పాల్గొంటారు. తపస్సుమానుపైనుంచి అర్జునుడు విసిరే విబూదిపండ్లు, నిమ్మపండ్లు, అరటిపండ్లు పట్టుకోవడానికి వీరందరూ ఉత్సుకత చూపిస్తారు. అవి దొరికితే తమ కోరికలు నెరవేరుతున్నట్టు భావిస్తారు. అంతేకాదు పిల్లలకోసం వరపడే స్త్రీలకు అరటిపండు దొరికితే మగబిడ్డ, విబూది, నిమ్మపండు దొరికితే ఆడబిడ్డ పుట్టుతుంది అన్న నమ్మకం బలంగా ఉంది. బండ్లకొద్ది మట్టితో దుర్యోధనుని బొమ్మను ఏర్పర్చి దుర్యోధన వధ కార్యక్రమం అయినాక కొద్ది సేపటిలోపే ఆ మట్టిని ప్రజలు తమ ఇండ్లకు తీసుకుపోతారు. అష్టైశ్వర్యాలతో, తులతూగిన ఆ దుర్యోధనునికి సంబంధించిన మట్టి కనుక దాన్ని ఇంటిలో పెట్టుకొంటే తమకు కూడా ఆ సంపద అబ్బుతుందన్న విశ్వాసం దానికి కారణం.

చిందువాళ్లు నాటకాలు పూర్తయినాక వారి కుటుంబంలోని ఒకామె 'ఎల్లమ్మ వేషం' వేస్తుంది. వేషధారణలో గవ్వల తొంగాలు, ముఖానికి పసుపు రాసుకొని కుంకుమబొట్టు పెట్టుకొని, చేతుల్లో వేప రెమ్మలు పట్టుకొని ఇల్లిల్లు తిరుగుతుంది. అనారోగ్యంతో బాధపడేవారిని ఎల్లమ్మ వేషం, గవ్వల తొంగాలతో తుడిచి బొట్టుపెట్టుతుంది. అలా పెట్టితే ఆరోగ్యం కుదుటపడుతుందని నమ్మకం. పిల్లలు

లేని స్త్రీలు ఎల్లమ్మను కౌగిలించుకొంటారు. ఎల్లమ్మ బొట్టు పెడితే పిల్లలు కలుగుతారన్న బలమైన నమ్మకం ఉంది. అలాగే ఎల్లమ్మ వేషం ఆశ్రయం ఇస్తున్న మాదిగవారి ప్రతి ఇంట్లోకి పోయి, వారింటిలోని 'కూరాడు కుండలు'లో చేయి తడిపి వస్తుంది. ఇదే సమయంలో మగవాళ్లు [1]'వాట్లవేషం' వేసుకొని వస్తారు. చిందువాళ్లకి రావలసిన 'త్యాగం'ని వసూలు చేయడం వీరి పని. వీరు 'త్యాగం' సమయంలోనే గాకుండా చనిపోయినవారి స్మృత్యర్థం ఆ ఇంటివారి కోరిక మేరకు కూడా నాటకాలు వేస్తారు. ఆ సందర్భంలో ఎక్కువగా సతీసావిత్రి నాటకం ఉంటుంది. వీళ్లు దాదాపు ముప్పై నాటకాల్ని ప్రదర్శిస్తారు. హరిశ్చంద్ర, బభ్రువాహన, మాయా శశిరేఖ, భూకైలాస్, భీష్మ విజయం, తారాచంద్ర, భద్రసేన విలాసం, చంద్రకళావిలాపం, మాంధాత, మైరావణ, డాగ్నేయోపాఖ్యానం, ఆరెమరాటీలు, కాంతామతి, గజగౌరి వ్రతం, భక్తప్రహ్లాద, భక్త సిరియాళ, సతీ తులసి, సతీ అనసూయ, విప్రనారాయణ, జయంతి జయపాల, మార్కండేయ, శంబరాసుర వధ, బాలనాగమ్మ, సుగ్రీవ విజయం, కాంభోజురాజు కథ, మాయాసుభద్ర, శ్రీకృష్ణార్జున యుద్ధం, కీచకవధ, కంసమర్దన, లవకుశ మొదలయినవి. నాటకంలోని అన్ని పాత్రల్ని మగవారే ధరిస్తారు. ఎల్లమ్మ వేషం మాత్రం స్త్రీ ధరిస్తుంది. వీరు జి. లక్ష్మణస్వామి, చెర్వీరాల బాగయ్య, గాది హనుమత్కవి, యాదవదాసు, వెంకటదాసులు రచించిన నాటకాల నుంచి తమ ప్రదర్శన నాటకాన్ని ఎన్నుకొంటారు. వీరేగాకుండా దాసరి భాగవతం, గంటె భాగవతాలలో కూడా వారు రచించిన గ్రంథాలే ప్రదర్శనయోగ్యమయినాయి.

గోంధళే భాగవతాన్ని, ఆరెకులం ఉపకులమయిన 'గొంధళే'లు ప్రదర్శిస్తారు. ఆరె భాషలో 'గొంధళే' అంటే కొలుపు అని అర్థం. కొలుపులు చేసేవారు కాబట్టి గొంధళేలు అయినారు. వీరు భవానీ మాతకు కొలుపులు చేస్తారు. వీరు ప్రదర్శించే నాటకాలలో ఏక్‌తంగ్ కథ, జయరాణి, మౌనశీలకథ, రాధాబాయి, బాలవంతి, నీలకంఠ, కాళోజి కథ, కళింగమహారాజు కథ, అర్జున వనవాసం, అభిమన్యు స్వయంవరం, భట్టి విక్రమార్క ప్రధానమైనవి. వీరు ఆరెవారున్న గ్రామాల్లో తమకు కట్టడి ఉన్న గ్రామాలకు వెళ్లి, నాటకాలు ప్రదర్శిస్తారు. 'త్యాగం' ఉంది. వీళ్ల నాటకాలలో

విదూషకుడు తప్ప మిగతా పాత్రలన్నీ ఆరె భాషలోనే మాట్లాడుతూ, పాడుతూ ప్రదర్శనలిస్తారు. విదూషకుడు మాత్రం ఆ పాటల అర్థాన్ని, వచ్చిన పాత్రల పరిచయాల్ని తెలుగులో చేస్తుంటాడు. అలాగే ప్రదర్శన ప్రారంభంలో జరగబోయే నాటకాన్ని గురించి, తమకు త్యాగం ఇచ్చేవారిని పొగుడుతూ, ప్రదర్శనల కోసం అన్ని వసతులు కల్పించిన వారికి ధన్యవాదాలు అర్పిస్తూ ప్రదర్శన మొత్తాన్ని రక్తి కట్టిస్తూ, నాటకం ప్రారంభం నుంచి మంగళం దాకా వేదిక మీద ఉండే పాత్ర ఇది.

నాటక సంప్రదాయంలోని కళారూపాలన్నింటికీ ప్రచురించబడిన నాటక ప్రతులే ఆధారం. ఈ నాటకాల ప్రదర్శనలో దరువులు, ద్విపదలు, వచనాలు ప్రధానంగా ఉంటాయి. అవి ఏ రాగంలో ఏ తాళంలో పాడాలో ఉంటుంది. భాష చాలా చోట్ల సంస్కృత సమాసాలతో కూడుకొని ఉంటుంది. అయితే వీటిని ప్రదర్శించే కళాకారులు చాలా మంది సంభాషణలలో వెసులుపాటు కల్పించుకొంటున్నారు.

వీధి నాటకాలలోనూ, కులవృత్తి నాటకాలలోనూ 'పైమేళం' ఉంటుంది. వేదిక మీద పాత్ర పాడిన దరువుని, ద్విపదని ఇతర పాత్రలు ఎత్తి పాడుతారు. ఇందులో కళాకారులందరూ పాల్గొంటారు. ఇది రానురాను తగ్గుతుంది.

జానపద నాటక ప్రదర్శనలో అనుసంధానకర్త విదూషకుడు. వేదిక మీద ఉన్న పాత్రల్ని, వస్తున్న పాత్రల స్వరూపాన్ని, స్వభావాన్ని ప్రేక్షకులకు అవసరమున్న చోట వారి దగ్గరికి తీసుకపోయే పాత్ర ఇది. పాత్రలు పాడేపాటని, మాటని శబ్దసామ్యంతో విరుస్తూ, విపరీతార్థం కల్పించి, ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించే పాత్ర ఇది. కరుణ శృంగార రసావిష్కరణలో ఏదయినా మోతాదు మించిపోతే వాటిని సమతూకంలో పెట్టగల్గిన హాస్యాన్ని పండించే పాత్ర ఇది. స్ఫూనరిజానికి ప్రతీక. వేదిక మీద లేని పాత్రల్ని అవసరమయితే పోషించే బాధ్యత కూడా ఈ పాత్ర మీదే ఉంటుంది.

వర్తమాన కాలంలో 'కథాగాన సంప్రదాయం'లోని పటం కథలు కొన్ని [1]'నాటక సంప్రదాయం' వైపు మొగ్గు చూపుతున్నాయి. డక్కలి, కాకిపడిగెల, కొర్రాజుల వారు తమ కథాగానానికి మెరుగులుదిద్ది, వేషాలు ధరించి, నాటక ఫక్కీలో కథ చెప్పి అలరిస్తున్నారు. కొంతమంది తమకున్న రాగ పరిజ్ఞానంతో కథ మధ్యలో కొన్ని

పాటల్ని చొప్పిస్తూంటే మరి కొంత మంది పాత సినిమా పాటల బాణీని అనుసరిస్తున్నారు. గౌడ జెట్టీలు గౌడ పురాణం చివర వచ్చే కంఠమహేశ్వరుడు చలమాంబ పెండ్లిని వేషాలతో నాటకంలాగా ప్రదర్శిస్తున్నారు.

**తోలు బొమ్మలు - చెక్క బొమ్మలు :**

రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఆరేడు వందల తోలుబొమ్మలాట కళాకారులు ఉన్నారు. వీళ్లలో ప్రస్తుతం ప్రదర్శనకి మెరుగులు పెట్టి కొనసాగిస్తున్నవారు కొందరు, మరి కొంతమంది తోలు బొమ్మల తయారీలో తమ జీవనాన్ని గడుపుతున్నారు. ఇంకొంత మంది ఇతర కళారూపాల ప్రదర్శనలో పాల్గొంటున్నారు. కొంత మంది మాత్రం తమ కుల విద్యను పక్కకు బెట్టి చిన్న చిన్న వ్యాపారం చేసుకొంటూ బతుకుతున్నారు.

తోలు బొమ్మలాటల్ని చూడడానికి బండ్లమీద పోయేవారని నానుడి. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో

'భారతాది కథల జీరమరుగుల
నారంగ బొమ్మల నాడించువారు
గడు నద్భుతంబుగ గంబసూత్రంబు
లడరంగ బొమ్మల నాడించు వారు' అన్న పద్య పాదాల్ని బట్టి ఆనాటికే తోటబొమ్మలాటలు ఉండేవని ఊహిస్తున్నారు కాని పై పద్యంలో 'చెక్కబొమ్మల' ప్రదర్శన కనబడుతుంది. అయితే అప్పటికి వెయ్యేండ్ల ముందు నుంచే భారతదేశంలో ఇతర ఆసియా దేశాల్లో తోలు బొమ్మలాట ప్రదర్శన ఉన్నట్టు ఆధారాలు ఉన్నాయి. అలాగే తోలు బొమ్మలాట కళాకారులకు భూదానం ఇచ్చినట్టు శాసనాలు తెల్పుతున్నాయి. కాని ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తోలుబొమ్మ కళాకారులు ఎక్కువ మంది ఆరె కులానికి సంబంధించినవారు.

నాటకాలలో లాగా పాత్రలు వేదిక మీదకు రాకపోయినా, కళాకారుల చేతిలో ప్రాణం పోసుకొన్న తోలు బొమ్మలు, చెక్కబొమ్మలు తెరచీర వెనుక నుంచి కనబడతాయి. పద్యం, పాట, మాటకు తగ్గట్టుగా తోలుబొమ్మల్ని తెరవెనుక ఆడిస్తారు.

నటునిలోని హావభావాలు, రాగతాపాలు, ఆలోచనలు, స్పందనలు అన్నీ కూడా బొమ్మల ద్వారా చూపించడం ఈ కళారూపాల ప్రత్యేకత.

ఒకనాడు తెర వెనుక కట్టిన కొయ్యమీద అక్కడక్కడ ప్రమిదలు పెట్టి, ఆముదం పోసి ఒత్తును వెలిగించి ఆ వెలుగు బొమ్మలమీద పడుతుండగా ప్రదర్శన ఇచ్చేవారు. ఆ వెలుగులో తెరముందున్న ప్రేక్షకులకి బొమ్మల ఆకారాలు చాలా స్పష్టంగా కనబడేవి. తర్వాత పెట్రోమాక్స్ వెలుతురులో, నేడు కరెంట్ దీపాల వెలుగులో ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ వెలుతురు బొమ్మ మీద పడ్డప్పుడు ప్రేక్షకులకు బొమ్మ స్పష్టంగా కనబడుతుంది. పక్కన పడ్డప్పుడు నీడ మాత్రమే కనబడి బొమ్మ మసకగా ఉంటుంది. లంకా దహనం, లక్ష్మణ మూర్ఛ, అంగద రాయబారం, మైరావణ, రావణవధ, పాతాళ హోమం లాంటి రామాయణ ఇతివృత్తాల్ని, భక్తప్రహ్లాద, గజేంద్ర మోక్షం, సతీ సావిత్రి కథల్ని, భారత ఇతివృత్తాలయిన విరాటపర్వం, ఉత్తర గోగ్రహణం, పద్మవ్యూహం, గయోపాఖ్యానం కథల్ని ప్రదర్శిస్తూన్నా లంకా దహనం, విరాటపర్వం ప్రదర్శనలకి ప్రాచుర్యం బాగా ఉన్నట్టు కళాకారులు చెప్తున్నారు. వానలు లేనపుడు 'విరాటపర్వం' కథని చెప్పితే వానలు పడతాయని నమ్మకం.

ప్రస్తుతం తోటబొమ్మలాట ఆధునిక కళారూపంగా ఇతర రాష్ట్రాల్లో ముందు కొచ్చింది. కథ పాతదే అయినా ఆధునిక సాంకేతిక సహకారంతో దాన్ని తీర్చిదిద్దుతున్నారు. అత్యాధునిక లైట్, సౌండ్, ల్యాంప్ షాడో ఉపయోగించి తోలు బొమ్మలాట ప్రదర్శన సినిమాను తలపింప చేస్తున్నారు. ఆ ప్రదర్శనలకి ప్రేక్షకుల స్పందనతోపాటు ప్రాయోజకుల సందడి కూడా పెరుగుతుంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సహకారం పుష్కలంగా ఉంది.

అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ కళారూపం పరిస్థితి అంత బాగా లేదు. సంప్రదాయ సిద్ధంగా ఆదరించిన ప్రజల భాగస్వామ్యం నేడు లేదు. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆర్థిక భరోసా ఒకటి రెండు ప్రదర్శనలకి పరిమితం అవుతుంది. ఒకరకంగా నేడు తోలు బొమ్మలాట కళారూపాల్ని మాత్రమే ప్రదర్శిస్తూ జీవనం గడిపే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో చదువుకొన్నవారి, డబ్బున్నవారి, సహకారంతో మెరుగులు

దిద్దుకొంటున్న ఆధునిక తోలుబొమ్మలాట కళారూపంతో పోటీపడి నిలదొక్కుకోవడం తెలుగు తోలుబొమ్మలాట కళాకారులకి అయ్యే పనికాదు.

నేడు కొంత మంది బోధనా మాధ్యమంగా, ప్రభుత్వ పథకాలని ప్రజల దగ్గరకు తీసుకుపోవడానికి ఈ కళారూపానికి మార్పులు చేస్తున్నారు. అయితే వాటి ప్రయోజనం అనూచానంగా కులవృత్తిగా గల్గిన వారికి ఎంత వరకు ఉంటుందో చూడాల్సి ఉంది.

చెక్క బొమ్మలాట కళారూపం వరంగల్లు, చిత్తూరు జిల్లాల్లో మాత్రమే ఉంది. వరంగల్లు జిల్లాలోని బూర్గుపేట గ్రామంలో ఒకప్పుడు ప్రదర్శనకు నోచుకొన్న చెక్క బొమ్మల్ని బుట్టలో పెట్టి అటక ఎక్కించినారు. 1995లో జానపద గిరిజన విజ్ఞానపీఠం ఈ రచయిత నేతృత్వంలో ఆ కళారూపాన్ని గుర్తించి ముప్ఫయ్యేండ్ల తర్వాత మళ్లీ ప్రజల మధ్య ప్రదర్శనకు రావడానికి దోహదం చేసింది. ఆ తర్వాత అమ్మాపురంలో నివాసమున్న వారి దాయాదులు మోతె జగన్నాథం తదితరులు కూడా చెక్క బొమ్మలాట ప్రదర్శనని మళ్లీ తెరమీదకు తీసుకువచ్చినారు. బూర్గుపేట అన్నదమ్ములు మోతె యాదగిరి, మోతె రామస్వామి ముప్ఫయేండ్లపాటు కళారూపం జోలికి పోలేదు. అమ్మాపురం వారు వీధి నాటకాలు వేస్తుండేవారు.

పైన కింద పక్కల, తెరలు కట్టి, తెరల వెనుక నిలబడి బొమ్మల్ని ఆడిస్తాడు కళాకారుడు. పై తెర వెనుక అడ్డంగా ఒక కొయ్య కడతారు. దీనికి బొమ్మల్ని తగిలించడానికి వీలుంటుంది. ఒక్కో బొమ్మ ఒకటి ఒకటిన్నర అడుగు ఉంటుంది. ఆ బొమ్మలకి దుస్తులు వేస్తారు. చూడడానికి మూడు నాలుగడుగులు ఉంటుంది. కళాకారుడు తెర వెనుక నిలబడి, తన మోచేతిని అడ్డంగా కట్టిన కొయ్యమీద ఆనిస్తాడు. ఒక్కో బొమ్మకు కీలు కీలు కదలడానికి వీలుగా దారాలు ఉంటాయి. ఆ దారాల్ని తన ఎడమ చేతి వేళ్లకు తగిలించుకొంటాడు. ఆ బొమ్మ శరీర భాగాల్ని పాటకు, వాద్యానికి అనుగుణంగా కదిలిస్తూ కుడి చేతితో బొమ్మను అటు ఇటు తిప్పుతూ ఆడిస్తాడు. కథను బట్టి కథలోని పాత్రల్ని బట్టి, ఆడించే బొమ్మల్ని బట్టి కళాకారులు ఇద్దరు ముగ్గురు ఉంటారు. పాల్కురికి సోమన చెప్పిన 'తెరచీర మరుగుల' ఆడించే

రూపం ఇదే. ప్రతి బొమ్మ ఆయా పాత్రల్ని గుర్తించే విధంగా వేషధారణతో ఉంటుంది.

వీరు ప్రదర్శించే కథలు లవకుశ, భక్త ప్రహ్లాద, ధర్మాంగద, చెంచులక్ష్మి, భక్త రామదాసు, బాల నాగమ్మ లాంటివి. వీటిలో కొన్నింటిని ప్రచురించిన పుస్తకాల నుంచి నేర్చుకొంటే మరికొన్ని వారి తాత తండ్రుల నుంచి నేర్చుకొన్నారట. వీరి గురువులు భట్రాజులట.

కథ ఏదయినా, సందర్భాన్ని కల్పించుకొని బొమ్మలతో 'కోలాటం' వేయించడం చూపరులకి కనువిందు చేస్తుంది. ఆరు చిన్న బొమ్మలతో గోపికలు, శ్రీకృష్ణుడుగా పాత్రల అలంకరణ. ప్రతి బొమ్మకు, ఆ బొమ్మ చేతిలోని కోలలకు దారాలు. ఆ దారాలన్నిటిని మరో దారానికి అనుసంధానం చేస్తారు. అది కళాకారుడి చేతిలో ఉంటుంది. అంటే ఒకే దారంతో ఆరు బొమ్మల్ని ఒకేసారి ఆడించడం అన్నమాట.

బొమ్మలన్నీ చెక్కతో చేసినవే. ఈ బొమ్మల్ని 'కమ్మరి' తయారు చేస్తే 'నాకాసోదు' కాని 'జిగురోదు' కాని రంగులు వేస్తారట. ఒక వేళ బొమ్మలకు రంగులు వెలిసిపోతే వారి చేతనే వేయిస్తారట తప్ప తాము వేయరట.

తమని ఆదరించాల్సినవారు ఆదరించకపోతే వారిని తిట్టడానికి, 'గొల్లమల్లక్క' పాత్రని సృష్టించుకొన్నారు. అసలయిన వారిని తిట్టే నెపంతో గొల్లమల్లక్కను తిట్టుతూ, కొట్టుతూ ఆడిస్తారు.

చిత్తూరు జిల్లా సంత వేలూరులో 'రామనాటకం' ప్రదర్శించే చెక్క బొమ్మలాట ఉంది. ప్రస్తుతం వీరి దగ్గర పాత బొమ్మలు లేవు. కొత్తగా చేయించి కళారూపాల్ని తిరిగి బతికించుకొని ప్రదర్శనలు ఇస్తున్నారు. వరంగల్లు జిల్లా చెక్క బొమ్మలాట కళాకారుల్ని బొమ్మలోళ్లుగా పిలుస్తున్నారు. వీరు బుడిగె జంగాలకి సంబంధించినవారు. బుడిగె జంగాలు కళాకారుల కులం. బొమ్మలోళ్లు చెక్కబొమ్మలాట ప్రదర్శనని తమ కులవృత్తిగా చేసుకొన్నవారు. ఆదరణ తగ్గినపుడు లేదా లేనప్పుడు ఇతర దారులు వెతుక్కున్నారు. సంతవేలూరు కళాకారులు ఔత్సాహిక కళాకారులు. కుల పట్టింపులు లేవు. తమ ఊరి కళారూపంగా దీన్ని మురిపెంగా చూసుకొంటున్నారు.

చిత్తూరు జిల్లా, పాలకూరులో 'ఊచ బొమ్మలాట' (Rod Puppetry) కళారూపం ఉండేది. ఇది కేవలం ఆ ఊరి దేవాలయ ఉత్సవాలలో మాత్రమే ప్రదర్శింపబడేది. ప్రదర్శన అయినాక ఆ బొమ్మల్ని ఆ ఊరి దేవాలయంలో భద్రపర్చేవారు. చెక్క బొమ్మలాటలో బొమ్మలకు దారాలు ఉంటే ఈ బొమ్మలకి ఇనుప ఊచలు ఉంటాయి. బొమ్మ చేతులు, మెడ తిరగడానికి వీలుగా ఊచల్ని - ఇనుప కమ్మీలని బిగిస్తారు. బొమ్మ రెండు చేతులకు ఉన్న ఊచల్ని, కళాకారుడు తన రెండు చేతుల్తో పట్టుకొంటాడు. తలకు సంబంధించిన ఊచని కళాకారుడు తన తలకి గుండ్రంగా ఉన్న రింగు సహాయంతో తగిలించుకొంటాడు. అలా కళాకారుడు తన రెండు చేతుల్ని, తలను ఆడిస్తూ బొమ్మని ఆడిస్తాడు. ప్రస్తుతం ఈ కళారూపాన్ని ప్రదర్శించడం లేదు గాని బొమ్మల్ని ఊరి దేవాలయంలో భద్రపర్చిఉన్నారు.

## కనుకట్టు విద్యలు / ఇంద్రజాల సంప్రదాయం :

పద్మశాలీలు ఉండే గ్రామాలకి వెళ్లి కనుకట్టు విద్యల్ని ప్రదర్శించడమే తమ కులవృత్తిగా చేసుకొన్నవారు సాధనాశూరులు. వీరు జలస్తంభన, అగ్ని స్తంభన, వాయు స్తంభన అన్న ఇంద్రజాల ప్రదర్శనలలో ప్రచారం పొందిన కనుకట్టు విద్యల్ని ప్రదర్శిస్తారు. మనిషిని కూర్చోబెట్టి అతని తలమీద కుంపటి లేదా పొయ్యి పెట్టి రగిలించి పెనుము పెట్టి నూనె పోసి అందులో వడలు కాల్చి చూపరులకు ఇచ్చే అగ్నిస్తంభన, ముక్కులోని ఒక రంధ్రం నుంచి నీళ్లు పైపు ద్వారా పంపిస్తే మరో ద్వారం గుండా నిర్విరామంగా బయటికి వచ్చే జలస్తంభన, చిలకకి తగిలించిన బెండు త్రాసులో కూర్చొని జనం ముందుకు వచ్చే వాయుస్తంభన విద్యల్ని వీరు ప్రదర్శిస్తారు. బిందెడు నీళ్లలో పసుపు, సున్నం కలిపిన పొడిని కల్పి, కలియబెట్టి అందులోనుంచి ఆ పొడిని పిడికిలితో తీయడం, ఒక వ్యక్తిని ఒక గుంజకు కట్టివేసితే అతను మరో గుంజ దగ్గర ప్రత్యక్షం కావడం వారు చేసే మరికొన్ని విద్యలు.

కురుమవారిని ఆశ్రయించి మెడలో కత్తి దూర్చడం, వడ్లని పేలాలు చేయడం, మనిషిని పూడ్చి పెట్టితే లేచి రావడం, చెట్లకి కాయలు పుట్టించడం లాంటి విద్యల్ని ప్రదర్శించేవారు బీరప్పలు. నోటిలో నుంచి తేళ్లు, పాములు దీసేవారు

తెల్లపాములవాళ్లు, విప్రవినోదులు, కాటి పాపలు, పెద్దమ్మలవాళ్లు. తెల్లపాములవాళ్లు, విప్రవినోదులు వీటితోపాటు విబూధి సృష్టిస్తారు. విప్రవినోదులు విగ్రహాల్ని సృష్టిస్తారు. మోడి ఒక రకంగా కనుమరుగయినట్టే. మామూలు కాగితాన్ని చించి కరెన్సీ నోట్లు, గడ్డి పోచలతో కరెన్సీ నోట్లు తయారు చేసే గారడివాళ్ల వ్యాప్తి కూడా తగ్గిపోయింది. నోటిలో నుంచి తేళ్లు పాముల్నే గాకుండా మెడలో కత్తిని దోపడం, గరిగె నుంచి పైసలు రాల్చడం లాంటి విద్యలు ప్రదర్శిస్తున్న పెద్దమ్మల వాళ్లు తెలంగాణాలో ఉన్నారు.

## సాధన విద్యలు / సాము విద్య సంప్రదాయం :

సాధన చేసి, వాటిని ప్రదర్శిస్తున్న వాటిలో కత్తిసాము, కర్రసాము, కవ్వాయి కట్టెలు, మరగాళ్లు, దొమ్మరాట, గడకొయ్యాట, వీరతాడు (గొల్లల జాటీ దెబ్బలు) ప్రధానంగా ఉన్నాయి. కత్తిసాము, కర్రసాము ఒకనాటి యుద్ధ విద్యల్ని తలపింపజేస్తాయి. కండ్లకు గంతలు కట్టుకొని కత్తిని తిప్పుకొంటూ వచ్చి పండుకొని ఉన్న వ్యక్తి కడుపు మీద ఉన్న టెంకాయని పగలగొట్టడం, తమలపాకు కట్టను తెగ్గొట్టడం, అలాగే కంటి మీద ఉన్న దారాన్ని తెంపడం, సూదిని విరగ్గొట్టడం లాంటి విద్యల్ని కత్తిసాము అభ్యసించిన వారు చేస్తున్నారు. చేతులతో కర్రను తిప్పుతూ విన్యాసాలు చూపించేది కర్రసాము. ఒకే కర్రను తిప్పుతూ పలు విన్యాసాలు, రెండు చేతులతో రెండు కర్రల్ని తిప్పుతూ విన్యాసాలు చేస్తారు. దివిటీలతో కూడా విన్యాసాలు చేస్తారు.

మరగాళ్లు లేదా కొయ్యకాళ్లు మరో సాధన విద్య. రెండు రెండున్నర అడుగులు ఉన్న కొయ్యలమీద పాదాన్ని కట్టుకొని ప్రదర్శించే కళ. కళాకారుడి కాళ్లు భూమిని అంటవు. కొయ్యలమీదనే ఉంటూ ప్రదర్శన ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత.

దొమ్మరాట, గడ కొయ్యాటలు ప్రాచీన కాలం నుంచే ఉన్నాయనడానికి నిదర్శన పాల్కురికి సోమన కృతులే. రెండు పక్కల రెండు కొయ్యల్ని నాటి, వాటికి కట్టిన తాడు మీద నడవడం, మొగ్గలేయడం లాంటి ప్రదర్శనలు ఇస్తారు.

కీలుగుర్రాలు మరో కళారూపం. గుర్రాల్ని తయారు చేసుకొని, గుర్రం మధ్యలో

తాను చేరుకొని, గుర్రపు కళ్ళాల్ని చేతపట్టుకొని, వాద్యాలకనుగుణంగా చేసే ప్రదర్శన ఇది. కళాకారులు రాజు, రాణి వేషాలతో ఉంటారు. ఆ భేదం గుర్రాలలో కూడా కనబడుతుంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో, అనంతపురం జిల్లాలో మాత్రమే అది కూడా ఒక్కో బృందం మాత్రమే ఉన్నాయి.

## వాద్య సంప్రదాయం :

ఉత్తరాంధ్రలో పైడితల్లి ఉత్సవాలలో ప్రధాన కళారూపం తప్పెటగుళ్లు. రొమ్ముకు తప్పెటలని కట్టుకొని, వివిధ విన్యాసాలు చూపిస్తారు. పై కెగిరి కాలు మడతపెట్టి కింద పడడం లాంటి క్లిష్ట విన్యాసాలు కూడా చేస్తారు. అర్ధ చంద్రాకారంలో చిన్న గిన్నె ఆకారంలో తప్పెట ఉంటుంది. ఒకప్పుడు పైభాగాన్ని మేక చర్మంతో మూసేవారు కాని ప్రస్తుతం రేకులతో మాత్రమే చేసుకొంటున్నారు. వీళ్లు ప్రధానంగా గంగమ్మని ప్రార్థిస్తూ జరిపే జాతర్లలో తమ ప్రదర్శనని ఇస్తారు. వీరు ఆ వాద్యాన్ని వాయిస్తూ రామాయణం కథల్ని చెప్పేవారు. ప్రస్తుతం కేవలం తప్పెటగుళ్ల విన్యాసం మాత్రమే బయట ప్రదర్శనలిస్తున్నప్పుడు ఉంటుంది.

అనంతపురం జిల్లాలో గంగమ్మ దేవతకి, అక్కమ్మ దేవతలకి కొలుపులు చేస్తూ, మేలుకొలుపు గేయాలు, పరాకుపాట, మంగళం పాటల్ని ఉరుము వాద్యం వాయిస్తూ పాడుతారు. కంచు డ్రమ్ము ఇరువైపుల మేక చర్మంతో కప్పుతారు. ఎడమ పక్క పుల్లతో రాస్తూ కుడిపక్క పుల్లతో కొట్టుతూ వాయించే వాద్యం ఇది. ఎడమ పక్క శబ్దం గంభీరంగా ఉంటుంది. ఉరిమినట్టు ఉంటుంది. అందుకే దీన్ని 'ఉరుము' అంటున్నారు. క్రీడాభిరామంలో [1]ఉరుము చప్పుళ్ల ప్రస్తావన ఉంది.

నల్లగొండ జిల్లాలో వ్యాప్తిలో ఉన్నవి ఒగ్గుడోలు, బీరప్పడోలు. పెద్ద ఇత్తడి డ్రమ్ముని రెండు పక్కల మేక చర్మంతో కప్పుతారు. జిల్లేడు, సీతాఫలం పుల్లలతో మాత్రమే వాయించేవారు. కురుమ వారి పెండ్లిండ్లలో ఒగ్గు డోలుని పవిత్రంగా చూసుకొంటారు. బీరప్ప పండుగలలో, మల్లన్న జాతర్లలో, శివాలయాల్లో ఒగ్గుడోలు, బీరప్ప డోలుని వాయించడం ఆచారంగా ఉండేది. బీరప్పలు బీరప్ప డోలుని, ఒగ్గువాళ్లు ఒగ్గుడోలుని ఆయా సందర్భాలలో వాయిస్తారు. ప్రస్తుతం ఒగ్గుడోలు మీద శిక్షణా శిబిరాలు నిర్వహించి చాలా మందికి తర్ఫీదు ఇచ్చారు. ఇపుడు బయటి

ఉత్సవాలలో, జాతర్లలో కూడా ఈ డోళ్ల విన్యాసం ఇస్తున్నారు. తప్పెట గుళ్ళు, డప్పుల లాగే ఒకరి మీద ఒకరు ఎక్కి విన్యాసాలు చూపించడం ఉంది.

శివుని కీర్తిస్తూ, రాజేశుని తలమీద పెట్టుకొని, ఊరూరా తిరుగుతూ, యాచన చేసే రాజన్నలు ఉపయోగించే వాద్యం చామల్లాలి డోలు. రెండు ఇనుప కమ్మిల్ని గుండ్రంగా వంచి ఒకదాన్ని మేక చర్మం, మరోదాన్ని దుప్పి చర్మంతో మూస్తారు. వీటిని ఇత్తడి డ్రమ్ముకి చెరోపక్క పెట్టి బిగిస్తారు. ఉరుము, డోలు వాద్యాల లాగా. తంగేడు, ఫేను పుల్లల్ని అవి పచ్చిగా ఉన్నప్పుడే కొసల్ని వంచి దారంతో కట్టుతారు. దీంతో ఆ పుల్లలు చివర వంగి, ఉరుము వాద్యాన్ని వాయించినట్టు ఒక పక్క రాస్తూ వాయిస్తారు. ఈ వాద్యం మీద ఒకప్పుడు ముప్పై మూడు రకాల దరువులు వేసేవారట.

పంబ వాద్యాన్ని పంబవారు ఉపయోగిస్తారు. గుండ్రంగా మల్చిన డ్రమ్ములాంటి కొయ్యకు రెండు పక్కల చర్మంతో మూసి దారాలతో బిగించిన వాద్యం పంబ. ప్రస్తుతం కొయ్య స్థానంలో ఇత్తడి డ్రమ్ముని వాడుతున్నారు. అరడుగు వ్యాసార్ధంలో ఉంటుంది. ఒక పంబని వాడరు. ఎపుడూ రెండు ఉంటాయి. దీన్ని పంబజోడు అంటారు. పంబజోడు వాయిస్తూ శక్తి కథాచక్రంలోని కథాగేయాల్ని పాడుతారు.

ఒకనాటి సాంస్కృతిక నేపథ్యంలోనే గాకుండా ఇతర సందర్భాలలో కూడా విభిన్న దరువులతో అలరిస్తున్న వాద్యం డప్పు. పలకలు, డప్పులుగా వివిధ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న కళారూపం నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఉంది.

డప్పుకన్నా చిన్నది కనకడప్పు. ఈనాడు పాటలు పాడేటపుడు దీన్ని ఎక్కువగా వాడుతున్నారు.

నాలుగు నాలుగున్నర ఎత్తు ఉన్న ఇత్తడి డ్రమ్ముని ఒకపక్క మేక చర్మంతో, మరో పక్క ఇత్తడి ప్లేటు పెట్టి వాటిని దారాలతో బిగించిన వాద్యం రుంజ. మేక చర్మం కప్పిన భాగం పైకిపెట్టి వాద్యాన్ని భూమికి అనించి చేతి వేళ్లతో వాయిస్తూ కథలు చెప్పుతారు. విశ్వబ్రాహ్మణుల ఆశ్రితకులంగా రుంజని వాయించే రుంజవాళ్లని గుర్తిస్తున్నారు. రౌంజకాసురుడనే రాక్షసుని విశ్వబ్రహ్మ అయిదు ఖండాలుగా ఖండించి, తన అయిదుగురు కొడుకులకు ఇచ్చి వాద్యం తయారు చేయమంటాడు. వారు

తయారు చేసిన వాద్యాన్ని చూసి దేవతలే భయపడ్డారు. వాయించడానికి ఎవరూ ముందుకు రాలేదు. అపుడు విశ్వబ్రహ్మ తన చెమటనుంచి ఆరో కుమారుని పుట్టించి వాడికి రుద్రాంగుడు / రుద్ర మహేశ్వరుడు అని పేరు పెట్టి, రుద్రాంగుని ఆ వాద్యాన్ని మెడకు తగిలించుకొని వాయించమంటాడు. అతను అలా వాయిస్తూ విశ్వబ్రాహ్మలకు ఆశ్రితుడై బతకమంటాడు. అలా విశ్వబ్రాహ్మల ఇండ్లలో పెండ్లి, జననం, గృహప్రవేశం లాంటి శుభ సందర్భాలలో వీరు విశ్వబ్రాహ్మణుల వంశాగమనం, విశ్వబ్రాహ్మణుల మూలస్తంభం, వీర బ్రహ్మేంద్రస్వామి చరిత్ర, పంచముఖ బ్రహ్మ ఆవిర్భావం, పార్వతి కళ్యాణం లాంటి కథల్ని రుంజ వాద్యాన్ని వాయిస్తూ చెప్పి జీవనం గడుపుతున్నారు. ప్రస్తుతం వీరి సంఖ్య అతి స్వల్పం.

బైండ్ల, ఆసాదులు వాడే జమిడిక మరో ప్రధాన వాద్యం. దాంతో పాటు 'కొమ్ములు' కూడా పలు ప్రాంతాల్లో వ్యాప్తిలో ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో 'చిలంబాట్టం' - చిలంబు అంటే అందియల్ని చేత్తో అటు ఇటు కదిలిస్తూ ఆడే ఆట వ్యాప్తిలో ఉంది. మోకాళ్లదాకా పెద్ద పెద్ద అందెల్ని ధరించి ముందు 'రామడోలు' అన్న పెద్ద నగారా వాయిస్తుండగా దానికి అనుగుణంగా కాళ్లని ఆడిస్తూ, అడుగులు వేసే 'గరిడీ' తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. అందెల్ని కదిలిస్తూ ఉంటే వచ్చే సవ్వడి గజ్జెల సవ్వడి లాగా మనోహరంగా ఉంటుంది. కాని అందెలు ఒక్కోటి రెండు కిలోల బరువుతో, పన్నెండు అందెల్ని తొడుక్కొని విన్యాసాలు ఇవ్వడం సామాన్య విషయం కాదు. జాతర్లలో కనబడే మరో కళారూపం 'గరగలు'.

## అనుకరణ సంప్రదాయం :

గంగిరెద్దులాట, కోతి ఆట, ఎలుగుబంటి ఆట, పాము-ముంగీస ఆటల్ని ఆయా జంతువుల్ని మచ్చిక చేసుకొని ప్రత్యక్షంగా ఆడిస్తారు. అలా గాకుండా ఆయా జంతువుల్ని, పక్షుల్ని, దేవతల్ని అనుకరిస్తూ వేసే వేషాలలో పులివేషం, నెమలి వేషం / నెమలాట / కుంచెల నృత్యం, నామాల సింగడు, భేతాళవేషం, వీరబాహు, అలుగు / పోటు వేషం, నరసింహ వేషం, నక్కలోళ్ల వేషం లాంటివెన్నో వేషాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. అనుష్ఠానాల్లో భాగంగా 'లక్ష్మీదేవర', ఎల్లమ్మ, గోసంగి, కాళిక, మహిషాసుర మర్దని వేషాలు కనబడుతున్నాయి. మెడలో పూసల దండ, తలకు రంగు రుమాలు,

చేతిలో కంజీర వాద్యం వాయించుకొంటూ ఖురాన్‌లోని పవిత్ర పదాల్ని వల్లిస్తూ ఇంటింటికి తిరుగుతూ 'అల్లా'ను కీర్తించే ఫకీరు వేషం కూడా వ్యాప్తిలో ఉంది.

## నృత్య సంప్రదాయం :

గుస్సాడి, ధింసా, కొమ్ము, గొరవయ్యలు, లంబాడా, కోయ నృత్యాలు నేడు బహుళ ప్రచారంలో ఉన్నాయి. దేవునికి ప్రతిరూపంగా మారిన గోండుల్ని 'గుస్సాడీ'లంటారు. గుస్సాడి టోపీ, పొట్టేలు కొమ్ము, గోగునారతో చేసుకొన్న గడ్డాలు, మీసాలు, జింక చర్మం, జోరీ సంచి, పూసల దండ, గుస్సాడి రోకలి, లంగోటాలు – ఇదీ గుస్సాడి వేషం. గుస్సాడీలు ఎనిమిది రోజులపాటు గోండుల గూడెంలో నియమ నిష్ఠలతో ఉదయం సాయంత్రం ఇంటింటికి తిరుగుతారు. పర్రాపెట్టె, డోలక్, డొల్కి మద్దెల, తాళాలు, కొమ్ము వాద్యాల్ని వాయించుకొంటూ తిరుగుతారు. ఇది ఒక రకంగా వేటని అనుకరిస్తున్నట్టుగానే ఉంటుంది.

సంక్రాంతి సమయంలో మాత్రమే హరికీర్తనలు పాడుతూ, ఇల్లిల్లు తిరుగుతూ భిక్షం స్వీకరించేవారు హరిదాసులు. తెల్ల ధోవతి లేదా కాషాయ దుస్తులు, మెడలో తులసిమాల లేదా రుద్రాక్షమాల, పూలమాల, ముఖాన నామం, భుజంపైన తంబూర, చేతిలో చిరుతలు, నెత్తిమీద భిక్షాపాత్ర ఇదీ వేషం. వైష్ణవులు కనుక విష్ణువుకి సంబంధించిన, ముఖ్యంగా రామదాసు కీర్తనల్ని పాడుతూ, 'హరిలో రంగా హరీ' అని అంటూ ఇల్లిల్లు తిరుగుతారు. హరిదాసులుగా దాసరి, సాతానీ, భట్రాజు కులాలకి సంబంధించినవారు ఉన్నారు. వీరికి 'కట్టడి' ఉంది. సంవత్సరానికొకసారి గ్రామానికి వచ్చి తెల్లవారుఝామునే ఇల్లిల్లు తిరుగుతూ దీవించేవారు గంటసాయిబులు. వీరిని గుదగంటోలని, గిలకలోళ్లని అంటారు. నల్లటికోటు, ఎర్రటి తలపాగా, ఫ్యాంటు, వెనుకకు వేలాడుతూ గంట, చేతిలో చిన్న ఢమరుకం, భుజం మీద ఉన్న కర్రకు ఒకవైపు హరికేన్ లాంతరు మరో వైపు సంచి – ఇదీ వేషం. తెల్లవారుఝామునే ఇల్లిల్లు తిరుగుతూ

"అల్లా దీవెన కలగాలి,
అందరూ చల్లగుండాలి

పాడిపంట దీవెనగల్గాలి
కొడుకు కూతుళ్లు చల్లగుండాలి
అల్లా దీవెన గలగాలి

అంటూ దీవిస్తూ మరో ఇంటికి వెళతారు. బుడబుక్కలవారు కూడా ఇలాగే దీవిస్తారు.

ఈ కళారూపాలు ఏవీ కూడా మూస పోసినట్టు ఒకే విధంగా అన్ని ప్రాంతాల్లో ఉండవు. ఆయా ప్రాంత వనరుల కనుగుణంగా వాటిలో వైవిధ్యం ఉంటుంది. వైవిధ్యం కల్గి ఉండడమే జానపద కళారూపాల జీవ లక్షణం. రాష్ట్రం మొత్తం మీద ప్రచారంలో ఉన్న కళారూపాల సంఖ్య పరిమితం. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో, ఏ జిల్లాకి ఆ జిల్లాలో ప్రదర్శింపబడే కళారూపాలే అధికంగా ఉన్నాయి.

తెలుగువారి జీవన వైవిధ్యాన్ని తెలియజేసే జానపద విజ్ఞాన బహుముఖాంశాల్ని ఊరూర తిరిగి సేకరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం చేయూత నిచ్చి ఈ యజ్ఞాన్ని ముందుకు నడిపించాలి.

ఒకనాటి తెలుగువారి జీవన వైవిధ్యాన్ని సేకరించి, సంకలించి హాలుడు 'గాథా సప్తశతి'ని మనకు అందించాడు. తెలుగు సాహిత్యంలో అక్కడక్కడ తప్ప తెలుగువారి జీవన విధానం మీద, ధ్యాస ఉన్న కావ్యాలు రాలేదనే చెప్పాలి. ఆనాటి తమిళుల జీవన వైవిధ్య, సంకలనమే 'సంగ సాహిత్యం'. దాన్ని మురిపెంగా చూసుకొంటూ, ఖండాంతరాలలో ప్రచారం చేసుకొంటూ, తమ విజ్ఞాన సంపదకు గర్వపడుతున్నారు. ఆ అదృష్టం తెలుగువారికి లేకపోయింది. ఇంకా కొంతమంది అనుభవంలో అలనాటి జీవన వైవిధ్యం కొంత వరకు ఉంది. మరికొంతమంది మనస్సుల్లో ఉంది. కొంత కనుమరుగయిపోయింది. ప్రపంచ తెలుగు మహాసభలు జరుపుకొనే ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూనుకొని సేకరించడానికి ప్రయత్నిస్తే మన అదృష్టం.

## చూసిన గ్రంథాలు


1. మిన్నేరు (సం) నేదునూరి గంగాధరం, ప్రాచీన గ్రంథావళి, రాజమహేంద్రవరం, 1968.
2. తెలుగు జానపద గేయ సాహిత్యము, బి. రామరాజు, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు, తృతీయ ముద్రణ, 1990.
3. త్రివేణి, (సం) బి. రామరాజు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, నేదునూరి గంగాధరం, తూమాటి దొణప్ప, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, ద్వితీయ ముద్రణ, 1986.
4. స్త్రీల రామాయణపు పాటలు, (సం) కృష్ణశ్రీ, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, ద్వితీయ ముద్రణ, 1986.
5. మధుర కవితలు, ఎల్లోరా, విజయ పబ్లిషింగ్ కంపెనీ, విజయవాడ, 1961.
6. కాటమరాజు కథలు, రెండవ సంపుటము, (సం) తంగిరాల వేంకట సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1978.
7. జానపద గేయాలు, (సం) అవసరాల అనసూయాదేవి, ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ, 1983.
8. స్త్రీల పాటలు, (సం) అవసరాల అనసూయాదేవి, రచయిత, మద్రాసు, 1986.
9. ప్రేమ విరహం, (సం) వింజమూరి సీతాదేవి, రచయిత, మద్రాసు, 1992.
10. జానపద గేయ గాథల్లో స్త్రీ, మూలె విజయలక్ష్మి, ఎమ్బిఎమ్మార్ ప్రచురణలు, నిడుజువ్వి.
11. లేబూరు జానపద గేయ సంస్కృతి, కట్టమంచి మహాలక్ష్మి, సాయి ప్రచురణలు, తిరుపతి, 1998.
12. జానపద శృంగార గేయాలు, పేట శ్రీనివాసులు రెడ్డి, విష్ణువంశీ ప్రచురణలు, తిరుపతి, 1989.
13. కోనసీమలో జాలరి పాటలు, ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, సిద్ధాంత గ్రంథం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
14. జానపద గేయగాథలు - నిర్మాణం - సమాజం - సంస్కృతి, ఎ. సుబ్బరామిరెడ్డి, శ్రీ లక్ష్మి పబ్లికేషన్స్, కడప, 1991.

15. జానపద విజ్ఞానంలో పరిశోధనలు - సంక్షిప్త వివరణ, (సం) భట్టు రమేష్, దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ, తిరువనంతపురం, 2004.
16. జానపద విజ్ఞాన సమాలోచన, యస్. భక్తవత్సల రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1995.
17. రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాలు, (సం) యస్. భక్తవత్సల రెడ్డి, బిట్టు వెంకటేశ్వర్లు, చిగిచర్ల కృష్ణారెడ్డి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, వరంగల్, 2001.
18. మన పల్లెటూళ్ల పాటలు - అమ్మాపురం, (సం) యస్. భక్తవత్సల రెడ్డి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు, 2004.
19. తూర్పు గోదావరి జిల్లా జానపద ఆటలు, (సం) యస్. భక్తవత్సల రెడ్డి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు, 2004.
20. జానపద విజ్ఞాన దర్శిని - చేల్లపల్లి, (సం) యస్. భక్తవత్సల రెడ్డి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు, 2005

Blank Page

Blank Page

## ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యల లు చేపట్టడం.
- తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగువారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
- తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

**తెలుగు భాష వికాసం** **తెలుగు సంస్కృతి ప్రకాశం**

**దేశ భాషలందు తెలుగు లెస్స**